




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 15.01.2026 | సంపుటి :12 సంచిక : 177 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370








హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





'జనంసాక్షి' పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు సంక్రాంత్రి పండుగ శుభాకాంక్షలు.

## సెలవు..

పండుగ సందర్భంగా నేడు కార్యాలయానికి సెలవు. కావున రేపటి సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం

# సోషల్ మీడియాలో ఓవరాక్షన్ చేస్తే జాగ్రత్త!

## కఠిన చర్యలు తప్పవు



**వ్యక్తిత్వ హననం, ఫేక్ న్యూస్‌లపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరిక**

**వ్యక్తులు, కుటుంబాలపై తప్పుడు వార్తలు సరికాదని వెల్లడి**

**హైదరాబాద్(జనంసాక్షి):** చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారి గౌరవానికి భంగం కలిగించేలా ఓ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానళ్లలో కథనాలు ప్రసారమైన నేపథ్యంలో డీజీపీ స్పందించారు. 'సోషల్ మీడియా అత్యుత్సాహంపై గతంలోనే హెచ్చరించాం. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు. వ్యక్తులు, కుటుంబాల గురించి తప్పుడు వార్తలు వేయవద్దు. వ్యక్తిగత అంశాలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేయకూడదని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననంపై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశర చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు. సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్కులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరోమారు స్పష్టం చేశారు. చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిజిపి అన్నారు .అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్దాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్ల కసరత్తు

**హైదరాబాద్(జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం పురపాలక శాఖ రిజర్వేషన్ల కసరత్తు ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా స్థానాల సంఖ్య ఖరారు చేసింది. 121 ము న్సిపాలిటీల్లో ఛైర్ పర్సన్ల సంఖ్యను ఖరారు చేసింది. మున్సిపాలిటీల్లో జనరల్ 30, జనరల్ మహిళ 31, ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2, ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8, బీసీ జనరల్ 19, బీసీ మహిళలకు 19 స్థానాలను కేటాయిస్తున్నారు.పది కార్పొరేషన్లలో జనరల్ 1, జనరల్ మహిళ 4, బీసీ జనరల్ 2, ఎస్సీ 1, ఎస్టీ 1, బీసీ మహిళలకు 1 స్థానాలను కేటాయిస్తున్నారు. 17న రిజర్వేషన్లు ఖరారు చేయ నున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ స్థానాల కేటాయింపు.. డెడికేటెడ్ నివేదిక ఆధా రంగా బీసీ స్థానాల సంఖ్య కేటాయింపు జరుగుతోంది.




## మహిళా ఐఏఎస్ కథనం కేసులో..

# ముగ్గురు జర్నలిస్టుల అరెస్టు

- కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు
- అన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం
- కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా అరెస్ట్ చేశాం
- మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తలు ప్రసారం చేసిన కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు దూకుడు పెంచారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తరపున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్లను మిగతా 2లో..



## అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన:కేటీఆర్

పండగపూట కక్షసాధింపు చర్యలు తగవు: హరీశ్

2లో..

## జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కార్ తీరు అనైతికం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



# అంబరాన్నంటిన సంక్రాంతి వేడుకలు

- ఏపీలో జోరుగా కోడి పందాలు
- భారీగా తరలివచ్చిన ఇరు రాష్ట్రాల వీక్షకులు
- దేశ ప్రజలకు మోడీ సంక్రాంతి శుభాకాంక్షలు

**విజయవాడ/హైదరాబాద్(జనంసాక్షి):** ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల మిగతా 2లో..



# ఇరాన్‌నుంచి భారతీయులు వెనక్కి వచ్చేయండి

**భారతీయులకు విదేశాంగశాఖ సూచన**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇరాన్‌లో ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో.. అక్కడి భారత రాయబార కార్యాలయం ఆ దేశంలో ఉంటున్న మన పౌరులను అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో దేశాన్ని వీడాలని సూచించింది. మరో వైపు భారత విదేశాంగశాఖ సైతం.. తదుపరి నోటీసు ఇచ్చేవరకు ఆ దేశానికి ప్రయాణించొద్దని సూచించింది. "స్థానికంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఇరాన్‌లోని భారత పౌరులు, భారత సంతతికి చెందినవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆందోళనలు, ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలి. భారత పౌరులు తమ పాస్‌పోర్ట్‌లు, గుర్తింపు కార్డులు సహా ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఎంబసీలో రిజిస్టర్ కాకపోతే వెంటనే చేసుకోవాలి" అని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. ఇరాన్‌లో మిగతా 9లో..

# తలసానిపై కేసు

**ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదు**



**హైదరాబాద్(జనంసాక్షి):** మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి నేత తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి తలసాని చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రవికిరణ్ దేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఆర్ నగర్ పోలీసులు తెలిపారు.

# జుబీన్ గార్గ్‌ది హత్య కాదు..!

**సింగపూర్ పోలీసుల వెల్లడి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ అనుమానాస్పద మృతి కేసులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఆయన ఆత్మహత్యకు పాల్పడటం లేదా ఎవరైనా ఆయన్ను నీటిలో తోసివేసినట్లు ఆధారాలేమి మిగతా 2లో..

# ప్రపంచం ముంగిట సగర్వంగా నిలిచేలా

## దావోస్‌లో తెలంగాణ నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30 ప్రకటన



- అత్యాధునిక విభాగాల్లో సామర్థ్యాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి
- గ్రీన్ ఫార్మా సిటీ, ఫ్లాగ్‌షిప్ ఫార్మా విలేజస్ కార్యక్రమాలతో గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ స్థానం మరింత బలోపేతం
- జీనోమ్ వ్యాలీలో బయో వృద్ధి దశ సంస్థల కోసం తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న గ్రోత్-ఫేజ్ సెంటర్, బయోఫార్మా స్కేల్-అప్ తయారీ కేంద్రం
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ సెంటర్ హైదరాబాద్‌లో స్థాపితం

## 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యం

**హైదరాబాద్(జనంసాక్షి):** అధునాతన చికిత్సలు, డేటా ఆధారిత పరిశోధనలు, ప్రిసిషన్ మెడిసిన్, సస్టైనబిలిటీ వంటి అంశాల ఆధారంగా ప్రపంచ లైఫ్ సైన్సెస్ రంగం వేగంగా మార్పులు చెందుతున్న తరుణంలో, తెలంగాణ రాష్ట్రం పరిమా ణానికి మాత్రమే కాకుండా విలువ, ఆవిష్కరణలు, గ్లోబల్ సమగ్రత ద్వారా నాయకత్వం వహించాలనే స్పష్టమైన, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగుతోంది.తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో, ప్రపంచ పరిశ్రమ నాయకులు, సీనియర్ ప్రభుత్వాధి కారుల మధ్య దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2026లో ఆవిష్కరించనున్నారు. ఈ విధానం రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో కీలక మలుపుగా నిలవనుంది. తెలంగాణకు ఉన్న బలమైన తయారీ రంగ పునాదులను మరింత సమీకరించడంతో పాటు, అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి రంగంలో గ్లోబల్ స్థాయిలో పోటీ చేయగల కేంద్రంగా రూపాంతరం చెందేందుకు ఈ పాలసీ దిశానిర్దేశం చేస్తుంది. హైదరాబాద్ ఇప్పటికే ఇలీ లిల్లీ, సానోఫీ, ఎంఎస్‌డీ, నోవార్టిస్, ఆమెజాన్, బీఎంఎస్ వంటి అనేక ప్రముఖ గ్లోబల్ ఫార్మాస్యూటికల్ కంపెనీల కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది. భారతదేశ ఔషధ ఉత్పత్తిలో సుమారు 40 శాతం వాటా కలిగిన తెలంగాణ... దశాబ్దాలుగా ఫార్మా తయారీ రంగంలో ప్రపంచ నాయ కత్వాన్ని సాధించి, ఆర్థిక శక్తి కేంద్రంగా, చురుకైన పారిశ్రామిక హబ్‌గా పేరు తెచ్చుకుంది. ఈ బలమైన పునాదిపై ఆధారపడి, ముఖ్యమంత్రి రేవంత్ రెడి మిగతా 2లో..

# 'సీఎం మార్పు'పై తేల్చేయండి

- కర్ణాటక పర్యటన వేళ రాహుల్‌ను కోరిన సిద్ధరామయ్య
- సంక్రాంతి తర్వాత ఇరువురూ ఢిల్లీ రావాలన్న కాంగ్రెస్ అగ్రనేత
- ఎయిర్‌పోర్టులో రాహుల్‌తో డీకే, సిద్ధరామయ్య కీలక భేటీ
- కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయంపై ఉత్కంఠ
- జనవరి 16న ఢిల్లీకి వెళ్తాను : డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- సీఎం మార్పుపై మేమిద్దరమే మాట్లాడాలి : సీఎం సిద్ధరామయ్య

**బెంగుళూరు(జనంసాక్షి):** రాహుల్ గాంధీ తాజా పర్యటనతో 'సీఎం మార్పు' అంశం కర్ణాటకలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై ఒక్కో వైపు నుంచి ఒక్కో రకం సమాచారం బయటికొస్తోంది. షరా మామూలుగానే సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ లేదు లేదు, కాదు కాదు అని మంగళవారం రోజు బదులిచ్చారు. కానీ దీనిపై చర్చించేందుకు సంక్రాంతి తర్వాత ఢిల్లీకి రావాలని సిద్ధరామయ్య, డీకేలకు రాహుల్ సూచించారని కాంగ్రెస్ వర్గాలు చెప్పాయి. ఈనేపథ్యంలో బుధవారం కర్ణాటక డిప్యూటీ సీఎం స్వరం మార్చారు. జనవరి 16న ఢిల్లీకి వెళు_న్నానని ప్రకటించారు. సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ, దీనిపై మాట్లాడే అధికారం తనకు, డీకేకు మాత్రమే ఉందన్నారు. ఇంతకీ కన్నడ నాట మిగతా 2లో..



# ప్రయత్నాలు విఫలమైనా.. ప్రార్థనలు విఫలం కావు

**డీకే శివకుమార్ ఆసక్తికర పోస్ట్**

**బెంగళూరు(జనంసాక్షి):** కర్ణాటకలో నాయకత్వ మార్పు జరగనుందంటూ కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. 'ప్రయత్నాలు విఫలమైనప్పటికీ ప్రార్థనలు విఫలం కావు' అంటూ ఆయన మిగతా 2లో..



# అమెరికాలో చేరేది లేదు

**గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్**

**కోపెన్‌హాగెన్(జనంసాక్షి):** అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని మిగతా 2లో..

# భాజపాతో జట్టుకట్టే ప్రసక్తే లేదు

**టీవీకే**

**చెన్నై(జనంసాక్షి):** విజయ్ పార్టీని ఎన్డీయేలోకి బలవంతంగా చేర్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే ఆయన నటించిన 'జన నాయగన్' చిత్రానికి సకాలంలో సెన్సార్ సర్టిఫికెట్ లభించకుండా కేంద్రం అడ్డుపడుతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పొత్తుపై తమిళగ వెట్రి కళగం స్పందించింది. రాజకీయంగా తమను అడ్డుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎన్డీఏతో జట్టు కట్టే ప్రసక్తే లేదని టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ స్పష్టంచేశారు. టీవీకేను కూల్చడానికి ఎన్ని కుట్రలు మిగతా 2లో..





# రైలుపై జారిపడిన క్రేన్..

- 29 మంది మృతి
- థాయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం

**బ్యాంకాక్(జనంసాక్షి):** థాయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కదులుతున్న రైలుపై ఓ క్రేన్ జారిపడటంతో బోగీలు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో 29 మంది మృతి చెందినట్లు మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
15.01.2026

# ఉరితాళ్లుగా చైనా మాంజా

- సంగారెడ్డి జిల్లాలో దారుణం
- బైకర్ మెడకు తగిలి తీవ్రగాయం
- తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి
- కర్నాకటలోనూ చైనా మాంజా పంజా
- బైక్‌పై వెళుతుండగా చుట్టుకున్న మంజా
- వ్యక్తి అక్కడికక్కడే మృతి

**సంగారెడ్డి(జనంసాక్షి):**సంగారెడ్డి మండలం పసల్వా డి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవ డంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పో యాడు. మృతుడిని బిహార్ కి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తు న్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వైక్ మృతిచెం దినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

**కర్నాకటలోనూ చైనా మంజా పంజా**

చైనా మాంజా యమ పాశంగా మారి దేశవ్యాప్తంగా అనేక మందిని బలి తీసుకుంటోంది. తాజాగా కర్ణాటకకు చెందిన ఓ బైకర్ ఈ మాంజా కారణంగా దుర్మరణం చెందారు. బీదర్ జిల్లా తలమడగి వంతెన సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితుడిని సంజు కుమార్ హాళసమణిగా గుర్తించారు. హాళసమణి బైక్ డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన మెడకు మాంజా చుట్టుకోవడంతో కోసుకుపోయి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమైంది. ఆయన తన కూతురికి ఫోన్ చేసి సమాచారం అందించే ప్రయత్నంలో ఉండగానే కుప్పకూలిపోయారు. చుట్టుపక్కల వారు గాయాలకు కర్చీఫ్‌లను అడ్డుపెట్టి రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేశారు. మరికొందరు అంబులెన్స్‌ను పిలిపించారు. అయితే, బాధితుడిని ఆసుపత్రికి తరలించే క్రమంలోనే కన్నుమూశారు. హాళసమణి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన కుటుంబసభ్యులు ఆరోపించారు. అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే ఆయన ప్రాణాలతోనే ఉండి ఉండేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జాప్యమే ఆయన ప్రాణాలను తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో మృతుడి బంధువులు, స్థానికులు ధర్నాకు దిగారు. ఎమ్జర్గ÷న్సీ సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాంజాపై నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇక ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా గాలిపటాలను ఎగురవేయడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. అయితే, గాలిపటాల కోసం సాధారణ మాంజాలకు బదులుగా కొందరు చైనా మాంజాలను వినియోగించడంతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్ల నుంచి వేళ్లాడే మాంజాలు వాహనదారులకు చుట్టుకుని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా టూవీలర్స్‌పై ప్రయాణించే వారికి ఇవి యమ పాశాలుగా మారుతున్నాయి.

# 'సీఎం మార్పు'పై తేల్చేయండి

ఏం జరగబోతోంది? కాంగ్రెస్ హైకమాండ్ మనసులో ఏముంది? సిద్ధరామయ్య, డీకే వ్యాఖ్యలు ఇస్తున్న సంకేతాలు ఏమిటి? ఈ కథనంలో చూద్దాం.

**క్లారిటీ కోరిన సీఎం, డిప్యూటీ సీఎం?**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక విమానంలో కర్ణాటకలోని మైసూరులో ఉన్న మండకల్లి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వాగతం పలికారు. కొన్ని నిమిషాల పాటే ఆ ఎయిర్‌పోర్టులో రాహుల్ ఉన్నారు. ఈ అతి స్వల్ప వ్యవధిలోనే రాహుల్ ఎదుట సీఎం మార్పు అంశాన్ని సిద్ధరామయ్య, డీకే ప్రస్తావించారనే టాక్ వినిపిస్తోంది. దీనిపై ఊహాగానాలకు ముగింపు పలికేలా క్లారిటీని ఇవ్వమని వారు కోరారనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపైనా దిశానిర్దేశం చేయమని రాహుల్‌ను సీఎం కోరినట్లు సమాచారం. ఈ అంశాలపై చర్చించడానికి సంక్రాంతి తర్వాత దిల్లీకి రావాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు రాహుల్ సూచించారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం నిర్దిష్ట తేదీని రాహుల్ చెప్పలేదని పేర్కొన్నాయి. ఈ స్వల్ప మంతనాలు ముగిసిన వెంటనే ప్రత్యేక హెలికాప్టర్‌లో తమిళనాడులోని గుడలూర్‌కు రాహుల్ గాంధీ వెళ్లారు.

**రాహుల్‌ను రెండోసారి కలిసిన డీకే**

దిల్లీకి తిరిగి వెళ్లేందుకు మంగళవారం సాయంత్రంకల్లా గుడలూర్ నుంచి మండకల్లి విమానాశ్రయానికి హెలికాప్టర్‌లో రాహుల్ చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయనతో డిప్యూటీ సీఎం డీకే కాసేపు సంభాషించారు. విమానాశ్రయంలో రాహుల్, డీకే మాట్లాడుకున్న ఫొటోలు కర్ణాటక అధికార పక్షంలో సంచలనం సృష్టించాయి. ఇంతకీ వారు ఏం చర్చించారు ? డీకే ఏం అడిగారు? రాహుల్ ఏం చెప్పారు? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ భేటీ తర్వాత ప్రత్యేక విమానంలో దిల్లీకి రాహుల్ వెళ్లిపోయారు.

జనవరి 16న దిల్లీకి వెళ్తాను : డిప్యూటీ సీఎం డీకే

ఈ పరిణామంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం కీలక వ్యాఖ్యలు చేశారు. జనవరి 16న తాను దిల్లీకి వెళ్తున్నట్లు వెల్లడించారు. తాను కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడి హోదాలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో జరిపిన సమావేశాలు, చర్చల వివరాలను బయటికి చెప్పలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ మీటింగ్‌లన్నీ కాంగ్రెస్ పార్టీ ప్రొటోకాల్ ప్రకారం జరుగుతాయన్నారు. సీఎం మార్పు అంశంపై రాహుల్, తాను అస్సలు డిస్కస్ చేయలేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును మార్చడం, కర్ణాటక రాష్ట్ర అభివృద్ధి, స్థానిక రాజకీయ పరిస్థితులు, రాష్ట్రంలో బీజేపీ రాజకీయాలపై చర్చించామని డీకే తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు పనితీరు బాగానే ఉందని, అలాగే పనిని కొనసాగించమని రాహుల్ సూచించారన్నారు.

సీఎం మార్పుపై మేమిద్దరమే మాట్లాడాలి : సీఎం సిద్ధరామయ్య

డీకే తాజా వ్యాఖ్యలపై సీఎం సిద్ధరామయ్య బుధవారం స్పందించారు. సీఎం మార్పు అంశంపై మాట్లాడే అధికారం తనకు లేదా ఉప ముఖ్యమంత్రి డీకేకు మాత్రమే ఉందన్నారు. దీనిపై ఎమ్మెల్యేల కంటే మీడియానే ఎక్కువగా చర్చిస్తోందని ఆయన మండిపడ్డారు. దీనిపై కొంతమంది అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇటీవలే చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, పరిస్థితి గురించి వారికి పూర్తిగా అవగాహన లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అధికార పంపిణీపై విభేదాలు లేవని, ఈ ఊహాగానాలన్నీ మీడియా సృష్టేనని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. మంగళవారం రోజు రాహుల్ గాంధీతో ఎటువంటి రాజకీయ చర్చలు జరపలేదన్నారు. తద్వారా కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలే తనకు శిరోధార్యం అనే సంకేతాన్ని సిద్ధరామయ్య ఇచ్చారు.

సంక్రాంతి తర్వాతే దిల్లీకి డీకే, సిద్ధు

దిల్లీకి రావాలని కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంలకు రాహుల్ గాంధీ సూచించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అశోక్ పట్టన్ బుధవారం బెంగళూరులో వెల్లడించారు. అయితే ఏ తేదీన వారిద్దరితో కాంగ్రెస్ పెద్దలు భేటీ అవుతారు అనేది నిర్దిష్టంగా తెలియదన్నారు. డేట్ ఫిక్స్ అయ్యాక సిద్ధరామయ్య, డీకే దిల్లీకి వెళ్తారన్నారు. సంక్రాంతి తర్వాతే ఈ డేట్ ఫిక్స్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అశోక్ పట్టన్ పేర్కొన్నారు. మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆశగా ఎదురు చూస్తున్నారని, ఆశావహుల జాబితాలో తాను కూడా ఉన్నానని ఆయన తెలిపారు.

# మహిళా ఐఏఎస్ కథనం కేసులో.. ముగ్గురు జర్నలిస్టుల అరెస్టు

అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. అలాగే.. మహిళా ఐఏఎస్‌ను కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసుల సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలువురిని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. కాగా.. సీఎం ఫొటో మార్ఫింగ్, మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. మరోవైపు మహిళా అధికారిపై అసభ్యకర కథనాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తీవ్రంగా ఖండించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు కూడా ఈ వ్యవహారంపై సీరియస్ అయ్యాయి. ఇలాంటి వార్తలు అధికారుల మనోభావాలను దెబ్బతీస్తాయని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

**చట్టప్రకారమే విలేకర్ల అరెస్ట్**

ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు.అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం.త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

మహిళపై ఉద్దేశ్యపూర్వక దుష్ప్రచారం

తెలంగాణలో మహిళా ఐఏఎస్ అధికారిపై అసభ్యకర కథనాలు ప్రసారం ఘటన తీవ్ర దుమారాన్ని రేపుతోంది. మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచిన కేసును విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు సంస్థ సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ నడువనుంది. ఇదిలా ఉండగా.. మహిళా అధికారిపై అసత్య కథనాలు ప్రసారం చేయడంపై సీపీ సజ్జనార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరమని అన్నారు. ఇకపై మహిళలను అవమానిస్తే సహించేది లేదని సీపీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మహిళలపై విమర్శ కాదు.. దుష్ప్రచారం నేరం. ప్రజా జీవితంలో విమర్శలు సహజమే. కానీ మహిళలపై వ్యక్తిగత దాడులు, చరిత్ర హననం, అసభ్య వ్యాఖ్యలు విమర్శలు కావు.. అవి క్రూరత్వం. ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, గృహిణి అయినా మహిళ గౌరవం అపరిమితం. టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, వార్త కథనాల పేరుతో మహిళలపై దూషణలు అసహ్యకరం. నేడు ప్రతి పనిలో మహిళలు ముందువరుసలో నాయకత్వం వహిస్తున్నారు. పాలన, పోలీసు శాఖ, శాస్త్ర రంగం, మీడియా సహా ప్రజాజీవితంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇల్లు-ఉద్యోగం రెండింటినీ సమతుల్యం చేస్తున్నారు మహిళలు. కనిపించని బాధ్యతలతో కుటుంబాన్ని నడుపుతూ.. సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న మహిళలపై దాడులు ప్రగతిపై దాడులే.భారతీయ సంప్రదాయం చెబుతున్న సందేశం ప్రకారం 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' .. మహిళలకు గౌరవం ఉన్న చోటే సుభిక్షం ఉంటుంది. మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం ఆందోళనకరం. వ్యక్తిగతంగా దెబ్బతీయడం, ప్రతిష్ఠను నాశనం చేయడం ఏమాత్రం ఆమో దయోగ్యం కాదు. మహిళలను గౌరవించని సమాజం భవిష్యత్తును కోల్పోతుంది. ముందుండి నడిపిస్తున్న మహిళలను కించపరచడం దేశానికే నష్టం. స్పష్టమైన సందేశం ఒక్కటే.. మహిళలపై అవమానం, వివక్ష, చరిత్ర హననం ఇక సహించబోము. ది ఫ్యూచర్ ఈజ్ ఫీమేల్.. ఆ భవిష్యత్తు గౌరవంతోనే నిర్మితమవుతుంది.. అవమానంతో కాదు' అంటూ సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు.

## జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కార్ తీరు అనైతికం

**హైదరాబాద్(జనంసాక్షి):** జర్నలిస్టులపై కాంగ్రెస్ సర్కారు తీరు అనైతికమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. నోటీసుల ఇవ్వకుండా అరెస్ట్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.ఓ వార్తకు సంబంధించి ఎన్టీవీకి చెందిన పలువురు జర్నలిస్టులను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. విచారణ చేయకుండా చర్యలు తీసుకోవడం సరికాదని, జర్నలిస్టులను బెదిరించి భయపెట్టి చర్యలకు పాల్పడకూడదన్నారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేవారు కిషన్‌రెడ్డి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అర్థరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం తగదన్నారు బీజేపీ ఎంపీ బండి సంజయ్. పోలీసులు చట్ట ప్రకారం నడుచుకోవాలన్నారు

# అర్థరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

**రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన:కేటీఆర్**

**పండగపూట కక్షసాధింపు చర్యలు తగవు: హరీశ్**

**హైదరాబాద్(జనంసాక్షి):**సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్థరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు.జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

రాజకీయ క్రీడలో భాగంగానే అరెస్టులు

ఎన్‌టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్ట్ ను ఖండిస్తున్నామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ క్రీడలో భాగంగా నచ్చిన వారిని మంత్రులను చేయడానికి టీవీ చానెళ్లకు లీకులు ఇచ్చి ఉపయోగించుకొని మరల వారి మీదనే సిట్ వేసి అరెస్టులకు పాల్పడుతుందని ఆరోపించారు. అర్ధరాత్రి అక్రమంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోకి వెళ్లి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జరుగుతున్న పరిణామాలన్నీ డ్రామాలని యావత్ ప్రజలకు తెలుసనీ, ఎమర్జెన్సీని తలపించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని మండిపడ్డారు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా వెంటనే విడుదలచేయాలి డిమాండ్ చేశారు.కాగా, ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టర్లు పరిపూర్ణచారి, సుధీర్‌లను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.

ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్ దుర్మార్గం

ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మండిపడ్డారు. ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవంపై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా- డిజిటల్ మీడియాపై సిట్లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? అని ప్రశ్నించారు. మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## జుబీన్ గార్గ్‌ది హత్య కాదు..!

కనిపించలేదని సింగపూర్ పోలీసులు పేర్కొన్నారు. ఘటన సమయంలో జుబీన్ మద్యం మత్తులో ఉన్నారని, లైఫ్ జాకెట్‌ను నిరాకరించినట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు దర్యాప్తు నివేదికను అక్కడి కోర్టుకు అంద జేసినట్లు సింగపూర్ మీడియా వెల్లడించింది. సింగపూర్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు గతేడాది సెప్టెంబర్‌లో అక్కడకు వెళ్లిన జుబీన్ గార్గ్.. ఈవెంట్‌కు ఒకరోజు ముందు (19వ తేదీన) ఓ విలాసవంతమైన నౌకలో స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నారు. ఆ సమయంలోనే నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. జుబీన్ తొలుత లైఫ్ జాకెట్ వేసుకొని, ఆ తర్వాత తీసేసినట్లు గుర్తించారు."నౌకలో పార్టీ చేసుకున్న సమయంలో జుబీన్ మద్యం మత్తులో ఉన్నారు. నీటిలో ఈత కొట్టిన ఆయన.. నౌకలోకి వచ్చేందుకు ప్రయత్నించడాన్ని సాక్షులు చూశారు. అస్వస్థతకు గురైనట్లు గుర్తించి ఆయన్ను వెంటనే నౌకలోకి తీసుకువచ్చినప్పటికీ కొన్ని గంటల తర్వాత ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు అధిక రక్తపోటు, మూర్ఛ వ్యాధి ఉందని తేలింది" అని దర్యాప్తు నివేదికలో పోలీసులు పేర్కొన్నారు. నౌకలో ప్రత్యక్ష సాక్షులు, బోట్ కెప్టెన్, వైద్య సిబ్బంది సహా మొత్తం 35 మందిని విచారించామని, జుబిన్ గార్గ్ మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని గుర్తించామని సింగపూర్ పోలీసులు కోర్టుకు వెల్లడించారు.

## అమెరికాలో చేరేది లేదు

పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గ్రీన్‌ల్యాండ్‌పై బెదిరింపులను తగ్గించడం, దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడం ఈ చర్చల లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపులు ,ఆర్థిక ఒత్తిడి లేదా సైన్యాన్ని ప్రయోగించడం ద్వారా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ వ్యాఖ్యలపై ట్రంప్ మరింత బెదిరింపులకు దిగారు. తరువాత వారికి పెద్ద సమస్యను సృష్టించగలదని హెచ్చరించారు. అది వాళ్ల సమస్యఅని అన్నారు. వారి సమస్యతో తాను విభేదిస్తున్నానని అన్నారు.

## భాజపాతో జట్టుకట్టే ప్రసక్తే లేదు

పన్నినా తమ పార్టీ సిద్ధాంత వైఖరిలో ఎటువంటి మార్పు ఉండదని పేర్కొన్నారు. టీవీకేకు భాజపా సిద్ధాంత శత్రువు అయితే డీఎంకే రాజకీయ శత్రువని అన్నారు.'జన నాయగన్' సినిమా వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్పందనను స్వాగతిస్తున్నట్లు నిర్మల్ కుమార్ తెలిపారు.

# ప్రపంచానికే సగర్వంగా నిలిచేలా..

తెలంగాణను గ్లోబల్ వేదికపై ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల భవిష్యత్తును రూపకల్పన చేసే నాయకత్వ స్థానానికి తీసుకెళ్లాలనే దృష్టిని వ్యక్తం చేస్తున్నారు.ఫార్మాస్యూటికల్ తయారీ, ఆర్ అండ్ డీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా ప్రపంచ స్థాయి, సుస్థిర పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణ అభివృద్ధి చేస్తోంది. కొత్త పాలసీ ద్వారా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను ప్రకటించనున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఈ గ్రీన్ ఫార్మా సిటీ, ఎదుగుతున్న ఏఐ హబ్‌తో సహా ప్రధాన పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానాన్ని కల్పిస్తుంది. జీరో లిక్విడ్ డిశ్చార్జ్, కేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ, శక్తి సామర్థ్య వ్యవస్థలు వంటి పచ్చదనం చర్యలతో అధునాతన మౌలిక సదుపాయాలను సమన్వయం చేస్తూ, "వర్క్, లివ్, లెర్న్ అండ్ ప్లే" విధానంలో ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేయబడింది.మొత్తంగా తెలంగాణ నెక్ట్స్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030 గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ ఆవిష్కరణల తదుపరి అధ్యాయాన్ని రూపుదిద్దే దిశగా తెలంగాణ సంకల్పాన్ని స్పష్టంగా ప్రకటించే వ్యూహాత్మక ప్రకటనగా నిలుస్తుంది.?తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ ప్రధాన బలాలుతెలంగాణ ఆసియాలోని ప్రముఖ లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటి. రాష్ట్రంలో 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు ఉండగా, వీటి సంయుక్త విలువ సుమారు 80 బిలియన్ డాలర్లు. భారతదేశ ఔషధ ఉత్పత్తిలో దాదాపు 40 శాతం వాటా కలిగిన తెలంగాణలో 250కి పైగా యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదిత తయారీ కేంద్రాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో మూడో వంతు వాటాను కలిగి ఉండటంతో, తెలంగాణకు "వాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్" అనే గుర్తింపు లభించింది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతిశీల విధానాలు, క్లస్టర్ ఆధారిత వ్యవస్థ, లోతైన ప్రతిభా వనరులతో హైదరాబాద్‌లో 20కి పైగా లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ ఇంక్యూబేటర్లు పనిచేస్తూ, గ్లోబల్ స్థాయిలో పోటీగల, ఆవిష్కరణలతో నడిచే రంగంగా అభివృద్ధి చెందింది.ఈ అభివృద్ధి దృక్పథంలో భాగంగా తెలంగాణ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ వేదిక ప్రపంచ పరిశ్రమ నాయకులు, పెట్టుబడిదారులు, పరిశోధకులు, విధాన నిర్ణేతలను అనుసంధానించే ప్రధాన వేదికగా నిలుస్తోంది. ఇది రాష్ట్ర ఆవిష్కరణ ఎకో సిస్టమ్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తూ... ఉన్నత విలువ కలిగిన భాగస్వామ్యాలను ప్రోత్సహించి, 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించాలనే తెలంగాణ లక్ష్యాన్ని వేగవంతం చేస్తోంది.

# అంబరాన్నంటిన సంక్రాంతి వేడుకలు




వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు.కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

**దేశ ప్రజలకు మోదీ సంక్రాంతి శుభాకాంక్షలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రధాని మోదీ ప్రజలకు మకరసంక్రాంతి, మాఘ బిహు మరియు పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. భారతీయ సంస్కృతి -సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నువ్వులు, బెల్లం తీపితో నిండిన ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం,శ్రేయస్సు, విజయం నింపాలని కోరారు. సూర్యుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు నేడు మాఘ బిహు పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పొంగల్ పర్వదినం సందర్భంగా తమిళనాడు ప్రజలకు కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పండగ రైతులు, వారి కుటుంబాల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ పండగ మనల్ని పోషించే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, తద్వారా మన సమాజాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆశావాదాన్ని కలిగివుండాలని పేర్కొన్నారు. ఈసంవత్సరం ప్రజలందరికీ శ్రేయస్సు, సానుకూలత మరియు మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని తెలిపారు.

**స్వయంగా పొంగలి వండిన ప్రధాని మోడీ**

పొంగల్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా తొలుత ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రధాని నిర్వహించారు. అనంతరం ఆయనే స్వయంగా పొంగల్ వండారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గోవులకు పూజ చేశారు. పొంగల్ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. మరోవైపు ఈ పొంగల్ వేడుకను పలువురు ప్రముఖులు ఘనంగా జరుపుకుంటున్నారు. అలానే దేశ వ్యాప్తంగా ప్రజలు వివిధ రకాల వంటకాలు చేసుకుని, ఇళ్లను అలకరించుకుని పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.



# సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు భారీ ఏర్పాట్లు

- తుది దశకు చేరుకున్న ఏర్పాట్లు
- క్షేత్ర స్థాయిలోనే ఉండి, ప్రతి విభాగం పనితీరును సమీక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్న మంత్రి సీతక్క





హైదరాబాద్ (జనంసాక్షి) : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర-2026కు తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. కోట్లాది భక్తులు తల్లుల దర్శనానికి వచ్చే ఈ మహా పర్వంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈ ఏర్పాట్లన్నిటిపై నిత్యం ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడానికి మంత్రి సీతక్క మేడారంలోనే బస చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు. భక్తుల సౌకర్యం, సుభిక్ష దర్శనం ఆమె ప్రథమ ప్రాధాన్యతగా మారింది. ఈ సారి సుమారు మూడు కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో, ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు కలిసి సమగ్ర ప్రణాళికతో పని చేసేలా మంత్రి సీతక్క నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఈ జాతర కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది మేడారం, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. వీరికి అదనంగా 2 వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా తమ సేవలు అందించనున్నారు. మొబైల్ నెట్ వర్క్ కి ఎలాంటి అంతరాయం కలగకుండా 27 శాశ్వత టవర్లతో పాటు తాత్కాలిక పద్ధతిలో 33 మొబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టర్లుగా విభజించారు. ఒక్కో జోన్ కు జిల్లా స్థాయి అధికారి ఇంచార్జ్ గా వ్యవహరిస్తారు. ఒక్కో సెక్టార్ కు మండల స్థాయి అధికారి భాద్యతలు నిర్వర్తిస్తారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు రాకుండా మొత్తం 525 చోట్ల రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మత్తులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీ తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా నిరంతం తాగు నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,482 తాగు నీటి నల్లాలు ఏర్పాటు చేసి భక్తులకు శుద్ధమైన నీటిని అందిస్తున్నారు. జంపన్నవాగులో పవిత్ర స్నానాలు చేసే భక్తుల కోస 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు నీటి పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయనున్నారు.

285 బ్లాకుల్లో 5700 టాయిలెట్లను సిద్ధం చేశారు. వీటికి అధనంగా మొబైల్ టాయిలెట్స్ ను అందుబాటులోకి తేనున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం 5 వేల మంది సిబ్బందిని, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మిషిన్లు, 12 జేసీబీ, 40 స్వచ్ఛ ఆటోలు, 16 డోజర్లను రంగంలోకి దింపారు. జాతర ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా 350 మంది సిబ్బందిని నియమించారు.

ఆలయాలు, ప్రధాన మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో వేల సంఖ్యలో హై పవర్ లైట్లు వెలుగులు పంచుతుండగా, అత్యవసర పరిస్థితుల కోసం 28 డీజిల్ జనరేటర్లు బ్యాకప్‌గా సిద్ధంగా ఉన్నాయి.

భక్తులు సులభంగా మేడారానికి చేరుకునేందుకు టీజీఆర్టీసీ ఈసారి 4000 బస్సులను వినియోగంలోకి తెచ్చి 51,000 ట్రిప్పులు నిర్వహిస్తోంది. ప్రత్యేక బస్టాండ్లు, ప్రత్యేక రూట్లతో రవాణా వ్యవస్థను మరింత సమర్ధంగా నిర్వహిస్తున్నారు. జాతర కోసం 10441 మంది ఆర్టీసీ సిబ్బంది సేవలందించనున్నారు. గంటకు 15 బస్సులు ప్రయాణించేలా ప్లాన్ చేస్తున్నారు.

జాతర సమయంలో ఆరోగ్య సేవల కోసం మొత్తం 5,192 మంది వైద్య సిబ్బందిని నియమించారు. భక్తులకు సేవలందించేందుకు 30 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు, 50 పడకల ప్రధాన ఆసుపత్రి, రోజుకు 30 మెడికల్ క్యాంపులు పనిచేస్తాయి. జంపన్నవాగులో ప్రమాదాలను నివారించేందుకు 210 మంది గజ ఈతగాళ్లు, 12 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది, 100 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు 15 ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 268 మంది ఫైర్ ఫైటర్లు సిద్ధంగా ఉన్నారు.

అటవీ శాఖ ద్వారా పార్కింగ్, రోడ్లతో పాటు పర్యావరణ సంరక్షణ చేపడుతుండగా, ఐటిడీఏ ఆధ్వర్యంలో గిరిజనులకు కొబ్బరి కాయ, బెల్లం, ఇతర వ్యాపారాల కోసం లైసెన్సులు ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు.

మొత్తంగా మేడారం మహాజాతర--2026ను ప్రపంచ స్థాయిలో నిర్వహించాలనే లక్ష్యంతో, అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు త్వరితగతిన తల్లుల దర్శనం, సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.

### మేడారం మహా జాతర కు భారీ ఏర్పాట్లు ఇలా..

భక్తుల అంచనా: సుమారు 3 కోట్లు
విధుల్లో సిబ్బంది: 21 శాఖలు, 42,027 మంది
ఆదివాసీ వాలంటీర్లు: 2,000 మంది
పరిపాలనా విభజన: 8 జోన్లు, 42 సెక్టర్లు
కమ్యూనికేషన్ - టెక్నాలజీ
శాశ్వత మొబైల్ టవర్లు: 27
తాత్కాలిక మొబైల్ టవర్లు: 33
వీహెచ్ఎఫ్ సెట్లు: 450

**పారిశుధ్యం**
బ్లాకులు: 285
టాయిలెట్లు: 5,700
పారిశుధ్య సిబ్బంది: 5,000
ట్యాంకర్లు: 150
ట్రాక్టర్లు: 100
స్వీపింగ్ మెషిన్లు: 18
జేసీబీలు: 12
స్వచ్ఛ ఆటోలు: 40
డోజర్లు: 16

**విద్యుత్ - లైటింగ్**
ట్రాన్స్‌ఫార్మర్లు: 196
విద్యుత్ స్తంభాలు: 911
విద్యుత్ లైన్లు: 65.75 కి.మీ
విద్యుత్ సిబ్బంది: 350
డీజిల్ జనరేటర్లు (బ్యాకప్): 28

**రవాణా- పార్కింగ్**
పార్కింగ్ స్థలాలు: 42
మొత్తం విస్తీర్ణం: 1,418 ఎకరాలు
టీజీఎస్ఆర్టీసీ బస్సులు: 4,000
మొత్తం ట్రిప్పులు: 51,000
ఆర్టీసీ సిబ్బంది: 10,441
తాగునీరు డ్రెస్సింగ్ రూములు
తాగునీటి నల్లాలు: 5,482
జంపన్నవాగు వద్ద డ్రెస్సింగ్ రూములు: 119

**అగ్నిమాపక సిబ్బంది**
ఫైర్ బ్రిగేడ్ వాహనాలు: 15
ఫైర్ ఫైటర్లు: 268

**వైద్యం**
వైద్య సిబ్బంది: 5,192
అంబులెన్సులు: 30
బైక్ అంబులెన్సులు: 40
ప్రధాన ఆసుపత్రి: 50 పడకలు
రోజుకు మెడికల్ క్యాంపులు: 30
జంపన్నవాగు భద్రత
గజ ఈతగాళ్లు: 210
సింగరేణి రెస్క్యూ: 12
ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు: 100

## తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఘనంగా భోగి సంబరాలు





హైదరాబాద్ (జనంసాక్షి) : ఏటా సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతి.. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు బంజారాహిల్స్ తెలంగాణ జాగృతి కార్యాలయంలో భోగి వేడుకలు ప్రారంభమయ్యాయి. పూజలు చేసి భోగి మంట వెలిగించిన జాగృతి నాయకులు.. ఈ సందర్భంగా భోగి మంట వద్ద ఉత్సాహంగా నృత్యాలు చేశారు.గంగిరెద్దులకు పూజలు చేశారు.. హరిదాసులకు భిక్ష ప్రదానం చేశారు

## జిల్లాలను మారిస్తే తీవ్ర పరిణామాలు

- మాజీ స్పీకర్ మధుసూధనాచారి హెచ్చరిక



హనుమకొండ, జనవరి 14 (జనంసాక్షి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు ప్రతీకార పాలన కొనసాగిస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొం డలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం రేవంత్ రెడ్డి జేజమ్మ తరం కూడా కాదన్నారు. కేసీఆర్ పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజనను చేశారని, జిల్లాలను మార్చే దుర్మార్గానికి ఒడిగడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. చేతనైతే ఇచ్చిన హామీ ప్రకారం సాగు సాయాన్ని పెంచి అందించాలని, ఏదో ఒక సాకుతో జిల్లాలలో మార్పులు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో మార్పులు జరుగుతే తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల కోసం పోరాడే పార్టీ బీఆర్ ఎస్ పార్టీ అని గుర్తుచేశారు. గతానికి అదనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యతగల ప్రభుత్వం దానికి భిన్నంగా జిల్లాలు కుదిస్తాం, మార్చేస్తాం అనే బాధ్యతారాహిత ప్రకటనలతో గందరగోళం సృష్టించి వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీయడం అత్యంత దుర్మార్గమన్నారు. సమావేశంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్లు సోదా కిరణ్, నాయకులు ఇమ్మడి రాజు, శోభన్, సల్వాజీ రవీందర్ రావు, పానుగంటి శ్రీధర్, ఎండీ గౌస్‌ఖాన్, ఏలిషా, సౌరం రఘు, సంపతి రఘు, ఎస్కే మహిమూద్, తక్కళ్లపల్లి వినీల్ రావు, ఇమ్మడి స్నేహిత్, జేకే పాల్గొన్నారు.

## 18న సీఎం మేడారం పర్యటన

- ఏర్పాట్లపై మంత్రి ప్రత్యేక దృష్టి....



ములుగు బ్యూరో, జనవరి14 (జనం సాక్షి): ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి రానున్న నేపథ్యంలో, జాతర పనుల పురోగతిని రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆమె మేడారం గద్దల ప్రాంగణం చుట్టూ కొనసాగుతున్న ల్యాండ్‌స్కేపింగ్ పనులను పరిశీలించారు. గద్దెల ప్రాంగణంలో ఔషధ వనమూలికలు,ఇప్ప పువ్వు వంటి సంప్రదాయానికి ప్రాధాన్యమైన మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు.ఈ మొక్కలను మంత్రి సీతక్కతో పాటు జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ప్రత్యేకంగా ఎంపిక చేసినట్లు వివరించారు. ల్యాండ్‌స్కేపింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా సమీపంలో నిర్మాణంలో ఉన్న క్యూ లైన్ కాంప్లెక్స్ పనులను మంత్రి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఈ పంచాయతీ రాజ్ అధికారిని మంత్రి సీతక్క ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్,జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్,ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా,డిఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్,ఆర్ అండ్ బిఈ ఎన్ని, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఈఓ వీరస్వామి, పిఆర్ఈఈ అజయ్ కుమార్, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపైనే సిట్ ఎందుకు?

- కాంగ్రెస్ నేతల అవకతవకలపై సిట్ వేయండి
- అన్నింటిపైనా దమ్ముంటే విచారణ జరపండి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్



హైదరాబాద్, జనవరి14 (జనంసాక్షి) : జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిళ్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లో మాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు. కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమిషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ.300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమిషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమిషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.

# పోలీసుల చర్య సహించరానిది

- జర్నలిస్టుల అరెస్టును ఖండిస్తున్నాం : టీయూడబ్ల్యూజే

హైదరాబాద్ (జనంసాక్షి) : విచారణ పేరుతో మంగళవారం రాత్రి ఎన్టీవీ జర్నలిస్టుల ఇళ్లపై పోలీసులు దాడులు జరిపి, భయాందోళనలకు గురిచేసి, ముగ్గురు జర్నలిస్టులను అక్రమంగా అదుపులోకి తీసుకోవడం సహించరానిది. ఈ చర్యను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజె) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు కె.విరహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు సంయుక్తంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎలాంటి నోటీసులు లేకుండా అర్ధరాత్రి వేళలో జర్నలిస్టుల ఇళ్లపై, అందులో మహిళా జర్నలిస్టుల ఇళ్లపై సోదాలు చేసే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇది భావప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసే చర్యే. జర్నలిస్టులపై పోలీసులకు ఏమైనా ఫిర్యాదులు అందితే ప్రజాస్వామ్య పద్ధతుల్లో వారిని విచారించే అవకాశాలు ఉన్నప్పటికీ, అలాకాకుండా అంతర్జాతీయ నేరస్థుల మాదిరిగా జర్నలిస్టులను అదుపులోకి తీసుకొని, మీడియా సంస్థలకు హెచ్చరికలు పంపించే విధంగా ఇలాంటి వైఖరిని అనుసరించడం ప్రభుత్వానికి సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా ఎన్టీవీ కార్యాలయంపై పోలీసులు దాడి జరిపి అలజడి సృష్టించడం విచారకరమని, పోలీసుల అదుపులో ఉన్న జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణ చారీ, సుధీర్ లను బేషరత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర స్థాయిలో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.

## 18న ఖమ్మం జిల్లాలో సిఎం పర్యటన

**సిపిఐ మహాసభలకు రేవంత్ హాజరు**

ఖమ్మం, జనవరి14 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ మహసభల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అదేరోజు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ.25 కోట్లతో నూతనంగా నిర్మించిన మద్దులపల్లి మార్కెట్ యార్డ్, రూ.25 కోట్లతో నిర్మించిన నర్సింగ్ కళాశాల ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా రూ.108 కోట్లతో నిర్మించబోయే జేఎన్‌టీయూ భవన నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. అందులో భాగంగా మద్దులపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని సీపీ సునీల్‌దత్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ పిల్లి.రాంప్రసాద్, మార్కెట్ చైర్మన్ హరినాదబాబులు పరిశీలించారు.

## రైలు నుంచి కిందపడి ఆర్మీ జవాన్ మృతి

వరంగల్, జనవరి14 (జనంసాక్షి) : రైలు ప్రయాణంలో ప్రమాదవశాత్తు జారిపడి భారత సైన్యంలో సుబేదార్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకి చెందిన సంతోష్ కుమార్ (48) పంజాబ్‌లోని అమృతసర్‌లో ఇండియన్ ఆర్మీ సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన ఆయన న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే అండమాన్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 16032)లో ప్రయాణిస్తున్నారు. అదే రోజు రాత్రి 10:40 గంటల సమయంలో రైలు కేసముద్రం- ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యకు రాగానే సంతోష్ కుమార్ ప్రమాదవశాత్తు రైలు నుండి కిందకు జారిపడ్డారు. ఈ ప్రమాదంలోఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

# రిజిస్ట్రేషన్ రుసుం.. తీగ లాగితే..కదులుతున్న డొంక...!

- తహసీల్దారులు/సంయుక్త సబ్ రిజిస్టార్ల పాత్రపై అనుమానాలు
- కూపీ లాగుతున్న అధికారులు




హైదరాబాద్, జనవరి14 (జనంసాక్షి) : ధరణి పోర్టల్ ప్రారంభం నుంచి ఎన్ని లావాదేవీల్లో ఇలాంటి పొరపాట్లు జరిగి ఉంటాయనే దానిపై ప్రశ్నలు ఉత్పన్నమవు తున్నాయి. రూ.వందల కోట్ల విలువైన భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో మాత్రం రుసుం మొత్తంలో నామమాత్రంగా 1శాతం చెల్లించినా లావాదేవీలు పూర్తయ్యాయి. సాఫ్ట్‌వేర్‌లో లోపాలు ఉంటే... దస్త్రాలను ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన తహసీల్దారులు/ సంయుక్త సబ్ రిజిస్టార్లు మిన్నకున్నారు. 2020లో ప్రైవేటు సంస్థ ద్వారా ప్రారంభమైన ధరణి నుంచి ప్రస్తుత భూభారతి వరకు... అనేక సాంకేతిక లోపాలు కనిపించడం గమనార్హం. జనగామలో వెలుగుచూసిన సాగు భూముల రిజిస్ట్రేషన్ ఈ-చలానా చెల్లింపుల్లో మోసం వ్యవహారంలో రోజురోజుకు అనేక కొత్త విషయాలు బహిర్గతం అవుతున్నాయి. ఎసిబి ఎస్పీ సింధుశర్మ నేతృత్వంలోని హైలెవెల్ కమిటీ ఈ వ్యవహారంపై అన్వేషణ ప్రారంభించింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించిన ప్రకారం... భూమి మార్కెట్(బుక్ వాల్యూ) విలువలో 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీ, మ్యుటేషన్‌కు ఎకరాకు రూ.2,500, పాస్ పుస్తకానికి రూ.350, హరితపన్నుగా రూ.50... ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సందర్భంగా చెల్లించాలి. మార్కెట్ విలువ ఆన్‌లైన్‌లో ముందుగానే నిర్ధారించి ఉంటుంది. సర్వే నంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే ఎంత చెల్లించాలనేది కంప్యూటర్ తెరపైన కనిపిస్తుంది. చెల్లింపుల్లో ఏ ఒక్క రూపాయి తక్కువైనా ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా తిరస్కారానికి గురవుతుంది. కానీ, 4,800 లావాదేవీల్లో 1శాతం రుసుం మాత్రమే చెల్లించినా ఎక్కడా రిజిస్ట్రేషన్ రిజెక్ట్ అవలేదు. ధరణి/భూభారతి పోర్టల్‌లో ఉన్న బలహీన సాంకేతికత అక్రమ లావాదేవీలకు ఆస్కారం కల్పించిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ధరణిని ప్రైవేటు సంస్థ నిర్వహించగా, ఇప్పుడు భూభారతి ఎన్ఐసీ చేతిలో ఉంది. ధరణి నుంచి భూభారతిగా మారిన తర్వాత కొనసాగిన లోపాలు, ప్రస్తుతం వెలుగు చూసిన ఈ-చలాన్ల సొమ్ము దారిమళ్లింపునకు అనుమతిచ్చిన సాఫ్ట్‌వేర్ బలహీనతలపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ మంద మకరందు వీటిపై ఎన్ఐసీ నిపుణులతో చర్చిస్తున్నట్లు సమాచారం. సాగు భూముల రిజిస్ట్రేషన్లకు అత్తెసరు ఛార్జీలు చెల్లించినా వాటిని ఆమోదించి డీడ్స్‌పై సంతకాలు చేసిన తహసీల్దార్ల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ సెంటర్‌లో చలానా చెల్లించి నిర్దిష్ట తేదీన తహసీల్దారు-సంయుక్త సబ్ రిజిస్ట్రార్ వద్దకు భూముల క్రయ, విక్రయదారులు, నలుగురు సాక్షులు కూడా వస్తారు. పాసుపుస్తకాలను, ఫొటోలను, సెల్ నంబర్లను పరిశీలించు కోవడం, రికార్డుల్లో ఉన్న వ్యక్తి, హాజరైన యజమాని ఒక్కరేనా అనేది తేల్చుకోవడం తహసీల్దారు బాధ్యత. దీంతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను ప్రభుత్వ నిబంధనల మేరకే చెల్లించారా అనేది కూడా తప్పనిసరిగా పరిశీలించడమనేది మరో ముఖ్యమైన విధి. ఈ విషయంలో ధరణి ఆపరేటర్ ముఖ్య సహాయకుడిగా పనిచేయాలి. కీలక బాధ్యతల విషయంలో తహసీల్దార్లు, ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర అంశంగా రెవెన్యూ శాఖ భావిస్తోంది.

# భౌగోళిక రాజకీయ సైబర్ దాడులు ఒక కొత్త దశ

"జియో పొలిటిక్స్ ఆఫ్ సైబర్ అటాక్స్ పుస్తకంలో డియాగో రోడ్రిగ్స్ హ్యాకింగ్, సైబర్ యుద్ధం, ప్రభుత్వాల రహస్య ఆపరేషన్లు వంటి అంశాలను టెక్నాలజీకీ శక్తికీ మధ్య వున్న సంబంధంగా చూపిస్తాడు. ఇందులో అంతర్జాతీయ కుట్రా, డిజిటల్ యుద్ధాల అద్దాల ద్వారా "సైబర్ దాడుల వెనక వున్న శక్తులను" బట్టబయలు చేసే ప్రయత్నం కనిపిస్తుంది.

రోడ్రిగ్స్, బ్రెజిలియన్ టెక్ రచయిత, "స్టూడియోడీ21 స్మార్ట్ టెక్ కంటెంట్, ఇంటెల్ సిస్టమ్సు వ్యవస్థాపకుడు. సైబర్ సెక్యూరిటీ అంశాలని అందించడంలో, ఏఐ సాంకేతిక పుస్తకాలను రూపొందించడంలో మంచి పేరు సంపాదించాడు. 'గూగుల్ ప్లేబుక్లలో 'జియోపొలిటిక్స్ ఆఫ్ సైబరటాక్స్'ని ఈ-బుక్‌గా 2025లో ప్రచురించాడు. రచయిత, ఈ పుస్తకాన్ని మూడు ప్రధాన స్తంభాల చుట్టూ నిర్మించాడు: 1) వ్యక్తి లేదా సమూహ నటులుగా "హ్యాకర్లు", 2) సైబర్ విధానానికి సంగీత దర్శకులుగా "రాజ్యాలు", 3) ఆర్థిక గూఢచర్యం, సైద్ధాంతిక సంఘర్షణలూ, ప్రతినిధి (ప్రాక్సీ) యుద్ధాలతో వున్న "గుప్త ప్రయోజనాలు". ప్రారంభ అధ్యాయాలు ప్రాథమిక భావనలతో వుంటాయి. అంటే, DDoS (డిస్ట్రిబ్యూటెడ్ డేనియల్ ఆఫ్ సర్వీస్) అంతరాయాల నించి అధునాతన ఎపిటి (అడ్వాన్స్‌డ్ పెర్సిస్టెంట్ బెదిరింపులు) వరకూ గల సైబర్ దాడులను నిర్వచించడం. స్టక్స్‌నెట్ (ఇరాన్ అణు కార్యక్రమాన్ని ధ్వంసం చేసే, లక్ష్యంతో తయారుచేసిన అమెరికా-ఇజ్రాయెల్ వార్మ్), 2017లో ఉక్రేనియన్ మౌలిక సదుపాయాలను స్తంభింపజేసిన, 2016లో రష్యన్ ఎన్నికల్లో జోక్యం చేసిన, నాట్-పెట్య ర్యాన్సంవేర్ వైరస్ వంటివి హై-ప్రొఫైల్ సంఘటనల చర్చలూ వున్నాయి. డిజిటల్ చౌరబాట్లు, పెద్ద భౌగోళిక రాజకీయ లక్ష్యాలను ఎలా అందిస్తాయన్న దానికి ఉదాహరణలివి. ఈ విషయాన్ని మరింత లోతుగా విచారిస్తే, సైబర్ దాడులు కేవలం సాంకేతిక ఘర్షణలు కావనీ, ఆధునిక రాజ్యాంగ యంత్రాంగాల కోసం ఏర్పడిన వర్గ ప్రయోజనాల ప్రతిబింబాలనీ అర్థమవుతాయి.

**ఉత్పత్తి సంబంధాలూ, సైబర్ యుద్ధం:** సైబర్ యుద్ధం, నేటి ప్రపంచ పెట్టుబడిదారీ (గ్లోబల్ కాపిటలిస్టు) వ్యవస్థలో ఒక కొత్త దశ. సాంప్రదాయ భౌతిక యుద్ధాలు, ప్రకృతి వనరుల కోసం జరిగేవి. నేటి యుద్ధాలు, దానితో పాటు సమాచారం, డేటా, మేధో పెట్టుబడి కోసం కూడా జరుగుతున్నాయి. రోడ్రిగ్స్ ఈ కోణంలో "హ్యాకరు అనే పాత్రను స్వతంత్ర నటులుగా చూపించినప్పటికీ, మార్క్సిస్టు విశ్లేషణలో హ్యాకర్లు కూడా ఉత్పత్తి వ్యవస్థలోని కార్మికులే. కొందరు తమ శ్రమను పెద్ద టెక్ కంపెనీల్లో పనిచేసే వేతన కార్మికులు అయితే, మరికొందరు ప్రభుత్వాల కోసం "సైబర్ సైనికులు"గా పనిచేస్తున్నారు. ఈ పుస్తకంలో చర్చించిన ప్రతీ సైబర్ దాడి వెనుక వున్న "రాజ్యం ప్రేరణ" (స్టేట్ ఇంటరెస్ట్), చివరికి ఆర్థిక ఆధిపత్యాన్ని కాపాడుకోవడం కోసమే. ఉదాహరణకి, అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరిగిన "స్టక్స్‌నెటు సంఘటనని "దేశ భద్రత" పేరుతో చూపించినా, వాస్తవానికి అది అమెరికా మిలిటరీ-ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ పెట్టుబడి ప్రయోజనాలకు సంబంధించినది.

**గుప్త ప్రయోజనాలూ, ఆర్థిక వాస్తవాల ప్రతిబింబం:** రోడ్రిగ్స్, సరఫరా గొలుసుల్లో కార్పొరేట్ విధ్వంసం, హ్యాక్టివిస్ట్ గ్రూపులకు దేశ-ప్రభుత్వ నిధులూ, సైబర్ లాభాలను ప్రక్షాళనం చేయడంలో క్రిప్టోకరెన్సీల పాత్రా వంటివి గుప్త ప్రయోజనాలుగా పరిశీలిస్తాడు. ఐటీ నిపుణుల నుంచీ విధానరూపకర్తల వరకూ అందరినీ "స్టూడియోడీ21 నీతి"ని స్థితిస్థాపకత కోసం "మేధోపరమైన చట్రాలను" స్వీకరించమంటాడు. రచయిత పేర్కొన్న "గుప్త ప్రయోజనాలు", మార్క్సిస్టు భాషలో "బూర్జువావర్గాన్ని కోసం తయారైన గుప్త ఆర్థిక ప్రయోజనాలు/ప్రేరణలు". సైబర్ దాడులు కేవలం రాజకీయ ప్రతిస్పందనలుగా వుండవు. అవి పెట్టుబడి సమీకరణలో భాగం. ఉదాహరణకి, కంపెనీలు సైబర్ గూఢచర్యం ద్వారా ప్రత్యర్థి కంపెనీల పరిశోధన డేటాను దొంగిలిస్తాయి. ఇది అంతర్జాతీయ స్థాయిలో "సమిష్టి పెట్టుబడి పోటీ" రూపం. ఈ కార్పొరేట్ సైబర్ దాడులూ, డిజిటల్ గూఢచర్యం, క్రిప్టోకరెన్సీ లావాదేవీలూ వంటి అంశాల్ని "నూతన పెట్టుబడిదారీ దోపిడీ పద్ధతులు"గా పరిగణించవచ్చు. అంటే, భౌతిక వనరుల దోపిడీతో పాటు, ఇప్పుడు సమాచార దోపిడీ కూడా తోడైయింది.

**టెక్నాలజీ - సాధనం కాదు, శక్తి వ్యవస్థ:**




"సైబర్ జియోపొలిటిక్స్ కేవలం కోడ్ గురించి కాదు, ప్రపంచ పొత్తులను పునర్నిర్మించే చలన శక్తి గురించి" అని రచయిత వాదిస్తాడు. టెక్నాలజీని ఒక తటస్థ సాధనంగా చూపిస్తాడు. కానీ, మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం టెక్నాలజీ తటస్థం కాదు. అది వర్గ ఆధిపత్యానికి సేవచేసే సాధనం. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, పాలోఆల్టో నెట్‌వర్క్స్ వంటి సైబర్ సెక్యూరిటీ దిగ్గజాలు "భద్రత" పేరుతో లాభాల సమీకరణ చేస్తున్నాయి. ఒక దేశపు భద్రతా వ్యూహాలు కూడా ఆ దేశపు పెట్టుబడి ప్రయోజనాల చుట్టూనే తిరుగుతున్నాయి. ఫలితంగా, "డిజిటల్ శ్రామికవర్గం" అనే కొత్త వర్గం తయారవుతోంది. ఇది డేటా సెంటర్ కార్మికులూ, కంటెంట్ మోడరేటర్లూ, ఫ్రీలాన్సర్ హ్యాకర్లూ, సైబర్ మానిటరింగ్ ఏజెంట్లూ వంటి వారిని కలుపుతుంది. వీరు కూడా వేతన శ్రామికులే; కేవలం శ్రమ, డిజిటల్ రూపం దాల్చింది అంతే. వీరందరితో కలిసే మొత్తం 'శ్రామికవర్గం' అవుతుంది. కానీ, దోపిడీ స్వభావం మారలేదు. లాభాలూ, సంపదా కొద్ది మంది కార్పొరేట్ యాజమానుల దగ్గరే కేంద్రీకృతమవుతున్నాయి.

**సామ్రాజ్యవాద సైబర్ రూపం:** సైబర్ యుద్ధం, ఆధునిక సామ్రాజ్యవాద కొత్త పద్ధతి. పాత కాలంలో సామ్రాజ్యాలు, తుపాకులూ, యుద్ధనౌకాలూ వంటి వాటితో భౌగోళిక ఆక్రమణల ద్వారా శక్తిని ప్రదర్శించేవి. ఇప్పుడు డేటా సెంటర్ల ఆక్రమణల ద్వారా, సమాచార ప్రవాహాల నియంత్రణల ద్వారా, యాప్స్, ఏఐ అల్గోరిథమ్ల ద్వారా జరుగుతోంది. పాత కాలంలో బ్రిటిష్ రాజ్యం, నౌకలతో భారతదేశంలోకి వస్తే, ఈ కాలంలో అమెరికన్ టెక్ కార్పొరేట్లు, సర్వర్ లతో మన ఇళ్లలోకి వచ్చాయి. అమెరికా, "ఇంటర్నెట్ గవర్నెన్సుపై ఆధిపత్యం స్థానంలో వుండడం, చైనా తన "డిజిటల్ సార్వభౌమత్వం" కోసం ఫైర్‌వాల్ నిర్మించడం, వంటివి కొత్త సామ్రాజ్యవాద రూపాలు. రోడ్రిగ్స్, దీనిని భౌగోళిక రాజకీయాలు (జియోపొలిటిక్స్)గా చూపిస్తాడు. కానీ, మార్క్సిస్టు విశ్లేషణలో ఇది "డిజిటల్ సామ్రాజ్యవాదం (ఇంపీరియలిజం)". సమాచారం, సాంకేతికతా, డేటా వంటి వాటిపై ఆధిపత్యం సాధించడం ద్వారా మిగతా ప్రపంచాన్ని తమ ఆధీనంలో వుంచుకునే వ్యూహమే డిజిటల్ సామ్రాజ్యవాదం! మన కళ్ల కదలికలూ, మన వాయిస్, మన లొకేషన్లూ, మన అభిరుచులూ, అన్నీ, కార్పొరేట్ సర్వర్లలో నిల్వ అవుతాయి. ఈ డేటాను వాణిజ్య లాభాల కోసం వాడతారు. ఎన్నికల్ని ప్రభావితం చేయడానికి వాడతారు. వినియోగ అలవాట్లను మార్చడానికి వాడతారు. ప్రజాస్వామ్యం, ఇప్పుడు ఒక అల్గోరిథమ్ గేట్ కీపర్ చేతిలో వుంది. ఏ వార్త కనిపించాలి, ఏ మాట వైరల్ కావాలి, ఏ గొంతు మౌనం వహించాలి, అన్నది రాజ్య యంత్రం నిర్ణయిస్తుంది.

**పుస్తక పరిమితులూ, మార్క్సిస్టు దృష్టి:** రోడ్రిగ్స్, సాంకేతిక పరిజ్ఞానాన్ని భౌగోళిక రాజకీయ కథనాలతో చెప్పడంలో సిద్ధుడు. ఎస్టోనియాలో (2007) జరిగిన హ్యాక్, నాటో (చీూూ) జోక్యానికి దాదాపు ఎందుకు కారణమైందో, చైనా గ్రేట్ ఫైర్‌వాల్ ఆర్థిక ఆయుధంగా ఎలా రెట్టింపు అవుతుందో అనే విషయాలు ఆసక్తికరంగా వున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు, సూపర్ పవర్ సైబర్ గేమ్‌లలో ఎలా భాగస్వాములుగా మారుతాయో హైలైట్ చేస్తుంది. రోడ్రిగ్స్ సాంకేతిక వివరణలు ఎన్నో వున్నా, వాటి వెనుక ఉన్న సామాజిక-ఆర్థిక మూలాలను తడమలేదు. "హ్యాకరును సాంకేతిక పాత్రగా చూపి, వర్గ విభజనలో అతని స్థానాన్ని నిర్లక్ష్యం చేశాడు. "స్టేట్ యాక్టరు అంటే ఎవరు? ఏ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు లేవు. బెన్ బుకానన్ రాసిన, "ది హ్యాకర్ అండ్ ది స్టేటు (2019) వంటి మేధోరచనలతో పోలిస్తే, వివాదాస్పద విషయాలపై (ఉదా., షామూన్ దాడులలో ఇరాన్ పాత్ర వుందనడం) ధృవీకరించదగిన వాదన లను కోరుకునే పాఠకులను నిరాశపరుస్తుంది. ఇప్పటికే అందరికీ తెలిసిన (స్టక్స్‌నెట్, సోలార్‌విండ్స్ వంటి) ఉదాహరణలపై ఆధారపడటం వల్ల, ఇందులో కొత్తదనం మిస్ అయిందనిపిస్తుంది. క్రిస్ బ్రోంక్ రాసిన "సైబర్ థ్రెటు (2016) వంటి పుస్తకాలతో, సైబర్ వ్యతిరేకతపై వున్న విద్యా సంబంధమైన రచనలతో పోటీ పడుతున్నప్పుడు, విప్లవాత్మక విశ్లేషణలూ, ఏఐ సహాయక దాడులూ వంటివి 2025 నాటి ప్రత్యేకమైన నవీకరణలు లేకపోవడం కొంత పేలవంగా అనిపించవచ్చు. అయితే, మార్క్సిస్టు పాఠకుడు, దీనిలో ఉన్న "సాక్ష్యాల" కోసం కాక, వాటి "పరిమితి"ని తెలుసుకోడాని కోసం ఈ పుస్తకాన్ని చదవాలి. ఈ పరిమితి ద్వారానే మనం ఆధునిక సైబర్ ప్రపంచంలోని వర్గాల వ్యూహాన్ని గుర్తించగలం.

రోడ్రిగ్స్ పుస్తకం, సైబర్ ప్రపంచంలోని ఘర్షణలను అందరికీ అర్థమయ్యేలా వివరిస్తుంది. రచయిత బలం, భౌగోళిక రాజకీయాలను తక్షణమైనదిగానూ, వ్యక్తిగతమైనదిగానూ భావించేలా చేయడంలో ఉంది. మార్క్సిస్టు దృక్కోణం, వాటిని మరింత లోతుగా చూస్తుంది. ఇది, డేటాపై ఆధారపడిన పెట్టుబడిదారీ విధానానికి యుద్ధ రంగం. పెట్టుబడి, 'డిజిటల్ రూపం' దాల్చిన ఈ కాలంలో 'హ్యాకర్ల, ఒక కొత్తరకం వర్గ ప్రతినిధి అయ్యాడు. అతని శక్తీ, శ్రమా, అవగాహనా, అన్నీ పెట్టుబడిదారీ యంత్రాంగం కోసం వినియోగించడానికే అంకితమవుతాయి. అందువల్ల, మార్క్సిస్టు పాఠకుడు, "టెక్నాలజీని కేవలం శక్తిగా కాకుండా, వర్గ ఆధిపత్య సాధనం"గా గ్రహించాలి. ఈ దృక్కోణం ద్వారానే "హ్యాకరు, "రాజ్యం", "ప్రేరణ/ప్రయోజనం" అనే పదాల వెనక దాగివున్న వాస్తవ ప్రపంచాన్ని మనం అన్వేషించగలం.

ఆర్కే వెంకట్
8096480227, హైదరాబాద్

## గిదేం బాస.. గిది తెలంగాణ యాసనా..?

మనిసికి కోపమత్తే యెనుకా ముందు జూడకుంట నోటికి ఏదత్తే గదే మాటంటరు. మనోల్లు, మందోల్లు అని సుతజూడరు. "అట్లుంటది మనతోని"అని పెగ్గలు కొడుతరు. ఇగ గీ తిట్లకత ఈనాటిదేంగాదులే! యెనుకట్నుంచి ఉన్నదే. బగ్గ కోపమత్తే కుక్కమీన ,కోడి మీన,ఇంట్ల పొలంగాల్లమీనవెట్టి పక్కింటోల్లను తిట్టుడు మనం సూత్తన్నదేనాయే!ఇగ నల్లనీల్లకాడ "పాని"పట్టు కొట్లాటలేనాయే

యెన్కట ముక్కు మూసుకొని దేవున్నే తలుసుకునేటోల్లకు సైతం కోపమొత్తుండే!! అల్లు యెంబటే ఆల్ల చెంబుల నీల్లు దీస్కొని సాపాలువెడుతుండ్రి. గా బారతంల ఎన్టివోడు"కిస్నుడుగా" నాగేశ్వర్రావు అర్జునుడిగా జరిగిన లొల్లిల సుత తిట్టుకున్నరు.నువు యెన్న దొంగవు,మన్నుదిన్నవు,సీరలెత్తుక పోయినవని అర్జునుడు తిడితే నీకు కొట్లాడ సాతగాక బిచ్చమెత్తుకున్నవని,నేన్లేకపోతే మీ బతుకులే లేవని కిస్న పరమాత్ముడనే ఇగ రామాయనంల గుడుక వాలితోటి యేగలేక కొండలు, గుట్టలపొన్న తిరిగేటోల్లకు ఓ దారి జూపిత్తే మీ జాతిలచ్చనం, కోతి లచ్చనం, పో గొట్టుకోలేదులే అని రాములంటే ఆ...గీ కోతులే గదా నువు ఇరాం లేకుంట యేదుత్తంటే,నీయేదుపు సూడలేక సీత జాడను దొర్కవట్టినయి,గీ కోతులే గదా సంద్రం మీన యాలాద్రిగట్టి నిను గెలిపించినయి.గిట్ల ఒగలకొగలు సేసిన పనుల్జెప్పుకొని తిట్టుకున్నరు.బస్ గంతే.అటెంక మల్ల ఒక్కటైండ్లు!! గిది సిల్సిలలా గిట్ల అత్తనేవుంది.గా నడిమిట్ల ఎన్టివోడు ఓ పాల్టీని కుక్క మూతి పిందెలని, తెలుగోడి పజీతదీసినోల్లని,సెప్పులు మోసేటోల్లని తిడితే,ఆ పాల్టివోల్లు సుత ముకానికి రంగేసుకొని బాగోతాలాడేటోన్కి రాజిర్కం సాతగాదని,బఫూన్లని తిట్టుకున్నరు

కానీ గిప్పుడు జూడాలే సామీ..! ఊల్లల్ల యెవ్వలు ఇనని తిట్లు పుట్టుకత్తన్నయి. మరీ మనల్నీ ఏలేటోల్ల మాటలు యింటుంటే తెలంగానోల్లు గింత గలీజ్ గా తిట్టుకుంటరా! పురాగ బట్టలిడిసేసినట్లున్నయి గదా అల్ల తిట్ల ముచ్చట్లు. తెలంగాన కోసం రొండోపారి లొల్లి మొదలైనప్పటి సంది బాస పురాగ మారింది. సన్నాసులు, యెదవలు, తల్కాయలేనోల్లు అని లొట్టపీస్ గాల్లు, లంగలు, లపంగలు, ఔలగాల్లు లాంటి ఓ మాదిరి తిట్లు తోలుతీత్త, సీరిసింతగ్గదుతా, లాగుల తొండలు ఎక్కిత్త, పీకుడు, గీకుడు సరేసరి గీ నడుమ మన నాయక్ లకు పోటీగా సైన్మోల్లు సుత నాలికలాపుతలేరు. ఆల్లకేదో పిచ్చిలేసినట్లుంది. మన నాయక్ లో నాలికలకు మడతలెక్కువ గిప్పుడే అన్నమాట కాసేపైనంక అబ్బే నేన్నట్ల అనలే యెవలిట్టమచ్చినట్లుగ ఆల్లు మల్సుకున్నరు.మీకెవలకైన తక్లీఫ్ అనిపిత్తే యెన్కకుదీసుకుంటన్న,ఇచారిత్తన్న బస్ ఖేల్ ఖతం దుక్నం బంద్. నిజంగనే ఒక పొల్ల,పొల్లగాని నడుమ యేదైనా లందు ఏసాలున్నట్టు సుబూతులున్నా, బుద్ధి ఉన్నోడెవడైనా అల్లు పజీతవోతదనో,ఆల్ల సంసారాలు సట్టుబండలవుత యనో గమ్మునుంటరు.కనీ గా నడుమ పేరుగల్ల తల్లి,పేరున్న,ఏరైనా పెండ్లాం, మొగుల్ల మీన నోరు జారి,అటెంక దండంబెట్టి గండంగట్టెక్కింది. గిసొంటియన్ని సెపుతంటే బారతమంతైతది. ఇగ మనోల్లు గీ సెండాలనికీ తెలంగాన బాసంటెనే గిట్లుంటది.మన యాసంటే గిదే అని బాకాలూదుతాంటరు. ఈల్లకు తెల్వకుంట ఉంటుందా!గని గియన్ని పోరగాల్లు ఇంటే సెడిపోతరేమోనని అవ్వయ్యలు టి,విలు బంజేత్తన్నరు. అయ్యలూ! జరంత నాలికను ఆగ్గెల ఉంచుకోండీ.మన బాసకున్న పలుకుబడిని కాపాడకున్న,పల్సన జేయకుండ్రీ.అన్ని బాసలకన్న తెలుగు లెస్స కదా! సోచాయించుండ్రీ!

మీస రాజమల్లయ్య
9491319904, కనుకుల, పెద్దపల్లి

## ఫారెస్ట్ అధికారుల కట్టుదిట్టత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి జీవించే హక్కు, గౌరవంగా బతికే హక్కు కల్పించింది. కానీ భూమి మీద ఆధారపడి జీవించే రైతు, గిరిజనుడు, పేద వృత్తిదారుడి జీవితాల్లో ఈ హక్కులు నిజంగా అమలవుతున్నాయా అనే ప్రశ్న ఈ రోజు అత్యంత కీలకంగా మారింది.

అడవులపై ఆధారపడి జీవించే ప్రజలు, పోడు వ్యవసాయం చేసే గిరిజనులు, చేతి వృత్తులవారైన మెదరి కుటుంబాలు, పశువుల కాపరులు - వీరందరికీ అడవి జీవనాధారం. వంటకు కట్టెల కోసం, వెదురు బొంగుల కోసం అడవికి వెళ్తే ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు వెంటనే స్పందిస్తారు. "మీరు అడవిని నాశనం చేస్తున్నారు" అంటూ బెదిరింపులు, కేసులు, జరిమానాలు పెడతారు. చట్టం పేరుతో వారు చూపించే కట్టుదిట్టత ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. అడవుల సంరక్షణ అవసరమే. పర్యావరణ రక్షణ రాజ్యాంగబద్ధమైన బాధ్యత కూడా. కానీ ఇదే చిత్తశుద్ధి, ఇదే వేగం, ఇదే బాధ్యత భావం -- రైతుల భూమి హక్కుల విషయంలో రెవెన్యూ అధికారులకు ఎందుకు కనిపించదు?

**భూమి హక్కు - రాజ్యాంగ హక్కే**



భారత రాజ్యాంగం ఆర్టికల్ 300ఎ ప్రకారం చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా ఎవరినీ వారి ఆస్తి నుంచి దూరం చేయరాదు. భూమి రైతుకు కేవలం ఆస్తి కాదు -- అదే జీవనాధారం. అదే కుటుంబ భద్రత. భూములు వేరే వాళ్లు అక్రమంగా ఆక్రమించినా, సంవత్సరాల తరబడి పట్టాలు రాకపోయినా, సరిహద్దు తగాదాలు ఉన్నా, కొత్తగా వచ్చిన పట్టా పాస్‌బుక్‌లో భూమి తక్కువగా నమోదైనా - రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉంటారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతు తన రాజ్యాంగ హక్కును పొందలేకపోతున్నాడు. ఇది కేవలం పరిపాలనా లోపం కాదు -- ఆర్టికల్ 300ఎ రాజ్యాంగ ఉల్లంఘన.

**జీవించే హక్కు -కాగితాలకే పరిమితమా?**

ఆర్టికల్ 21 ప్రకారం... ప్రతి వ్యక్తి జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు ఉంది. సుప్రీంకోర్టు ఎన్నో తీర్పుల్లో "జీవించే హక్కు అంటే కేవలం ప్రాణాలతో ఉండటం కాదు, గౌరవంగా జీవించే హక్కు" అని స్పష్టంగా చెప్పింది. భూమి తగాదాలు, పట్టా సమస్యలు, అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతు మానసికంగా కుంగిపోతే, అప్పుల్లో కూరుకుపోతే -- అది గౌరవంగా జీవించే హక్కు హరించడమే. ఈ నిర్లక్ష్యమే చివరికి రైతును ఆత్మహత్య వైపు నెట్టేస్తోంది. ఇది సహజ మరణం కాదు -- వ్యవస్థ సృష్టించిన మానవ విపత్తు.

**సమానత్వం ఎక్కడ?**

ఆర్టికల్ 14 ప్రకారం... చట్టం ముందు అందరూ సమానులే. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఒక పేద గిరిజనుడిని, ఒక కట్టె తీసుకెళ్లిన హరిజనుడిని, పశువుల కాపరులని, చేతి వృత్తుల వారిని వెంటనే పట్టుకోగలుగుతోంది. కానీ రెవెన్యూ శాఖ రైతు భూమిని ఆక్రమించిన పెద్దలపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. ఇది చట్టం ముందు సమానత్వం ఎలా అవుతుంది? లేక పేదవాడిపై చట్టం, బలవంతుడిపై మౌనం అనే ద్వంద్వ వైఖరేనా?

**రైతు ఆత్మహత్యలు - ప్రభుత్వ పరోక్ష బాధ్యత**

రైతు ఆత్మహత్యలను కేవలం "వ్యవసాయ నష్టాలు", "వర్షాభావం" అని చెప్పి తప్పించుకోలేం. భూ హక్కులు కల్పించడంలో రెవెన్యూ వ్యవస్థ విఫలమవడం, సమస్యలను సమయానికి పరిష్కరించకపోవడం-ఇవన్నీ రాజ్యాంగ బాధ్యతల ఉల్లంఘన కిందకే వస్తాయి. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు ప్రజలకు అందకుండా చేస్తే, ఆ ప్రజలు ప్రాణాలు కోల్పోతే అది ప్రభుత్వం పరోక్షంగా వారి మరణానికి బాధ్యత వహించినట్టే.

**పరిష్కారం ఏమిటి?**


ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఉన్న కట్టుదిట్టత, వేగం, బాధ్యత భావం-అదే స్థాయిలో రెవెన్యూ అధికారులకు ఉండాలి. భూ సమస్యలు నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించాలి. పట్టాలు, పాస్‌బుక్స్ లోపాలు సరిదిద్దాలి. అక్రమ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అడవిని కాపాడటం ఎంత అవసరమో, రైతును కాపాడటం అంతకన్నా ముఖ్యం. రాజ్యాంగం అడవులకే కాదు - రైతు జీవితానికీ రక్షణ కల్పిస్తుంది. ఆ రాజ్యాంగాన్ని కాగితాల్లో కాదు, రైతు జీవితాల్లో అమలు చేసిన రోజే నిజమైన న్యాయం జరుగుతుంది. అప్పుడే రైతు ఆత్మహత్యలు ఆగుతాయి.

సామాజిక విశ్లేషకులు
కుడ్మేత శ్రీనివాస్
సెల్ నెం 9177166152

## రాజ్యాల - సార్వభౌమత్వ సిద్ధాంతానికి ట్రంప్ తిలోదకాలు

***అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, సార్వభౌమ దేశాలైన గ్రీన్లాండ్, కెనడా పట్ల స్వాధీనతా వ్యాఖ్యలు చేసిన విషయం విశేషంగా.. ప్రపంచ వ్యాప్తంగా కొత్త చర్చను లేవదీసింది. ఇది ఒక ప్రత్యేక సందర్భం మాత్రమే కాదు, "శక్తి" (సైనిక , ఆయుధ, ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక శక్తి "పవరు "రూపాలు) "సార్వభౌమాధికారం" గురించిన "విస్తృతమైన చారిత్రక, తాత్విక వాద-ప్రతి వాదాలను మళ్ళీ ఎత్తి చూపుతుంది". సార్వభౌమత్వం అనే సూత్రం, అంతర్జాతీయ సంబంధాలకు మూలాధారం. ప్రతి దేశానికి స్వయం నిర్ణయాధికారం ఉండటం ఈ సూత్రానికి "మౌలిక భావం". ప్రపంచ చరిత్రలో, ప్రాబల్యం (డామెనెన్స్) కోసం ఈ సూత్రాన్ని తరచుగా ఉల్లంఘించే ప్రయత్నాలు జరిగాయి.***

చారిత్రకంగా, చిన్న రాజ్యాలు తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి శక్తిమంతమైన పొరుగు దేశాలతో నిరంతరం పోరాడుతూ వచ్చాయి. సార్వభౌమత్వం అనే భావన పట్ల గౌరవం లేకపోవడం వలన వినాశనకరమైన యుద్ధాలు సంభవించాయి. ఉదాహరణకు, ఫ్రాన్స్-ప్రష్యా యుద్ధం తర్వాత జర్మనీ ఆక్రమించుకున్న "అల్సేస్-లొరైను ప్రాంతం. ఈ ఆక్రమణ ఫ్రాన్స్ లో గట్టి ప్రతీకార భావనను రగిలించి, తరువాతి దశాబ్దాలపాటు యూరోపియన్ వైరాన్ని పెంచింది. మరొక ప్రధాన ఉదాహరణ మొదటి ప్రపంచ యుద్ధం. ఇది సార్వభౌమత్వం మీద దాడి వలన మొదలైన సంఘర్షణ. "ఆస్ట్రియా - హంగేరీ" , 'ఆర్చ్ డ్యూక్ ఫ్రాన్సిస్ ఫెర్డినాండ్ హత్య' తర్వాత 'సెర్బియా' సార్వభౌమాధికారాన్ని గణనీయంగా తగ్గించేలా చేసే తీవ్రమైన అల్టిమేటం ను ఇచ్చింది. జర్మనీ మద్దతుతో, ఈ చర్య ఒక ప్రపంచ యుద్ధానికి దారి తీసింది. ఈ యుద్ధం 85 లక్షలకు పైగా సైనికులు, 1.3 కోట్ల పౌరుల మరణానికి కారణమైంది. ఈ యుద్ధం వలన నాలుగు సామ్రాజ్యాలు (ఆస్ట్రియా-హంగేరీ, జర్మనీ, ఆటోమన్ సామ్రాజ్యం, రష్యా) పతనమయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు, యూరోపియన్ దేశాలు ఒకదానికొకటి పరస్పర విరుద్ధమైన మైత్రి చుట్టాలు (ట్రిపుల్ అలయన్స్) అలాగే (ట్రిపుల్ ఎంటిటీ) ఏర్పరచుకున్నాయి. ఈ గందరగోళమైన మైత్రి విధానం, ఒక్క సంఘటనలో అన్ని దేశాలు యుద్ధంలో కి దూకడానికి దారితీసింది. ఇది సార్వభౌమ నిర్ణయాలు, ఒకదాని తరువాత ఒకటి గొలుసు ప్రతిస్పందనల ప్రమాదాన్ని ఎత్తి




చూపింది.

అంతర్జాతీయ నియమాలు మరియు ఒప్పందాలు శాంతి మరియు స్థిరత్వాన్ని నిలబెట్టడానికి ప్రయత్నిస్తాయి. కానీ "శక్తి సంబంధాలు" (పవర్ రిలేషన్స్) మారినప్పుడు ఈ నియమాలను ప్రశ్నించడం లేదా నిర్లక్ష్యం చేయడం కూడా జరుగుతుంది. ట్రంప్ యొక్క వ్యాఖ్యలు, వ్యాపార లావాదేవీలు, సైనిక సంరక్షణ ఒప్పందాలు తరచుగా దృఢమైన సార్వభౌమ అధికారాలను తగ్గించవచ్చు అనే దృక్పథన్ని ప్రతిబింబిస్తాయి. అయితే, గత చరిత్ర ఒక హెచ్చరికగా నిలుస్తుంది: సార్వభౌమత్వాన్ని విస్మరించడం వలన సంక్షోభాలు, అపూర్వమైన మానవ బాధలు,వేదనలు,రోదనలు, భౌతిక , మానసిక నష్టాలు ఉంటాయి. బ్రిటన్ ఆ తరువాతి సంవత్సరాల్లో గొప్ప శక్తిగా ఉండటానికి మొదటి ప్రపంచ యుద్ధం సహాయపడిందని భావించినా, యుద్ధం వలన ఆర్థికంగా ఎదుగుదల నెమ్మదించడం, సామ్రాజ్యవాదం పట్ల వ్యతిరేకత పెరగడం వంటి సవాళ్లు ఎదురయ్యాయి. అంతర్జాతీయ చట్టం పేరుతో చిన్న దేశాల సార్వభౌమాధికారం పై దాడి చేయడం శాశ్వతమైన రాజకీయ, ఆర్థిక ఫలితాలను కలిగిస్తుంది.

ఇటీవలి సంఘటనలు, "భద్రత" లేదా "జాతీయ ప్రయోజనాలు" పేరుతో సార్వభౌమత్వాన్ని ఎలా ఛేదించ వచ్చో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చూపిస్తున్నాడు. వెనిజులా వంటి దేశాలపై ఆర్థిక టారిఫ్ ల ద్వారా ఒత్తిడి చేయడం, అధ్యక్షుడిని అపహరించే (కిడ్నాప్) చేయడం వంటివి ఒక సర్వ స్వతంత్ర రాజ్యం పై (సార్వభౌమత్వంపై దాడి) సవాల్ గా నిలుస్తాయి. ఇరాన్‌పై దాడి చేయడానికి బెదిరించడం, గ్రీన్లాండ్ ను కొనుగోలు చేస్తానని బెదిరింపులకు దిగటం కూడా ఈ పథకంలో భాగమే. అయితే, ఈ చర్యలు ట్రంప్ వ్యక్తిగత రాజకీయ లక్ష్యాలు లేదా వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాల నుండి ఉద్భవించినట్లు కూడా కనిపిస్తోంది. అతని పరుషపు మొరటు, అహంకారపు మాటలు, విదేశాంగ విధానం తరచుగా వ్యాపార ఒప్పందాలు, భద్రతా ఒప్పందాలు "గేయిను (లాభాలు) లేదా (నష్టాలు ) "లాసుగా చూసే వ్యక్తిగత వ్యాపార , వాణిజ్య (భాష) దృక్పథన్ని ప్రతిబింబిస్తాయి. ఈ దృక్పథం సంప్రదాయ విదేశీ విధాన సూత్రాలను, అంతర్జాతీయ చట్టాల ప్రాముఖ్యతను గణనీయంగా తగ్గిస్తుంది.

సార్వభౌమత్వాన్ని గౌరవించడం, శాంతి మరియు స్థిరత్వానికి మూల సూత్రం. ఇది వివిధ దేశాలు మరియు సంస్కృతులు సహజీవనం చేసే లోకాన్ని నిర్మించడానికి అవసరమైన పునాది. ఒక దేశం తన ప్రయోజనాల కోసం ఈ సూత్రాన్ని విస్మరించి నప్పుడు, అది ప్రస్తుత ప్రయోజనాలను మాత్రమే కాకుండా, భవిష్యత్తు సహకారానికి అవసరమైన విశ్వాసం మరియు స్థిరత్వాన్ని కూడా ప్రమాదంలో పడేస్తుంది. గ్రీన్లాండ్ మరియు కెనడా వంటి దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం ద్వారా మాత్రమే నిజమైన, మనసు మార్చుకోని అంతర్జాతీయ సహకారం మరియు శాశ్వత శాంతిని నిర్మించగలం.



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

## పునరపి జననం

అప్పుడు..అవునప్పుడు..
అమ్మబిడ్డలుగా ఉన్నప్పుడు
అరమరికలెరగని ఆరోజుల్లో
ఏదీ మనదే కాదను ధ్యాసల్లో..

ఎవరింట్లో ఎక్కడ ఏంజరిగినా
వొగరి దుఃఖం సుఖం వొగరిదై
వొగరి బాధ గాయం అందరిదై
అందరిళ్లూ అలుముకునుండేవి..

చిందులేసే లేలేత లేడి పిల్లల్లాగా
ఎప్పుడూ ఎగిరి దుమికి ఆడేటి
పండు వెన్నెల నిండిన వాకిళ్ళు
తమ్ముళ్ల చెల్లె అక్కల సందళ్ళు..

చేతగాని పండు వయసులోనూ
చేతికందిన పనులెల్లా చేసుకుంటూ
ఆడిపాడే వయసాయని చింతిస్తూ
సంసారభారాల్ని ఈ పిల్లల మీదిట్లా..

మోపాల్సిన దినాలొచ్చెగదాని
కళ్ళల్లోని దుఃఖం కనపడకుండా
కొంగు గొంతుల్లో దిగమింగుకుని
కుమిలి పోయే అమ్మా నాన్నలూ..

ఔ..నిజంగా వాళ్లెరుగరు గానీ
మన భుజాలామీద భరోసాలై
వాళ్లెంత ధైర్యమో మన కిచ్చిరి
వాళ్లెంత అండనో మనకుండిరి..

ఉన్నది నీల్లో ఉప్పో కలుపుకునో
ఉన్నప్పుడు జోరు పప్పేసుకునో
అదే మజ్జిగై.. అదే ఊరగాయగ
ఆరోజొచ్చిన అందరు ఆప్తులతో..

ఏ ఇంటితనాలు ఎరగకుండా
కలిసి కూసోని తిన్న ఆ దినాలు
కొసరి కొసరి కంచం నింపేసిన
మమకార క్షణాలు మరిసే దెట్లు..

లోకాన్నీ శోకాన్నీ కలేసి ఈదే
ఆ కష్టాల కాలంల తోడుండె
అండని వేద్దామా వొద్దాంటూ
పరిణయ అడుగులు వేస్తిమెట్లనో..

పట్టు పానుపుల సోయిలేకుండె
పతులమైపోతిమిట్ల ఒక్కసారిగ
మనువాడు ఇగురం ఇసుమైనలేక
వొదిగుండుడెరుగని ఒంటి పక్షులం..

అడుగులు కలిసే సాగుతుండెను
మనస్సులొకటై మసలుతుంటిమి
లక్ష్యంమీదే చెదరని గురీ ధ్యాసా
అయినా లీలగా యేవో పొరలు..

మనమే చేసెడి 'నా'వను పనులు
పరదాలయ్యి పరుచుకునె నడుమ
మెలమెల్లగ అవియే గోడలాయెనా
దరిజేర్చగలేని నెర్రెల ఓడలాయెనా..

అమ్మలవొడిలో ఆటలు మరువని
బాల్యమె లేనోల్లం నాన్నలమైతిమి
ఇల్లంతా పిల్లల కేరింతల కొలనాయె
పరదాలేమో గోడలు గదులై పాయె..

గడప దాటని గోసలు ఊసులు
మనఇల్లే మనకొక పంజరమాయె
విడుదల ఎరుగని పెనుగులాటలు
మూతలు వొనికే కుతకుతలాయె..

ఎవరికివారం సొంతిండ్లై ఇట్లై పోతిమి
అమ్మా నాన్నలు కనుమరుగై పోయిరి
తోబుట్టువులు తలోదిక్కై తరలిపోయిరి

పిల్లలు పెద్దలయ్యిరి మనం వృద్ధులైతిమి..

జనం కోసం జతగా చేసిన మన పనులు
తెలివిడి తెగువలు పెంచెను ఎంతో గానీ
స్వార్థశక్తులు ఎప్పటికప్పుడు ఏకంఅయ్యి
జలాలు దోయుడు జులుమాపక పోయిరి..

వరదలుగ పొంగి పొరలిన మన చైతన్యం
నొప్పుల కాళ్ళతో దొగ్గుతుసాగే దినాలొచ్చే
నిండుగా నీళ్లతో పారాలిసిన కాలువలల్లా
రైతుల కన్నీటినెత్తురు ఆవిరులు గమ్మేసే..

ఎవరికివారం మనమెల్ల పెద్దలమైపోతిమి
మందగనడిసే ఒనరు ఓపిక ఎడబాయెనో
పునరపి జననం పునరపి మరణం నిజం
మనలమనం దగ్ధంచేసుకు లేయుడెట్లనో..

- డాక్టర్. ఇక్బాల్ పాషా
9440775732

# చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- మొలక మాసపత్రిక ఆవిష్కరణ



**తాండూరు, జనవరి 14 (జనంసాక్షి) :** నేటి సమాజంలో చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వక్తలు పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ (డిడిఎస్) ఆధ్వర్యంలో 26వ పాత పంటల జాతర--సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా బాలల మాసపత్రిక మొలక డిడిఎస్ వేదిక మీదుగా ఆవిష్కరించారు. ఈ వేడుకలో తాండూరు ప్రాంతానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు జనార్ధన్, గాజుల బసవరాజ్, కవయిత్రి, మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షుడు కేవీఎం వెంకట్, పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ సింగ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ సైదు నాయక్, సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్, రాజేంద్రప్రసాద్, డిడిఎస్ డైరెక్టర్ రుక్మిణి రావు, డాక్టర్ దివ్య, డిడిఎస్ మహిళా సభ్యులు చంద్రబాబు, పూలమ్మ, లక్ష్మమ్మ తదితరులు కలిసి మొలక బాలల మాసపత్రికను ఆవిష్కరించారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థిని వైష్ణవి, డిడిఎస్ విత్తన సంరక్షకురాలు చంద్రవ్వతో చేసిన ఇంటర్వ్యూతో రూపొందించిన పుస్తకాన్ని మొలక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైష్ణవిని ఘనంగా సన్మానించారు. భూమిని భూసారంగా కాపాడుతూ, పాత పంటల విత్తనాలు, చిరుధాన్యాలను పరిరక్షిస్తూ జీవవైవిధ్యాన్ని కాపాడుతున్న డిడిఎస్ మహిళల సేవలను వక్తలు ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ వీరి నుంచి ప్రేరణ పొందుతూ భవిష్యత్తులో చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు సూచించారు.

# జడ్చర్లలో అంబరాన్నంటిన భోగి వేడుకలు

- తెల్లవారుజాము నుంచే భోగి మంటలు
- ఇళ్ల ముందు అలరించిన రంగవల్లులు



**జడ్చర్ల, జనవరి 14 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగలో భాగంగా తొలిరోజు నిర్వహించే భోగి వేడుకలు జడ్చర్ల పట్టణంతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా అంబరాన్ని అంటాయి. బుధవారం తెల్లవారుజాము నుండే పట్టణంలోని వీధులన్నీ భోగి మంటల వెలుగులతో, ముగ్గుల రంగులతో కళకళలాడాయి. జడ్చర్లలోని ప్రధాన కూడళ్లు, కాలనీలలో ప్రజలు తెల్లవారుజామునే పాత వస్తువులను మంటల్లో వేసి భోగి వేడుకలను జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. వాడవాడలా మహిళలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి, వాటి మధ్యలో గొబ్బెమ్మలను ఉంచి పూజలు నిర్వహించారు. కొన్ని కాలనీల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలు చూపరులను ఆకట్టుకున్నాయి. చిన్నారులకు భోగి పళ్లు పోసి పెద్దలు ఆశీర్వదించారు. పిల్లలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ఇళ్లలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కావేరమ్మపేట శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయ చైర్మన్ గోనెల నరేందర్ తో పాటు స్థానిక నాయకులు, ప్రముఖులు ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. చెడును వదిలేసి, కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలనే సంకేతాన్ని భోగి పండుగ ఇస్తుందని వారు పేర్కొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

- మాతా శిశు ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం



**తాండూరు, జనవరి 14 (జనంసాక్షి) :** పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం తాండూర్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బీవీజీ ఫౌండేషన్ చైర్ పర్సన్ సునీత సంపత్ జన్మదిన సందర్భంగా తాండూర్ మాతా శిశు హాస్పిటల్ నందు యువ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువనాయకులు మాట్లాడుతూ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సునీత సంపత్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనసారా ఆకాంక్షించారు. అదేవిధంగా మునుముందు మరెన్నో ఉత్తమ పదవులు చేపట్టాలని ప్రార్థించారు. అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, ఫయాజ్, వడ్డే విశ్వనాథ్, ఆరిఫ్ పటేల్, నందు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**మర్పల్లి, జనవరి 14 (జనంసాక్షి) :** నేటి యువత క్రీడల పై ఆసక్తి చూపాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మర్పల్లి మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో పిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోహీర్ శంకర్ రెడ్డి నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆనంద్ ఫైనల్ లో గెలిచిన పట్లూర్ తండా టీంకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి 21,111/- కప్పు, రెండో బహుమతి 11,111/- వేలు కప్పు అందజేశారు. ఉత్కంఠ పోరులో జరిగిన మ్యాచ్లో పట్లూర్ తాండ విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ద్రోహద పడతాయని, క్రీడల్లో గెలుపోవటమే సమానంగా చూడాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. మర్పల్లి మండలం అంటేనే అటు రాజకీయం, ఇటు క్రీడల పట్ల ముందంజన ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచనింగాల సర్పంచ్ మహేందర్, మాజీ బీసీ కమిషన్ మెంబర్ శుభాప్రత్ పటేల్, మాజీ జడ్పిటిసి మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ధరూర్ జెడ్పిటిసి వేణుగోపాల్ రెడ్డి, మధుకర్, మల్లేశం, పండు, అంజయ్య గౌడ్, నరేష్ గౌడ్, రవి, యాదయ్య, యాదవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించండి



**పాపన్నపేట, జనవరి 14 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మంజా విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు కిష్టయ్య,శారద పేర్కొన్నారు. పాపన్నపేట,యూసుఫ్ పేట,కొత్తపల్లి గ్రామాలలో పలు దుకాణాలలో తనిఖీ లు నిర్వహించారు. చైనా మంజా వాడకంతో వాహన దారులకు, పక్షులకు హాని జరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సంతోషంగా పండుగ జరుపుకోవాలని,దుకాణ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం

- బుగ్గతండా క్రికెట్ లీగ్ ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, జనవరి 14 (జనం సాక్షి) :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీరక ధృడత్వం తొడ్పాడుతాయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం రోజున సంక్రాంతి పండుగ సందర్బంగా ఆరుట్ల గ్రామ పరిధిలోని బుగ్గతండాలో క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ లో మొదటి బహుమతి 10,000 రూపాయలు రెండవ బహుమతి 5,000 రూపాయలు మరియు అన్ని షీల్డులను ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, దాసరమోని రమేష్, యూత్ కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, బుగ్గతండా గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్




**మేడ్చల్ మల్కాజిగిరి, జనవరి 14 (జనం సాక్షి) :** తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ ప్రతి ఇంట సిరిసంపదలు, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. రైతు కష్టానికి ఫలితం దక్కే ఈ పర్వదినం పల్లెల్లో కొత్త వెలుగులు నింపాలని, రైతాంగం పాడిపంటలతో వర్ధిల్లాలని కోరారు. భోగి, సంక్రాంతి, కనుమ వంటి పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా ప్రయాణాలు చేసే ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే మాంజాను వినియోగించకుండా, పర్యావరణహిత దారాలు, రంగులు మాత్రమే ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని ఆకాంక్షించిన జిల్లా కలెక్టర్, "ఈ మకర సంక్రాంతి జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త ఉత్సాహం, ఆరోగ్యం, ఆనందాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని తన సందేశంలో తెలిపారు.

## తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**శామీర్‌పేట, జనవరి 14 (జనం సాక్షి) :** తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్ ను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు వూషగౌని వెంకట నరసయ్య గౌడ్ ఆవిష్కరించారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సంఘం సభ్యులతో కలిసి బుధవారం నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. వెంకట నరసయ్య మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు దూడల వెంకటేష్ గౌడ్, తుంకుంట శేఖర్ గౌడ్, గౌడ కులస్తులు యాస్కి రాంచందర్ గౌడ్, యాస్కి కుమార్ గౌడ్, గుల్యాగారి నాగరాజుగౌడ్, యాస్కి శ్రీనివాస్ గౌడ్, దేశం సత్య స్వామి గౌడ్, యాస్కి శోభన్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గృహజ్యోతి లబ్దిదారులకు పత్రాలను పంపిణీ



**మల్దకల్, జనవరి 14 (జనంసాక్షి) :** మండలంలో విద్యుత్ అధికారులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పంపినగృహ జ్యోతి పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వినియోగ దారులకు బుధవారము సందేశం పత్రాలను ఇంటింటి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ రాజేష్, లైన్మెన్ మురళి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన ఆరు పథకాల్లో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని,ఆ హామీని వెంటనే అమలు చేసి చూపించారని వారు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 52,82,498 మంది గృహ జ్యోతి పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని,వారి తరపున ప్రభుత్వం 3,593 కోట్ల రూపాయలు విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నదని వారు తెలిపారు. విద్యుత్ బిల్లుల డబ్బులను పిల్లల చదువులకు వినియోగించాలని వారు ప్రజలను కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల్,రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో ఘనంగా గోదాదేవి సమేత రంగనాథస్వామి కళ్యాణం



**ఇబ్రహీంపట్నం, జనవరి 14 (జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గుట్టపై దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా శ్రీ గోదాదేవి సమేత రంగనాథస్వామి కళ్యాణోత్సవం జరిగింది. విష్ణు చిత్తుడు కూతురు గోదాదేవి, సాక్షాత్ మహావిష్ణువు అవతారమైన రంగనాథ స్వామిని భోగి పండుగ పర్వదినాన లక్ష్మీదేవి స్వరూపమైన గోదాదేవి కళ్యాణం చేసుకున్న తిధి ప్రకారం ప్రతి ఏటా శ్రీ గోదాదేవి సమేత రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం భోగి పండుగ పర్వదినాన జరిపించడం జరుగుతుందని, అదేవిధంగా ఇబ్రహీంపట్నంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రతి ఏటా కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని పూజారి అరుణ్ పంతులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు నిఖిల్ కుమార్,నీలేష్ ఆలయ క్లార్క్ ఎం.శేఖర్ ఆలయ భక్త బృందం జెలమోని రవీందర్,తమ్మళ్ల కృష్ణ,సోప్పరి లక్ష్మణ్, శ్రీనివాస్ చారి,ఎస్. వేణు, సూరమోని బాబు,ఆర్.కే. కృష్ణ,బి.అశోక్ రెడ్డి,శంకర్ గౌడ్,గ్రామ పెద్దలు ఆకుల యాదగిరి,సూరంపల్లి కాళిదాసు,నెల్లి కుమారప్ప, భీమ్ రావు,కసరమోని బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో 'అరైవ్ అలైవ్ల రోడ్డు భద్రత అవగాహన సదస్సు



**రాజేంద్రనగర్, జనవరి 14 (జనం సాక్షి) :** ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని ఏసీపీ నాగభూషణం పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శంషాబాద్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్ల రోడ్డు భద్రత అవగాహన సదస్సు ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఐఎస్ఎఫ్ యూనిట్ వద్ద నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సీట్‌బెల్ట్ ప్రాముఖ్యత, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆడియో, విజువల్స్ ద్వారా రోడ్డు ప్రమాదాల తీవ్రతను వివరించగా, కార్యక్రమం ముగింపులో 'అరైవ్ అలైవ్ల టేబుల్ క్యాలెండర్లు పంపిణీ చేశారు.

# ఆలయ చరిత్ర గ్రంధావిష్కరణ రచయితకు సన్మానం



**మల్దకల్, జనవరి 14 (జనంసాక్షి) :** జోగులాంబగద్వాల్ జిల్లా కేంద్రంలో బుధవారం విద్యాద్గద్వాల సాహిత్యకళవేది జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో కవి, రచయిత అధ్యాపకులు బోరవెల్లి పవన్ కుమార్ రచించిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయ చరిత్ర, విశిష్టతపై రచించిన పుస్తకని రాజవంశీయులు శ్రీ లక్ష్మి చెన్నకేశవరెడ్డి, రాష్ట్రపతి అవార్డు కవి, రచయిత, కె. బాలస్వామి, కవి, రచయిత విశ్రాంత ఉపాధ్యాయులు రామ్మోహన్ రావు ఆవిష్కరించారు. అనంతం రచయితకు సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఎంతో విశిష్టతగల పురాతన ఆలయ చరిత్రను రాయడం ఎంతో గర్వించదగ్గ విషయం అని ఇలాంటి రచనలు ఇంకా వ్రాయాలని సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. టి.టి.యు జిల్లా అధ్యక్షుడు కవి డోలు బుచ్చన్న, ప్రధాన కార్యదర్శి మేడికొండ ఈశ్వర్, నడిగడ్డ సోషల్ ఫోరం అధ్యక్షుడు పాలవాయి లక్ష్మీనారాయణ, అధ్యాపకులు,కవి సుంకరి బసవరాజప్ప,కవులు, రచయితలు భక్తులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



**దోమ, జనవరి 14 (జనం సాక్షి) :** సమాచార హక్కు చట్టాలపై అవగాహన ఉండాలని దోమ మండల సమాచార హక్కు రక్షణ చట్టం ఉపాధ్యక్షులు న్రా నర్సిములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా , మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాచారం పొందడం ప్రతి ఒక్కరి రాజ్యాంగబద్ధమైన హక్కు అని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ చట్టాల పైన, పథకాల పైన, రాజ్యాంగం పైన కనీస అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యత, దరఖాస్తు విధానం గురించి తెలియజేశారు. సమాచార హక్కు చట్టం ద్వారానే ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారికలు సాధ్యమవుతుందన్నారు.

# విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

నాగర్‌కర్నూల్, జనవరి 14 (జనంసాక్షి) : హక్కు చట్టాన్ని అమలు చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థలకు కట్టబెట్టడానికి సామాన్యులకు విద్యకు దూరం చేస్తే ఊరుకునేది లేదని బహుజన ప్రజా శక్తి నాగర్ కర్నూల్ జిల్లా ఇన్చార్జి ఇటిక్యాల రాని అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఈనెల 27న హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర నిర్వహించే సభకు సంబంధించిన గోడపత్రికను బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ ఆదేశాల మేరకు విడుదల చేశారు. ఈ సందర్భంగా బహుజన స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడుస్తున్న రాజ్యాంగ పలాలు సామాన్యులకు అందడం లేదని అందులో ప్రధానమైనది విద్య హక్కు చట్టం అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. ప్రతి భారతీయుడు కి 6 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపువరకు గల వారికి ఉచిత విద్యను అందించాలని, ప్రైవేటు పాఠశాల, కళాశాలలో 25శాతం పేదలకు ఉచితంగా విద్యను అందించాలని ఆమె డిమాండ్ చేశారు.ప్రైవేటు కళాశాల



పాఠశాలల్లో అడ్మిషన్, ఫీజుల పేరుతో అధికంగా వసూలు చేసి సామాన్యుడికి విద్యకు దూరం చేస్తున్నారని అది చట్టరి నేరమని కచ్చితంగా విద్య హక్కు అమలు చేసి ప్రతి పేదవారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేదలైన అగ్రకులాలు కూడా ఉచితంగా విద్య అందాలని ఆమె డిమాండ్ చేశారు.విద్య ఉన్నచోటే చైతన్యం ఉంటుందని చైతన్యం ఉన్నచోటే బహుజన ప్రజా శక్తి పుడుతుందని ఆమె అన్నారు. మన బిడ్డల కోసం విద్యాహక్కు చట్టం అమలు పరుచుకోవడం కొరకు ప్రతి ఒక్కరు నాగర్ కర్నూల్ జిల్లా నలుమూలల నుండి ఈ నెల 27న తలపెట్టిన విద్యా హక్కు చట్టం అమలు కొరకై హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర నిర్వహిస్తున్న సభకు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బహుజన ప్రజా శక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ హాజరవుతున్నారని ఆమె తెలిపారు. 79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ విద్యకు నోచుకోని ఎంతోమంది ఉన్నారని, విద్యా హక్కును సాధించుకోవడం మన హక్కు అది సామాజిక బాధ్యత అనుకొని జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుపేదలైన అగ్రవర్ణాలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంతటి గోపి మాదిగ, కొల్లాపూర్ ఇన్చార్జి పానుగంటి పర్వతాలు, కో ఇన్చార్జ్ సింగర్ జ్యోతి, నాగర్ కర్నూల్ ఇన్చార్జి పాదాల రాములు, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షులు తన్నీరు మల్లేష్ యాదగిరి, ఉషన్న గౌడ్, పదాల రామదాసు, కాసిం తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకోటలో 15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు



వనపర్తి బ్యూరో జనవరి 14 (జనంసాక్షి) : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తన సహచర మంత్రివర్యులు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తో కలిసి కొత్తకోట పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.దాదాపు రూ. 15 కోట్ల వ్యయంతో పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.మంత్రులతో పాటు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శంకుస్థాపనలు చేసిన వాటిలో రూ.6 కోట్లతో కొత్తకోట మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అదేవిధంగా, చెనగ చెరువు కట్ట అభివృద్ధి కోసం రూ. 5 కోట్లతో, పార్కుల అభివృద్ధి కోసం రూ. 2 కోట్లతో, రూ. 50 లక్షల వ్యయంతో రహదారులపై ప్లాంటేషన్, రూ. 1.50 కోట్లతో స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా, కొత్తకోట పట్టణంలో రూ. 1.50 కోట్లతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును మంత్రులు ప్రారంభించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- బీఆర్ఎస్ నేత అప్పల శేఖర్ గౌడ్
- చంద్రాయన్ పల్లి లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు



చారకొండ,జనవరి 14 (జనంసాక్షి) : మహిళలు అన్ని రంగాలు రాణించి ముందుకు సాగాలని బీఆర్ఎస్ నేతలు అప్పల శేఖర్ గౌడ్,ఎర్ర రామకృష్ణ అన్నారు.బుధవారం బీఆర్ఎస్ నేత ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు,సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని చంద్రాయన్ పల్లి లో బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి అప్పల హారిక కు 3వేలు,పట్టు చీర,రెండో బహుమతి జమ్ముల సుజాత కు 2వేలు,పట్టు చీర,వీరితో పాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులు నగదు అందజేశారు.ముగ్గుల పోటీల్లో 30 మంది మహిళలు పాల్గొన్నారు.ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలందరికీ అభినందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామకామిటీ అధ్యక్షులు కోళ్ల శ్రీను, ఉపాధ్యక్షులు గడ్డమీది రామస్వామి, చిలికేశ్వరం శ్రీను,జమ్ముల రాగయ్య,ఎర్ర గెల్వయ్య,జమ్ముల బాలకృష్ణయ్య,గడ్డమిది బాలకృష్ణయ్య, జమ్ముల సత్తయ్య,ఇమ్మరాసి మల్లేష్, మాడుగుల రవికుమార్,మాడ్గుల మహేష్, జమ్ముల శ్రీను,ముదిగొండ గెల్వయ్య,యువకులు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లు ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి

మెదక్, జనవరి 14 (జనం సాక్షి) : గత పాలకుల నిర్లక్ష్యం తోనే త్రాగునీరు అందలేదు అలాగే బస్తీ దావఖానా సేవలు అందకుండా చేసిన గ్రామానికి మంచి నీరు అందించాలనే, సర్పంచ్ ఆలోచన మంచి నిర్ణయం భేష్ అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజీ రెడ్డి, మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్ స్పష్టం చేశారు.కౌల్చారం మండలం రాంపూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ నెల్లి రాజు సంగమేశ్వర్ తన సొంత ఖర్చులతో మినిరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజీ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ నమ్మకంతో గెలిపించిన గ్రామ ప్రజలకు ఐదేళ్ల పాటు వెన్నంటే ఉండి సమస్యలను పరిష్కరించి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సర్పంచ్ రాజు సంఘమేశ్వర్ కు సూచించారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పార్టీ పట్ల పేరు రావాలంటే



ప్రజలకు మంచిపనులు చేయాలని సూచించారు. నూతన పాలకవర్గం సమన్వయంతో ముందుకు సాగి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.అనంతరం సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణి చేసి, బస్తీ దవాఖాన నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కౌల్చారం, చిన్నా ఘన పూర్ దేవన్నగారి శేఖర్, చందాపురం మధుసూదన్ రెడ్డి,ఉప సర్పంచ్ శ్రీశైలం వార్డు సభ్యులు మంగమ్మ, బాలమణి, సాయిలు, సునీత, రాందాస్,స్వరూప, నాయకులు జంగిటి పోచయ్య, విట్టల్ రెడ్డి, నాగేందర్,మహేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి కె. గీత

నాగర్‌కర్నూల్, జనవరి 14 (జనంసాక్షి) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని 23వ వార్డు రాఘవేంద్ర కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కందికొండ గీత మాట్లాడుతూ, మహిళల్లో పిల్లల్లో ఎంతో సృజనాత్మక శక్తి ఉంటుందని దాన్ని వెలికి తీసే ప్రయత్నంలో ఇది ఒక భాగమేనని తెలిపారు. అంతేకాక ఆడపిల్లల్ని పుట్టనిద్దాం చదవనిద్దాం ఎదగనిద్దాం బ్రతకనిద్దాం అంటూ ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాలను వ్యతిరేకించాలని తెలిపారు. మహిళలను బయటకి రాకుండా వంటింటికే పరిమితం చేయాలనుకునే




మనువాదాన్ని మహిళలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు. ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతగా నిర్మల టీచర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, కాలనీవాసులు అంజనమ్మ, నవనీత, స్వాతి, మల్లీశ్వరి, యామిని, ఉమా, ఉష, శ్రీదేవి మొదలగువారు పాల్గొన్నారు.

## ఆటలు పోటీలు మానసిక ఉల్లాసానికి దోహదపడాలి

- నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్



నాగర్‌కర్నూల్, జనవరి 14 (జనంసాక్షి) : నాగర్ కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామంలో శ్రీపురం క్రికెట్ లీగ్ పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలోఎఖ 11 స్టార్ టీం విజయం సాధించారుటీమ్ క్యాప్టెన్ సురేష్ వైస్ క్యాప్టెన్ మధు రెడ్డి లు రన్నర్ గా 11 థండర్స్ కెప్టెన్ తిరుపతి, వైస్ కెప్టెన్ కే వినోద్ లు నిలిచారు పోటీలు ముగింపు సందర్భంగా నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆటలు పోటీ కోసమే కాక మానసిక ఉల్లాసానికి ఆడాలని ఆటలలో గెలుపు ఓటములు సహజమని ఓడిన వారు మళ్లీ గెలవడానికి ప్రయత్నం చేయాలని అలాగే గెలిచినవారు ఇంకా మంచిగా రాయడానికి ప్రాక్టీస్ చేయాలని ఆటలు మానసిక ప్రశాంతతను కాపాడాలి కాని విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉండకూడదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బహుమతులు గంధం ప్రసాద్ సమకూర్చారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ సీఐ, ఎస్సై గోవర్ధన్ తోపాటు గ్రామ సర్పంచ్ గీతారెడ్డి, డిప్యూటీ సర్పంచ్ వెంకటయ్య, సెకండ్ బహుమతి చంద్రనారాయణ, బొద్దలపల్లి గ్రామ సర్పంచ్ హెచ్ఎమ్ శేఖర్, ఓర్సు బంగారయ్య, కిష్టారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలు సౌభాగ్యంగా వర్ధిల్లాలి

- భవిష్యత్తు అంతా మంచి జరగాలి
- సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మంత్రి



వనపర్తి బ్యూరో, జనవరి 14 (జనంసాక్షి) : తెలంగాణ ప్రజలు సౌభాగ్యంగా వర్ధిల్లాలని, భవిష్యత్తు అంతా మంచి జరగాలని, సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షల ను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు పుష్కలమైన పాడిపంటలతో సుఖసంతోషాలతో సౌభాగ్యంగా వర్ధిల్లాలి అని ఆకాంక్షించారు.కె.సి.ఆర్ ప్రజలు అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలని, సానుకూల సాగువిధానాలతో ఎన్నో రైతు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, కానీ నేటి ప్రభుత్వ విధానాలతో తాత్కాలిక కష్టాలు తొలిగి భవిష్యత్తు అంతా మంచి జరగాలి అని అన్నారు..సంక్రాంతి పండుగ సందర్భంగా నిరంజన్ రెడ్డి కి, జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు జాత్రు నాయక్, సునీల్ వాల్మీకి,పెబ్బేరు మండల నాయకులు మాజీ వైస్ చైర్మన్ కర్రీస్వామి,వనం.రాములు,ఎం.రాజశేఖర్,ఎద్దుల.సాయి కుమార్,మాజీ కౌన్సిలర్స్ ఎల్లారెడ్డి,ఎల్లయ్య,గోపిబాబు,వేణు యాదవ్,సూర్యవంశం.గిరి, సయ్యద్, జెమిల్, చిట్యాల.రాము,తదితరులు ఉన్నారు.

# క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

- ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

మెదక్, జనవరి 14 (జనం సాక్షి) : క్రీడలతో శారీరక దారుఢ్యం... స్నేహభావం పెంపొందుకుందని... ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది... సేవా కార్యక్రమాలతో రాజకీయ భవిష్యత్తు ఉంటుందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కౌల్చారం మండలం పైతర గ్రామంలో పైతర ప్రీమియర్ లీగ్ 3 క్రికెట్ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువకుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు సీఎంగా కేసీఆర్ ఉన్న సమయంలో గ్రామ గ్రామాన క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి క్రికెట్ కిట్లు, వాలీబాల్ వంటి క్రీడా సామాగ్రిని పంపిణీ చేయడం జరిగింది అన్నారు. క్రీడలతో యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. యువకులు రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు మంచి సేవా కార్యక్రమాలు చేస్తారన్నారు. ఇందుకు ఉదాహరణ పైతర



సర్పంచ్ రవితేజ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి పైతర సర్పంచ్, కౌల్చారం మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాబన్నగారి రవితేజ రెడ్డి స్పాన్సర్ గా యువకులందరినీ గత మూడు సంవత్సరాలుగా క్రీడలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించడం పట్ల ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. విన్నర్స్ టీం కుమ్మరి నరేష్ 20 వేల రూపాయల నగదు, రన్నర్స్ టీమ్ మామిడి ప్రశాంత్ గౌడ్ కు పదివేల రూపాయల నగదు తో పాటు ట్రోఫీలను అందజేశారు. అలాగే స్పాన్సర్లు సమరసింహారెడ్డి, ఎల్లేశం, కూసంగి ప్రభాకర్, పుట్టి శివ లను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాబన్న గారి రవితేజ రెడ్డి , మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌర్శంకర్ గుప్తా, మండల టిఆర్ఎస్ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, ఆయా గ్రామాల సర్పంచులు దొడ్ల ఆంజనేయులు, మోత్కు నిర్మల మల్లేశం, అరిగే స్వర్ణలత విజయకుమార్, కొరబోయిన లక్ష్మీ పెంటయ్య, పుర్ర కాంతమ్మ ప్రభాకర్, ఉపసర్పంచ్లు సుధాకర్, చిట్కుల సురేష్, ఆర్య రవీందర్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు చంద్రశేఖర్ రెడ్డి, ఆదం ఎల్లయ్య, టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు లింగంపల్లి మల్లేశం, షాదుల్ల, జీవయ్య, శ్రీనివాస్ గౌడ్, సాయిబాబా గౌడ్, బాబు, వెంకట్ రెడ్డి, సోమ నర్సింలు, గౌరీ శంకర్, పోల నవీన్, కాంతారావు, సత్యం గౌడ్, ముట్రాజ్ పల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 14 (జనం సాక్షి) : పోలింగ్ కేంద్రాల్లాలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పదో వార్డు పోలింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపోలింగ్ కేంద్రాలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలని పోలింగ్ స్టేషన్ డిస్టెన్స్ తాగునీటి సౌకర్యం, ర్యాంపులు ఎండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడింది మొదలుకొని.. ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలి

మక్తల్, జనవరి 14 (జనంసాక్షి) : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని మూడు మున్సిపాలిటీలైన మక్తల్, ఆత్మకూర్, అమరచింత లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక శాఖ డైరీ క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. మక్తల్ పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మక్తల్ మున్సిపాలిటీ సన్నాక సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 16 వార్డులకు సంబంధించి ఓటర్ లిస్టును ఆయా వార్డు నాయకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్రెసిడెంట్ ఏ రవికుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వశీ ఆధ్వర్యంలో స్థానికుడైన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నేతృత్వంలో మక్తల్ నియోజకవర్గ పరిధిలో కేవలం రెండేళ్లలోనే 1000 కోట్ల పైగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్న సంగతిని ప్రతి ఒక్క ఓటరుకు చేరే విధంగా ప్రచారం చేయాలని స్థానిక నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గత పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా టిఆర్ఎస్ పార్టీ ఇవ్వలేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలోనే దాదాపు 4వేల వరకు ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిన సంగతిని అందరికీ గుర్తుచేయాలని అన్నారు. దీంతోపాటు ఏకకాలంలో రైతు రుణమాఫీ, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఇతర అన్ని సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు వివరించి రాబోయే రోజుల్లో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా ఇప్పటినుంచి ఓటర్లను సంసిద్ధత చేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున, మున్సిపాలిటీలోనూ కాంగ్రెస్ పాలకవర్గం ఉంటేనే అభివృద్ధి జోడెడ్ల మాదిరిగా సాఫీగా సాగుతుందని విషయాన్ని అందరికీ అర్థం అయ్యేలా వివరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నియోజకవర్గ



అభివృద్ధి కుంటుపడవద్దని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపాలిటీ టౌన్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐనవోలు జాతరలో షాపింగ్ చేసిన మంత్రి సురేఖ



**వరంగల్ ఈస్ట్, జనవరి 14 (జనం సాక్షి) :** ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మల్లికార్జున స్వామి ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ నిర్వాహకులు అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం మంత్రి కొండా సురేఖ జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా తమకు కావలసిన నచ్చిన వస్తువులను కొనడం కనిపించింది. ఎంతో ఓపికగా అన్ని స్టాల్స్ తిరుగుతూ అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగింది. జాతరకు వచ్చిన భక్తులు కూడా కొండా సురేఖను చూసి ఆనందాన్ని పంచుకున్నారు.

# జర్నలిస్టుల అరెస్టులపై ఖండన

- ఇది మీడియా స్వేచ్ఛపై నేరుగా దాడి
- తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్‌యూజే -ఐ)




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సీనియర్ జర్నలిస్టులైన దొంతు రమేష్, చారి, సుధీర్లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్ యూజే-ఐ) తీవ్రంగా ఖండిస్తుందని టిఎస్ జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ లు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ అరెస్టులు మీడియా స్వేచ్ఛను హరించే చర్యలని అన్నారు. ఈ అరెస్టుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, వీడియో స్వేచ్ఛగా రాయొద్దు, ప్రభుత్వాన్ని ప్రశ్నించొద్దు, అధికారంలో ఉన్నవారి మీద కథనాలు రాస్తే జైలు తప్పదు అని చెప్పాలనుకుంటున్నట్టుగా ఈ చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ఒక పత్రికలో లేదా మీడియాలో ఒక అంశంపై కథనం వచ్చినప్పుడు, అందులోని నిజానిజాలపై అధికారులు విచారణ జరిపించాలి. కానీ ఆ అంశాన్ని బయటికి తీసుకొచ్చిన జర్నలిస్టుల మీదే కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యంలో ఎక్కడా సమంజసం కాదన్నారు. అనేక సోర్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆధారంగానే కథనాలు తయారవుతాయన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన మంత్రులు, అధికారులు మీద ఆరోపణలు వస్తే, ఆ ఆరోపణల నిజానిజాలు నిగ్గు తేల్చాల్సింది ప్రభుత్వం, తప్పు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి కానీ ఆ పని చేయకుండా, జర్నలిస్టుల మీద పడి కేసులు పెట్టడం అంటే, ప్రభుత్వంలో ఉన్నవారు ఏం చేసినా చెల్లుతుందనే సంకేతాన్ని ప్రజలకు ఇవ్వడమేనని చెప్పారు. ఏ వ్యక్తిగత ఫిర్యాదు లేకుండా,ఆ కేసులో పేర్లు లేకున్న కేవలం ఒక సంఘం ఫిర్యాదును ఆధారం చేసుకొని జర్నలిస్టులను అరెస్ట్ చేయడం పూర్తిగా తప్పని, ఇది చట్టం కాదనీ , ఇది భయపెట్టే ప్రయత్నం అన్నారు. ప్రభుత్వం ఈ కేసును వెంటనే ఎత్తివేసి, జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛపై దాడులు ఆపకపోతే పెద్ద జర్నలిస్ట్ ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్ , సంయుక్త కార్యదర్శులు కడపాక రవి, పల్నాటి రాజు, మారెపల్లి చంద్ర మౌళి, భూపాల్, జగన్, సతీష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రాకతో ముస్తాబవుతున్న నిర్మల్ నగరం

- ఫ్లెక్సీ, మూడు రంగుల జెండాలతో స్వాగత తోరణాలు



**నిర్మల్ బ్యూరో, జనవరి14 (జనంసాక్షి) :** శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మల్ పట్టణానికి రానున్న నేపథ్యంలో నగరం నూతన కళావైభవంతో ముస్తాబవుతోంది. పట్టణ సౌందర్యాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కళాకారులు విశేష కృషి చేస్తున్నారు. ముఖ్యంగా నిర్మల్ పట్టణంలోని ప్రధాన రహదారుల సెంటర్ డివైడర్లపై కళాకారులు వేస్తున్న రంగురంగుల పెయింటింగ్‌లు నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నిర్మల్ జిల్లా కళాకారులతో పాటు జిల్లాకు బయటి ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. తమ కలం, రంగులతో సామాజిక సందేశాలు, సాంస్కృతిక ప్రతీకలు, ప్రకృతి ప్రేమ, పర్యావరణ పరిరక్షణ అంశాలను చిత్రాల రూపంలో ఆవిష్కరిస్తూ నగరానికి కళాత్మక శోభను తీసుకువస్తున్నారు. ముఖ్యంగా స్థానిక సంప్రదాయాలు, తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే చిత్రాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. సీఎం రాక సందర్భంగా పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలతో, సుందరంగా తీర్చిదిద్దారు ప్రధాన చౌరస్తాలల్లో ఫ్లెక్సీలు చూపరులను ఆకర్షిప జేస్తున్నాయి. నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కుచాడీ శ్రీహరి రావ్,నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ్ భీంరెడ్డి ఆధ్వర్యంలో సభ స్థలి అంగరంగ వైభవంగా తీర్చిదిద్దుతున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి సారి నిర్మల్ కు వస్తున్న సందర్భంగా కనీవినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. పెద్దఎత్తున జనాన్ని సమీకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి కార్యక్రామాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

# క్యాతనపల్లిలో వెలుగులు తెస్తా



- పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన
- మంత్రి వివేక్ వెంకటస్వామి

**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 14(జనంసాక్షి):** పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకస్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎస్ఆర్, డిఎంఎఫ్టి నిధుల ద్వారా 15 కోట్ల రూపాయలతో వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలో నూతన వెలుగులు తీసుకొస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే మున్సిపాలిటీలో ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం మున్సిపాలిటీ ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమీషనర్ రాజు, పార్టీ జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, జిల్లా అధికార ప్రతినిధి వోడ్నాల శ్రీనివాస్, నాయకులు అబ్దుల్ అజీజ్, గాండ్ల సమ్మయ్య, సాగర్ రెడ్డి, మహంకాళి శ్రీనివాస్, రాజయ్య, శ్రీనివాస్ గౌడ్, పార్వతీ విజయ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**కాళేశ్వరం, జనవరి 15 (జనంసాక్షి) :** మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్యపుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం దేవాలయ ఈఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్కిటెక్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ , దేవాదాయ శాఖ సలహాదారు గోవింద హరి తో కలిసి సరస్వతి అంత్యపుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత పుష్కరాలలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.

సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 30.16 కోట్ల నిధులను మంజూరు చేసిందని, ఇందులో రూ. 16 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు పంపించాలని, ఫిబ్రవరి మొదటి వారంలోపే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

కాళేశ్వరం మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా శాశ్వత పనులు చేపట్టాలని, పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, భక్తుల భద్రత వంటి అంశాలపై ముందుగానే ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రహదారి మార్గాలను పరిశీలిస్తున్నామని, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాహనాల పార్కింగ్ సమస్యలు నివారించేందుకు మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాలను గుర్తించామని, ప్రైవేట్ వాహనాల నియంత్రణకు డ్రాప్ గేట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవింద హరి మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలను ఆది పుష్కరాల మాదిరిగానే అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంత్య పుష్కరాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని పెండింగ్‌లో ఉన్న దేవాదాయ శాఖ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా త్వరలోనే "కాళేశ్వర ఖండం" అనే పుస్తకాన్ని విడుదల చేస్తామని తెలిపారు. పీఠాధిపతులు, హారతి, ఇతర తాత్కాలిక ఏర్పాట్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, కాటారం డిఎస్పి సూర్యనారాయణ , మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు ,కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి , ఆలయ కార్యనిర్వాహన అధికారి మహేష్ , సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి కొండ సురేఖ



**హన్మకొండ ప్రతినిధి జనవరి 14 (జనం సాక్షి) :** బుధవారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి కొండ సురేఖకు ఆలయ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. తీర్థ-ప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి మౌలిక వసతులు సమృద్ధిగా అందుతున్నాయా లేదా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. అలాగే ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టాండ్‌ను మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు బస్సులో ప్రయాణించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూభోగి పర్వదినాన ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఐనవోలు ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**జనంసాక్షి పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**శాయంపేట, జనవరి 14 ( జనం సాక్షి) :** శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో జనం సాక్షి దినపత్రిక 2026 క్యాలెండర్ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎన్ఎస్ఆర్ ఉత్పత్తుల అధినేత సంపత్ రావు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజలకు మరియు అధికారులకు వారధిగా ఎప్పటికప్పుడు సమాచారం అందించే పత్రిక జనం సాక్షి పత్రిక అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తుందని, ప్రశ్నించే గొంతుకగా పోరాడుతుందని, జనాదరణ పొందిన పత్రిక జనం సాక్షి పత్రిక అన్నారు. ఈ కార్యక్రమంలో శాయంపేట మండల రిపోర్టర్ బుచ్చిబాబు, కాంగ్రెస్ మండల నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

# నిజాన్ని నిర్భయంగా రాసే దినపత్రిక జనంసాక్షి

- హనుమకొండ జిల్లాలో జనం సాక్షి దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ
- జనం సాక్షి దినపత్రిక కు పలువురి ప్రశంసలు







**హనుమకొండ ప్రతినిధి, జనవరి 14 (జనంసాక్షి) :** నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచే ఏకైక దినపత్రిక జనం సాక్షి దినపత్రిక అని ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే మాజీ మున్సిపల్ చైర్మన్ కొనియాడారు. బుధవారం జనం సాక్షి దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం హనుమకొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గడ్డం బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సాక్షి దినపత్రిక కేలండర్ ఆవిష్కరించారు అనంతరం జనం సాక్షి దినపత్రిక యాజమాన్యానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు అదేవిధంగా పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి జనం సాక్షి దినపత్రిక కేలండర్ ఆవిష్కరించడం జరిగింది అనంతరం పరకాల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోదా అనిత రామకృష్ణ జనం సాక్షి దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించారు పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు జనం సాక్షి దినపత్రికకు ప్రశంసలు కురిపించారు హనుమకొండ జిల్లాలో జనసముద్రంల జనం సాక్షి దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరిం

# మంగపేటలో మీసేవ నిర్వాహకుడు మృతి


**మద్యానికి బానిసై ఉరివేసుకొని మృతి**



**మంగపేట జనవరి 14(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని మీసేవ నిర్వాహకుడైన తాళ్లపల్లి వీర కిషోర్ (42) గంపోనిగూడెం లోని తన ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయంపై స్థానిక ఎస్సై టివిఆర్ సూరి తెలిపిన వివరాల ప్రకారం కిషోర్ గత కొద్ది నెలల నుండి మద్యానికి బానిసై రోజు మద్యం తాగేవాడని ఈ విషయంలో తన భార్య స్వాతి కిషోర్ కు మద్యం మానేయాలని తరచూ చెప్పేదని అయినా కూడా మద్యం సేవించేవాడని ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య స్వాతి మందలించడంతో క్షణికోద్రానికి లోనై అదేరోజు మధ్య రాత్రి సమయంలో ఇంటిలో సీలింగ్ ఫ్యాన్ కు నైలాన్ తాడుతో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డట్టు ఎస్సై సూరి తెలిపారు. మృతుడికి భార్య స్వాతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూరి తెలిపారు.

# వస్తా అని చెప్పాను.. ఇప్పుడు వచ్చాను

- జిల్లాపై సీఎం రేవంత్ ప్రత్యేక నజర్.
- చనాక కోరట ప్రాజెక్టును సందర్శించనున్న సిఎం.
- సీఎం పర్యటనతో రైతుల్లో రేకెత్తిస్తున్న ఆశలు





**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గత డిసెంబర్ మాసం లో సీఎం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు నిర్వహించిన సభలో మళ్ళీ తొందరలోనే జిల్లాకు వస్తా పలు పనులను పరిశీలిస్తా ప్రజలకు, అధికారులకు చెప్పడం జరిగింది. అన్నట్టుగానే ఈ నెల 16వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకు రానున్నారు. సీఎం పర్యటన తేదీ ఖరారు కావడంతో జిల్లా యంత్రాంగం మొత్తం పెన్ గంగా నది పిప్పల్ కోటి చనాక కోరట రిజర్వాయర్ వద్ద నిర్మించిన బ్యారేజి, పంప్ హౌస్ వద్దకు చేరుకుని అన్ని చర్యలు చేపడుతున్నారు. ఈ బ్యారేజి నిర్మాణం పనులకోసం గత ప్రభుత్వం 1,227 కోట్ల నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించింది. ఈ బ్యారేజి పనులు ప్రారంభించిన నాటి నుంచి పనులు పూర్తి కావడానికి పదేళ్ల కాలం పట్టడం గమనార్హం. ఇంకా కాలువల నిర్మాణపు పనులు పెండింగ్ లోనే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి అవుతుందా ఆదిలాబాద్ బోథ్ నియోజకవర్గాల్లో 51 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఎప్పుడు అందుతుందా అని ఇంతకాలం రైతులు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు పనులు పూర్తి కావడం, బ్యారేజి పనులను పరిశీలించేందుకు స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి గురువారం జిల్లా పర్యటనకు రానుండడంతో అందరిలో సంతోషం నెలకొంది.

# పండగ పూట విషాదం

- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు





**కౌటాల, జనవరి 14 (జనంసాక్షి) :** పండుగ రోజు బంధువుల ఇంటికి వెళ్లిన యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కొమరం భీం జిల్లా కౌటాల మండలంలోని ముత్తంపేట్ గ్రామానికి చెందిన డోంగ్రి, శేఖర్ (23) తండ్రీ వార్లు పండగ రోజు తన బంధువు మామ గారి ఇంటికి తుమ్మల గూడ వెళ్లాడు. బుధవారం రోజు ఉదయం మోటార్ సైకిల్ తో మామ, అల్లుడు కలిసి సలుగుపల్లి వెళ్ళి వస్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి బ్రిడ్జ్ కు వేగంగా తగలడంతో కింద పడి బలమైన గాయం కావడంతో అల్లుడు శేఖర్ స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రమైన గాయాలతో పడి ఉన్న మామ రౌతు, శంకర్50) ను 108అంబులెన్స్ లో ఎక్కించి కాగజ్నగర్ హాస్పిటల్ తీసుకెళ్ళు చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందాడు. సరదాగా పండగ పూట బయటకు వెళ్లి మామ అల్లుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

**కన్నీటి పర్వంత మైన కుటుంబ సభ్యులు**

ఎదుగుతున్న కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లి తండ్రులు కన్నింటి పర్యంతమయ్యారు. పండుగ పూట బంధువుల ఇంటికి వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళిన కుమారుడు తిరిగి రాకపోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

ఇంటి పెద్ద దిక్కు ను కోల్పోయారు. పండగ పూట ఇంటికి వచ్చిన అల్లుడి నీ సరదాగా బయటకు తీసుకెళ్లిన మామ అనుకోకుండా మృత్యువు వెంటాడింది. మరో 5నిమిషాల్లో ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఇంట్లో ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులకు చేదు వార్త వినాల్సి వచ్చింది. బ్రిడ్జి నుండి పడిపోయిన శంకర్ ను స్థానికులు అంబులెన్స్ లో హాస్పిటల్ చేర్చిన చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇంట్లో పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి మృతుడు రౌతు శంకర్ కు భార్య ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

# మధిర పట్టణాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

● డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**మధిర, జనవరి 14 (జనంసాక్షి) :** రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు శంఖుస్థాపనమధిర పట్టణం మున్సిపాలిటీ సమగ్ర లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం నాడు మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదవ వార్డ్ సాయి నగర్ లో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.మధిర మున్సిపాలిటీ నీ రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధిర మున్సిపాలిటీలో వరద నీటి ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రతిపాదించిన పనులకు గాను మున్సిపల్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ నుంచి 140 కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రతి ఇంటి నుంచి వచ్చే మురుగునీటి తరలింపుకు ఇప్పటికే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఓవైపు జరుగుతుండగా తాజాగా మంజూరైన భారీ మొత్తం నిధులతో వరద ముంపు



లేకుండా శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమయింది. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద 140 కోట్లు మంజూరు అయ్యాయి. వరద నీటి కాలువలు, మధిర మున్సిపాలిటీ నీ వైరా నది వరద ముంపు నుంచి శాశ్వత ముగా విముక్తి కల్పించేందుకు భారీ రిటైనింగ్ వాల్, ప్రస్తుతం మధిర మున్సిపాలిటీలో ఉన్న వరద నీటి కాలువలకు రీ డిజైనింగ్ పనులు తాజా నిధుల ద్వారా చేపట్టనున్నారు. పట్టణంలో వరద నీటిని మళ్లించేందుకు ఆర్సీఎం చర్చి రోడ్డు నుంచి సాయిబాబా టెంపుల్ వరకు రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా వరద కాలువ నిర్మాణం చేపట్టనున్నారు. పులకడం వారి వీధి సబ్ డివిజన్ ఆఫీసు నుంచి శివాలయం వరకు, రామాలయం నుంచి యాదవ బజార్ వరకు, రైస్ మిల్ నుంచి డంపింగ్ యార్డ్ వరకు, వ్యవసాయ మార్కెట్ నుంచి డంపింగ్ యార్డ్ వరకు, ఇల్లందులపాడు ప్రాంతంలో అదేవిధంగా మడుపల్లి ప్రాంతంలో, అంబారుపేట, మరియు శివాలయం నుంచి రాయపట్నం బ్రిడ్జి వరకు మొత్తం వరద కాలువల నిర్మాణానికి రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నారు. మధిర మున్సిపాలిటీ వెంట ప్రవహిస్తున్న వైరా నది పొడవునా మొత్తంగా భారీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.65 కోట్ల రూపాయలు వెచ్చించనున్నారు. ప్రస్తుతం మధిర మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వరద కాలువలు అన్నింటిని రీ డిజైనింగ్ చేయడానికి రూ.35 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణ గుప్తా, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి



**రామన్నపేట, జనవరి 14 (జనంసాక్షి) :** గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడలలో రాణించాలని సర్పంచ్ చిల్ల మధురవేణి సరేష్ అన్నారు. మండలంలోని కక్కిరేణి గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఉప సర్పంచ్ నడిగోటి పాండుతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపొందిన జట్లకు సర్పంచ్, ఉప సర్పంచ్ సమకూర్చిన నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పిట్ట రాంరెడ్డి, కన్నెబోయిన జగన్, వేముల దయాకర్, నడిగోటి గణేష్, పిండి సైదులు, ఆర్గనైజర్ మేనేజ్మెంట్ గుండు సైదులు, గుండెపురి దేవేందర్, నడిగోటి సురేష్, గ్రామ యువత పాల్గొన్నారు.

# రైతుల పంటల పండుగ సంక్రాంతి



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 14 (జనంసాక్షి) :** రైతుల పంటల పండుగ సంక్రాంతి అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.బుధవారం భోగి పండుగ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని పలు వార్డుల్లో జరిగిన భోగి మంటల వేడుకల్లో పాల్గొని అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.45వ వార్డులో మాజీ కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఆధ్వర్యంలో, 30వ వార్డులో నాయకులు గాలి సాయి కుమార్ ఆధ్వర్యంలో, 9వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పతంగులతో చిన్నారులు, ముగ్గులతో మహిళలు మురిసే పండుగ సంక్రాంతి అని అన్నారు. భోగిమంటల్లో అందరి చెడు ఆలోచనలు తొలగిపోవాలని అన్నారు.సిరి సంపదలతో ప్రతి ఇంటా వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.చిన్నారులు తగు జాగ్రత్తలు పాటిస్తూ పతంగులు ఎగురవేయాలన్నారు. ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్,మాజీ గ్రంథలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్,బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులు,పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించిన మధుకర్ రెడ్డి

**రామన్నపేట, జనవరి 14 (జనంసాక్షి) :** మండలంలోని మునిపంపుల గ్రామంలో బిజెపి గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఏలూరి కుమారస్వామి జ్ఞాపకార్థం నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను బుధవారం బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో ముందు ఉండి క్రీడలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించి గ్రామానికి మన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. నరేంద్ర మోడీ ప్రారంభించిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవంలో పార్లమెంట్ స్థాయిలలో క్రీడా మహోత్సవాల్ని నిర్వహించడం జరుగుతుందని ఇందులో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖో ఖో పోటీలలో భాగ్య స్వాములు అయ్యి నియోజకవర్గ పార్లమెంట్ జాతీయ స్థాయిలో పాలుపంచుకొని ఈ మహోత్సవాన్ని కూడా విజయవంతం చేయాలని యువతకి పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య మునిపంపుల మాజీ సర్పంచ్ బిజెపి సీనియర్ నాయకులు కట్ట యాదయ్య సభా అధ్యక్షులు సుదీర్ ప్రభాకర్ చారి, రామ్ లక్ష్మయ్య, శ్యాంసుందర్, సురుగూ జంగీర్, సద్దల వెంకట్, రామలక్ష్మయ్య, మిర్యాల శ్రీధర్, చింత రమేష్, రావుల నవీన్, ఏలూరు సాయి, బంటి భాను, రాజశేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి ముగ్గులు



**హాలియా, జనవరి 14 (జనం సాక్షి) :** నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా మున్సిపాలిటీలో సంక్రాంతి సందర్భంగా సికే యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల బహుమతి ప్రధానోత్సవంలో నల్లగొండ జిల్లా శాసన మండలి సభ్యుడు ఎం.సి. కోటి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటి రెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను మహిళల పండుగగా భావిస్తారని, మహిళల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి నిలిచిందని అన్నారు. హాలియా ప్రజలకు, మహిళలకి, ప్రతి ఇంటికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గుల పోటీల్లో సుమారు 75 మంది మహిళలు పాల్గొని తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. తొలి, ద్వితీయ, తృతీయ స్థానం సాధించినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు వెనిగండ్ల పిఎసిఎస్ చైర్మన్ కె.వి. రామారావు, మాజీ నల్లగొండ జిల్లా కౌన్సిలర్ల సమాఖ్య అధ్యక్షుడు వర్ర వెంకట్ రెడ్డి, హాలియా పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వద్దే సతీష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అన్నేపాక శ్రీనివాస్, చవ్వకుల రాజు, వార్డ్ నాయకులు బొంగరాల యేసు రాజు, విద్యావేత్త డాక్టర్ బద్దేపాక ప్రసాద్, నల్ల బాలు, సికే యువజన సంఘ సభ్యులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లిలో క్రీడాపోటీలు ప్రారంభం

**నవాబుపేట్, జనవరి 14 (జనం సాక్షి) :** నవాబు పేట్ మండలం పరిధిలోని లింగంపల్లి గ్రామ కురుమ సంఘం అధ్యక్షులు గంగ్యాడా మల్లేష్, ప్రధాన కార్యదర్శి కండ్లపల్లి శ్రీశైలంఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ వడ్ల శోభ పరమేష్ బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ శోభన్ పరమేష్ మల్లేష్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ శుభ సందర్భంగా గత రెండు సంవత్సరాల నుండి గ్రామ యువజన సంఘాల నాయకులకు మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, రన్నింగ్, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా నవాబుపేట్ ఎస్సై పుండ్లిక్, వారి సిబ్బంది హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. టోర్నమెంట్ 14వ తేదీ నుండి 15వ తేదీ వరకు పోటీలను నిర్వహిస్తు టోర్నమెంట్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని కురువ సంఘం అధ్యక్షులు మల్లేష్ తెలిపారు. ఈ యొక్క అటలపోటులకు గ్రామంలోని యువజన సంఘాల నాయకులు అందరూ హాజరై అంగరంగ వైభవంగా యువకులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ కార్యక్రమం



లో గ్రామం కురువ సంఘం సభ్యులు శ్రీశైలం, ప్రభాకర్, పరమేష్, మల్లేష్, రమేష్, నారాయణ, గ్రామా ఉప సర్పంచ్ ప్రవీణ,పంచాయతీ వార్డు సభ్యులు గౌతమి, పాండు, మల్లేష్, పాండు, పావని, గోవింద్ రెడ్డి, పాండురంగం, టోర్నమెంట్ పిటిలు నందు, చందు, చంద్రకాంత్, వెంకట్, విట్టల్ రెడ్డి, పరమేష్, భీమయ్య, విట్టల్, కృష్ణ, మైపాల్, చింటూ గ్రామ పెద్దలు యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**ఊర్కోండ, జనవరి 14 (జనం సాక్షి) :** ఊర్కోండ మండలాన్ని కల్వకుర్తి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, కల్వకుర్తిని కొత్త జిల్లాగా ప్రకటించాలని,ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని,ప్రభుత్వం ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయాలు మార్చుకోవాలని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షులు నిరంజన్ గౌడ్ అన్నారు.బుదవారం ఊర్కోండ మండలాన్ని కల్వకుర్తి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని ఐదు రోజులుగా శాంతియుతంగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై ఓబీసీ జిల్లా అధ్యక్షులు వాగుల్దాస్ నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు చేపట్టిన 'రాస్తారోకో'తో జాతీయ రహదారి స్తంభించిపోయింది.కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారిపై నిరసనకారులు డప్పుల దరువుతో బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.సమాచారం అందుకున్న సీఐ నాగార్జున, స్థానిక ఎస్సై కృష్ణదేవ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని నిరసనకారులను చెల్లాచెదురు చేసే ప్రయత్నం చేశారు.ఈ క్రమంలో పోలీసులకు,నిరసనకారులకు మధ్య వాగ్వాదం,తోపులాట జరిగింది. పోలీసులు నిరంజన్ గౌడ్,ఇతర జేఏసీ నాయకులను బలవంతంగా తీసుకెళ్లి వాహనాల్లో ఎక్కించి,ఊర్కోండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఓబీసీ జిల్లా అధ్యక్షులు



వాగుల్దాస్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ అరెస్టులు,లాఠీలతో మా గొంతు నొక్కలేరు. ఊర్కోండ ప్రజల ఆకాంక్ష కల్వకుర్తి రెవెన్యూ డివిజన్‌లో ఉండటమే.కల్వకుర్తిని జిల్లాగా చేసే వరకు,ఊర్కొండ డివిజన్ మార్చకుండా ఉండే వరకు మా పోరాటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో,సంఘీభావం తెలిపిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాభవన్ చైర్మన్ పరిరక్షణ సమితి సింగిరెడ్డి పరమేశ్వర్,బహుజన శోభాయాత్ర ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రమేష్,రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అశోక్,కల్వకుర్తి జేఏసీ నాయకులు ఆయిలలు సదానంద గౌడ్,షబ్బీర్,భాజపా సీనియర్ నాయకులు ఉన్నారు.

## మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



**హుజూర్‌నగర్, జనవరి 14 (జనంసాక్షి) :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమ నేత ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డిని సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో హుజూర్ నగర్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ హుజూర్ నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కృషి వల్ల మంచి ఫలితాలు సాధించారని అభినందించారు. ఇదే ఉత్సాహంతో రానున్న రోజుల్లో జరగనున్న మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చిన అందరూ కలసి సమన్వయంతో పనిచేసి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని దిశ నిర్దేశం చేశారన్నారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో హుజూర్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి డాక్టర్ కొప్పుల సైదిరెడ్డి, మండల బిఆర్ఎస్ నాయకులు కీత ధనమూర్తి, సారెడ్డి భాస్కర్ రెడ్డి, కామిశెట్టి వెంకటేశ్వర్లు, ఉస్తేల అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కొండాపురంలో గంగిరెద్దుల సందడి

**చండూరు, జనవరి 14 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగ వచ్చిందంటే పల్లెల్లో మొదట గుర్తొచ్చేది గంగిరెద్దులే. అయితే, మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ ప్రాచీన సంప్రదాయం కనుమరుగవుతున్న తరుణంలో చండూరు మండలంలోని కొండాపురం గ్రామంలో గంగిరెద్దుల సందడి గ్రామస్థులకు పాత జ్ఞాపకాలను గుర్తుచేసింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో గంగిరెద్దుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

### ముస్తాబైన బసవన్నలు - మురిసిపోయిన గ్రామస్థులు

రంగురంగుల వస్త్రాలు, మూపురానికి అలంకరణలు, కాళ్లకు గజ్జెలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన గంగిరెద్దులను చూసి గ్రామస్థులు, ముఖ్యంగా చిన్నారులు సంభ్రమాశ్చర్యాలకు




లోనయ్యారు. సన్నాయి మేళానికి, డోలు దరువుకు అనుగుణంగా గంగిరెద్దులు లయబద్ధంగా అడుగులు వేస్తూ చేసిన విన్యాసాలు చూపరులను కట్టిపడేశాయి.గంగిరెద్దుల వారు ఇంటింటికీ తిరుగుతూ… "అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు" అంటూ బసవన్నలతో చేయించిన విన్యాసాలు, 'డూడూ బసవన్న' అనే శబ్దాలు పండుగ వాతావరణాన్ని మరింత శోభాయమానంగా మార్చాయి. ఆ ఇంటికి శుభం కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని గంగిరెద్దుల వారు దీవించడం మన సంప్రదాయంలో భాగం.

### అంతరించిపోతున్న కళకు ఆదరణ

గతంలో ప్రతి సంక్రాంతికి వీధివీధినా కనిపించే గంగిరెద్దులు, నేడు అరుదుగా మారుతున్నాయి. సరైన ఆదరణ లేక, పొట్టకూటి కోసం కళాకారులు ఇతర వృత్తుల్లోకి మారుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొండాపురంలో గంగిరెద్దులు దర్శనమివ్వడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న ఈ జానపద కళను ఆసక్తిగా తిలకించి, తమ వంతుగా కళాకారులకు ధాన్యం, వస్త్రాలు, నగదు రూపంలో కానుకలు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

## యువత అన్ని రంగాల్లో రాణించాలి



**కొండమల్లేపల్లి, జనవరి 14 (జనంసాక్షి) :** యువత అన్ని రంగాల్లో రాణించాలని దేవరకొండ బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శరీర దృఢత్వం పెంపొందుతుంది అని ఆయన అన్నారు. క్రీడలలో రాణించాలని ఆయన సూచించారు. యువతకు తనవంతుగా అండగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావాటి వెంకటేష్, పిల్లి పరమేష్, పంది హరికృష్ణ, పంది శ్రీరాములు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.




# స్మార్ట్‌ఫోన్ ప్రియులకు ధరల షాక్..

## బాంబు పేల్చిన నథింగ్ సీఈఓ!

ఒకప్పుడు రూ.10వేల ధరలో 10 ఎంపీ కెమెరా.. 2 జీబీ ర్యామ్‌తో స్మార్ట్‌ఫోనంటే గొప్ప విషయం. ఇప్పుడు అదే రూ.10వేల ధరలో 50 ఎంపీ కెమెరా, 6000 ఎంఏహెచ్ బ్యాటరీతో ఫోన్లు వచ్చేస్తున్నాయి. పైగా డిస్‌ప్లే సైతం మెరుగవుతోంది. కొత్త ఫీచర్లు యాడ్ అవుతున్నాయి. హార్డ్‌వేర్ ధరలు ఏటికేడు తగ్గుతుండడంతో ధరలు పెంచకుండా మెరుగైన ఫీచర్లతో స్మార్ట్‌ఫోన్లను అందిస్తూ వస్తున్నాయి కంపెనీలు. ఈ పరిస్థితి ఇకపై ఉండకపోవచ్చు అంటున్నారు నథింగ్ సీఈఓ కార్ల్ పై. 2026లో మునుపటిలా తక్కువ ధరకే స్మార్ట్‌ఫోన్‌లు లభించే అవకాశం ఉండబోదని, మెరుగైన స్పెసిఫికేషన్స్‌తో స్మార్ట్‌ఫోన్ కావాలంటే అధిక ధర చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. అందుకు గల కారణాలను వివరించారు."గడిచిన 15 ఏళ్లుగా స్మార్ట్‌ఫోన్ ఇండస్ట్రీలో ఒకే ట్రెండ్ కొనసాగుతూ వచ్చింది. మెమొరీ, డిస్‌ప్లే ధరలు ఏటికేడు తగ్గుతుండడంతో ధరలు పెంచకుండానే మెరుగైన స్పెసిఫికేషన్లతో స్మార్ట్‌ఫోన్లు వచ్చాయి. 2026లో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మెమొరీ ధరలు ఊహించని విధంగా పెరిగిపోయాయి. ముఖ్యంగా ఏఐ కంపెనీల నుంచి అనుకోని పోటీ ఎదురైంది. దీంతో స్మార్ట్‌ఫోన్లలో ఉపయోగించే చిప్స్‌కు డిమాండ్ ఏర్పడింది. ఏఐ కంపెనీలు మెమొరీ ఉత్పత్తి చేసే కంపెనీలతో లాంగ్ టర్మ్ కాంట్రాక్టులు కుదుర్చుకున్నాయి. ఫలితంగా మెమొరీ ధరలు గతేడాది కంటే మూడు రెట్ల వరకు పెరిగాయి. ఇది ఫోన్ తయారీదారులకు పెద్ద సవాల్. దీంతో ధరలు పెంచాలా? లేక స్పెసిఫికేషన్స్ తగ్గించాలా? అనే పరిస్థితి నెలకొంది" అని కార్ల్‌పై పేర్కొన్నారు.




**ఏ కారు మెయింటెనెన్స్ ఖర్చు తక్కువంటే!**

ఈ పరిస్థితుల్లో స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు మొబైల్ ధరలను 30% లేదా అంతకంటే ఎక్కువ పెంచాల్సి రావచ్చని కార్ల్ పై అభిప్రాయపడ్డారు. లేదంటే స్పెసిఫికేషన్స్‌ను తగ్గించాల్సి ఉంటుందనన్నారు. ముఖ్యంగా బడ్జెట్, మిడ్-రేంజ్ స్మార్ట్‌ఫోన్లు ఎక్కువగా ప్రభావితం అవుతాయన్నారు. కొన్ని మోడళ్లు మార్కెట్‌లో కనిపించకుండా పోవచ్చన్నారు. ఇందుకు నథింగ్ కూడా మినహాయింపు కాదన్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో విడుదలయ్యే నథింగ్ ఫోన్ ధరలు కూడా పెరుగుతాయని స్పష్టంచేశారు. స్పెసిఫికేషన్లకు బదులు యూజర్ ఎక్స్‌పీరియన్స్, డిజైన్‌పై తాము దృష్టిపెడతామని పేర్కొన్నారు. 2026లో స్పెక్స్ రేసు పోయి.. డిజైన్, ఎక్స్‌పీరియన్స్‌పై దృష్టి సారించాల్సిన పరిస్థితులు మొదలవుతాయని అభిప్రాయపడ్డారు.

# 25,700 దిగువకు నిఫ్టీ

## నష్టాల్లో ముగిసిన సూచీలు..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఒడుదొడుల అనంతరం నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, రియల్టీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. భౌగోళిక రాజకీయ పరిణామాలు, భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతుండడం మన మార్కెట్లపై ప్రభావం చూపింది. దీంతో వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. మహారాష్ట్రలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో గురువారం (జనవరి 15) బీఎస్ఈ, ఎన్ఎస్ఈ పనిచేయవు. తిరిగి శుక్రవారం మార్కెట్లు తెరుచుకోనున్నాయి. సెన్సెక్స్ ఉదయం 83,358.54 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,627.69) నష్టాల్లో ప్రారంభమైంది. మధ్యలో కాసేపు లాభాల్లోకి వచ్చినా ఎంతోసేపు నిలవలేదు. ఇంట్రాడేలో 83,185.20 - 83,809.98 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 244.98 పాయింట్ల నష్టంతో 83,382.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 66.70 పాయింట్ల నష్టంతో 25,665.60 వద్ద స్థిరపడింది. డాలరుతో



రూపాయి మారకం విలువ 90.31గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, సన్‌ఫార్మా, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎటెర్నల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4,636 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# '10 మినిట్స్ డెలివరీ' తొలగించిన స్విగ్గీ, జెప్టో

క్విక్ కామర్స్ సంస్థలైన స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో '10 మినిట్స్ డెలివరీ' బ్రాండింగ్‌ను నిలిపివేశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్లింకిట్ మంగళవారం తొలుత ఈ నిర్ణయం తీసుకోగా.. బుధవారం ఈ రెండు సంస్థలూ '10 నిమిషాల్లో డెలివరీ' ప్రకటనను ఆపివేశాయి. త్వరితగతిన డెలివరీ పేరుతో డెలివరీ ఏజెంట్లపై ఒత్తిడి తెస్తున్నారంటూ గిగ్ వర్కర్ల నుంచి ఇటీవల ఆందోళనలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ.. బ్లింకిట్, జెప్టో, జొమాటో, స్విగ్గీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. డెలివరీ కార్మికుల సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి హామీ ఇవ్వొద్దని ఆయా సంస్థలకు స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో '10 నిమిషాల డెలివరీ' ప్రకటనను తొలగింపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయి. అయితే, బ్రాండింగ్ మారుతుందే తప్ప.. కస్టమర్లకు క్విక్ డెలివరీలు మాత్రం ఎప్పటిలానే కొనసాగుతాయి. 10 నిమిషాల నిబంధన తొలగించడం వల్ల డెలివరీ ఏజెంట్లపై ఆ మేర ఒత్తిడి తగ్గుతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ స్వాగతించింది.




# బంగారు కొండ


## సరికొత్త గరిష్ఠాలకు బంగారం వెండి ధరలు..

**జనంసాక్షి:** భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఎన్నడూలేని రీతిలో సరికొత్త రికార్డులను నెలకొల్పుతూ దూసుకెళుతున్నాయి. ఫ్యూచర్ మార్కెట్‌లో కిలో వెండి ధర మార్చి డెలివరీ కాంట్రాక్ట్ ఒక్క రోజులోనే రూ.12,803 పెరిగి రూ.2.87 లక్షలకు చేరింది. బంగారం సైతం 10 గ్రాములు రూ.1.43 లక్షల వద్ద ట్రేడవుతోంది. గత నాలుగు రోజుల్లోనే వెండి ధర రూ.35 వేలు మేర పెరిగింది. ఈ ఏడాదిలో (2026) ఇప్పటివరకు రూ.52 వేలు పెరగడం గమనార్హం. గతేడాది డిసెంబర్ 31 నాటికి రూ.2.35 లక్షలుగా ఉంది.ఇక బంగారం సైతం ఫ్యూచర్ మార్కెట్‌లో ఫిబ్రవరి కాంట్రాక్ట్ ఒక్క రోజులో రూ.932 పెరిగి రూ.1.43 లక్షల వల్ల సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో (స్పాట్ గోల్డ్) 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,600 పలుకుతుండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,31,650గా ఉంది. కిలో వెండి ధర రూ.2,88,300 ఉందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ విపణిలో ప్రస్తుతం బంగారం ఔన్సు 4,638.75 వద్ద ట్రేడవుతుండగా, వెండి 90 డాలర్ల ఎగువన కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.20గా ఉంది. రూపాయి విలువ క్షీణత కూడా దేశీయ బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతోంది.

**కారణాలు ఇవీ..**

తాజాగా విడుదలైన అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న అంచనాలను పెంచాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలంత్రి పేర్కొన్నారు. ఈ అంచనాలు బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమయ్యాయని తెలిపారు. కమొడిటీ ఎక్స్ఛేంజీలో వెండి ఔన్సు తొలిసారి 91 డాలర్ల మార్కును చేరుకుందన్నారు. దీనికితోడు భౌగోళిక ఉద్రిక్తతలు కూడా మరో కారణమని తెలిపారు. ఇరాన్‌లోని పౌరుల ఆందోళనలు, ఉక్రెయిన్-రష్యా మధ్య కొనసాగుతున్న దాడుల కారణంగా సురక్షిత పెట్టుబడి సాధనాలుగా భావించి బంగారం, వెండిపై పెట్టుబడులు కుమ్మరిస్తుండడంతో వీటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.




# అవాంతరం తాత్కాలికమే..

**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) నమ్మదగ్గ ప్రయోగ నౌకగా పేరుగాంచిన పీఎస్ఎల్‌వీ (పీఎస్ఎల్‌వీ- సీ62) ప్రయోగం విఫలం అవ్వడం దేశీయ అంతరిక్ష రంగాన్ని నిరాశపర్చింది. ఇందువల్ల 16 ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరుకుండానే నింగిలో కలిసిపోయాయి. ఇది ఇస్రోకే కాకుండా, అంతరిక్ష రంగంలో వినూత్న ఆవిష్కరణలతో దూసుకుపోతున్న హైదరాబాద్ అంకురాలు అయిన ధ్రువ స్పేస్, టేక్‌మీ2స్పేస్, ఈయాన్ స్పేస్ ల్యాబ్స్ కలలనూ దెబ్బతీసింది.ప్రస్తుతానికి అంకురాలకు ఇది అవాంతరం మాత్రమే. ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరకపోయినా, వాటిని తయారు చేసే పరిజ్ఞానం కంపెనీల దగ్గరే ఉంది. మళ్లీ రాకెట్ స్లాట్ దొరకడమే ఇప్పుడు తమకు ప్రధాన సమస్య అని ఈ కంపెనీలు చెబుతున్నాయి. స్లాట్ దొరికితే.. 3-6 నెలల్లోనే ఈ కంపెనీలు తమ ఉపగ్రహాలను మళ్లీ ప్రయోగించే అవకాశం ఉంది.

ధ్రువస్పేస్: ఈ సంస్థకు చెందిన 5 డిప్లాయర్లు పీఎస్ఎల్‌వీలో అమర్చారు. ఇవి 6 ఉపగ్రహాలను మోసుకెళ్లాయి. వీటిలో ధ్రువ స్పేస్ సొంతంగా రూపొందించిన థైబోల్ట్-3 క్యూబ్‌శాట్, సీజీయూశాట్-1, డీశాట్-1, లాచిత్-1తోపాటు



నేపాల్‌కు చెందిన మునాల్ ఉపగ్రహం, సంస్కార్ శాట్ ఉన్నాయి. వీటితోపాటే టేక్‌మీ2స్పేస్ సంస్థకు చెందిన ఎంఓఐ-1 ఉపగ్రహం కూడా ఉంది.

టేక్‌మీ2స్పేస్: ఈ కంపెనీ రూపొందించిన ఎంఓఐ-1 ఉపగ్రహం ప్రపంచంలోనే తొలి అంతరిక్ష సైబర్ కేఫ్ లేదా డేటా సెంటర్‌గా రికార్డు సృష్టించాల్సి ఉంది. 14 కిలోల బరువు, 120వాట్ల సామర్థ్యం కలిగిన ఈ ఉపగ్రహంలో ఎన్విడియా జీపీయూ అమర్చారు. అంతరిక్షంలోనే కృత్రిమ మేధ ద్వారా చిత్రాలను విశ్లేషించడం, వినియోగదారులకు నిమిషానికి 2 డాలర్ల చొప్పున ప్రాసెసింగ్ సమయాన్ని అద్దెకు ఇవ్వడం దీని ప్రధాన ఉద్దేశం. 'గూగుల్ 2027లో ప్రారంభించనున్న ప్రాజెక్టు 'సన్‌క్యాచర్' కంటే ముందే ఈ ఘనత సాధించాలన్నది' ఈ హైదరాబాద్ సంస్థ లక్ష్యం.

ఈయాన్ స్పేస్ ల్యాబ్స్: ఎంఓఐ-1 ఉపగ్రహంలోనే ఈయాన్ స్పేస్ ల్యాబ్స్ రూపొందించిన మీరా అనే చిన్నపాటి స్పేస్ టెలిస్కోపు అమర్చారు. కేవలం 500 గ్రాముల బరువుతో, దేశంలోనే అత్యంత తేలికైన, చిన్న టెలిస్కోపుగా ఇది గుర్తింపు పొందింది. ఈ ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్ కక్ష్యలోకి చేర్చనందున, తమ అత్యాధునిక ఇమేజింగ్ టెక్నాలజీని ప్రపంచానికి నిరూపించేందుకు ఈ సంస్థ మరో 3 నెలలకుపైగానే వేచి చూడక తప్పని పరిస్థితి.

**కొన్ని వారాల్లోనే సిద్ధమవుతాం**

**సంజయ్ నెక్కంటి, సీఈఓ, సహ వ్యవస్థాపకుడు, ధ్రువ స్పేస్**

'అంతరిక్షం సహజంగానే అత్యంత సంక్లిష్టం. భారత్‌లోని పలు ప్రైవేటు అంతరిక్ష సంస్థలు మౌలిక వసతులను భారీ ఎత్తున, నిలకడగా నిర్మిస్తున్నాయి. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొని, వేగంగా కోలుకునే సామర్థ్యం మాకుంది. ఇస్రో వ్యవస్థలను వినియోగించుకుంటూనే, ధ్రువ స్పేస్ సొంతంగా పూర్తిస్థాయి సాంకేతిక సామర్థ్యాలను సమకూర్చుకుంది. ఉపగ్రహాల తయారీ నుంచి గ్రౌండ్ స్టేషన్ సేవల వరకు మా వినియోగదారులకు అండగా నిలుస్తున్నాం. ప్రస్తుతం మా దృష్టి త్వరగా తిరిగి కోలుకోవడంపైనే ఉంది. మాకున్న అంతర్గత సామర్థ్యాలతో కొన్ని వారాల్లోనే తదుపరి ప్రయోగాలకు సిద్ధం కాగలం. భారత అంతరిక్ష కార్యక్రమాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది.'


# రూపాయి విలువను మార్కెట్లే నిర్ణయిస్తాయ్



**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని కేవలం కరెన్సీ మారకపు విలువతోనే లెక్కించడం సరికాదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. అమెరికా డాలర్ విలువ రూ.90ని మించడం కూడా, కరెన్సీ సాధారణ కదలికల్లో భాగమేనని పేర్కొన్నారు. భారత ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉన్నాయని.. వృద్ధిరేటు అధికంగా ఉండటం, ద్రవ్యో ల్బణం అదుపులో కొనసాగడం, ఆర్థిక స్థిరత్వం, పెట్టుబడులు-వినియోగం ఆరోగ్యకరంగా నమోదవ్వడాన్ని ఎన్‌డీటీవీ ఇంటర్వ్యూలో ఆయన ప్రస్తావించారు విదేశీ మారకపు నిల్వలు కూడా 690 బిలియన్ డాలర్లకు పైగా ఉన్నాయని గుర్తు చేశారు. రూపాయి విలువ నిర్ణయం అనేది మార్కెట్ల చేతిలో ఉందని, తీవ్ర హెచ్చుతగ్గులు నమోదవ్వకుండా చూడటం వరకే ఆర్‌బీఐ పాత్ర ఉంటుందని, దీర్ఘకాలంగా మన విధానం అదేనని వివరిం చారు. డాలర్ విలువ రూ.90ని మించినా కూడా, తమ పాత్ర మారదన్నారు. నవంబరులో రూపాయి విలువ ఎక్కువగా తగ్గేందుకు, అమెరికా మన ఉత్పత్తులపై విధించిన అధిక సుంకాలు కూడా కారణమయ్యాయని పేర్కొ న్నారు. ఎగుమతుల ఆదాయ వృద్ధి తగ్గగా, బంగారం-వెండి సహా ఇతర దిగుమతుల బిల్లు భారం పెరిగి, డాలర్‌కు గిరాకీ అధికమైందని వివరిం చారు.సరఫరాలు బాగున్నందునే ద్రవ్యోల్బణం అదుపులో: దేశీయంగా ద్రవ్యో ల్బణం తక్కువగా ఉండేందుకు, సరఫరాలు మెరుగ్గా ఉండటమే కారణమని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు.

# తీరం చేరిన 'కౌండిన్య'

నౌకాయాన రంగంలో భారత్ అరుదైన ఘనత సాధించింది. ఇటీవల గుజరాత్‌లోని పోరుబందర్ నుంచి బయల్దేరిన 'ఐఎన్ఎస్‌వీ కౌండిన్య' బుధవారం ఒమన్‌లోని మస్కట్‌కు విజయవంతంగా చేరుకుంది. ఎటువంటి ఇంజిన్ లేకుండా పూర్తిగా తెరచాపల సాయంతో పయనించి తన గమ్యాన్ని చేరుకుంది. దాదాపు 1400 కిలోమీటర్ల ప్రయాణాన్ని.. 17 రోజుల్లో పూర్తి చేసింది. మస్కట్‌కు చేరుకున్న అనంతరం ఓడలోని సిబ్బంది సంబరాలు చేసుకున్నారు.అజంతా గుహల్లోని 5వ శతాబ్దం నాటి పెయింటింగ్‌లోని ఒక నౌక నుంచి ప్రేరణ పొందిన ఆధునిక భారత నిపుణులు.. 'ఐఎన్ఎస్‌వీ కౌండిన్య' రూపంలో దాన్ని పునఃసృష్టించారు. దీని తయారీలో పురాతన విధానాలనే అవలంబించారు. లోహాలు, మేకులను ఉపయోగించలేదు. చెక్కలను వాడారు. వీటిని కొబ్బరి పీచుతో తయారుచేసిన తాళ్లతో గుదిగుచ్చారు. అందువల్ల ఈ నౌకను 'స్టిచ్డ్ షిప్'గా పిలుస్తున్నారు. సముద్ర ఉప్పునీటి నుంచి రక్షణ కోసం దీనికి సహజసిద్ధ జిగురుపూతను వేశారు.



# రైలుపై జారిపడిన క్రేన్..

స్థానిక పోలీసులు వెల్లడించారు.బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఖియో జిల్లాలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ కోసం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ నిర్మాణ పనుల్లో ఉన్న ఓ క్రేన్ అదుపుతప్పి ఒక్కసారిగా కింద పడింది. అదే సమయంలో కింద ఉన్న పట్టాలపై నుంచి ఓ ప్రయాణికుల రైలు వెళ్తోంది.క్రేన్ పడటంతో ఆ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో మంటలు చెలరేగాయి. ఈ సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 29 మంది మృతిచెందగా.. మరో 60 మందికి పైగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బోగీల్లో చిక్కుకున్న వారిని వెలికితీస్తున్నట్లు తెలిపారు.రైలు బ్యాంకాక్ నుంచి ఉబోన్ రాచథాని ప్రావిన్స్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రైలుకు మొత్తం 3 బోగీలు ఉండగా.. చివరి రెండు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో రైల్లో 195 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఇరాన్‌నుంచి భారతీయులు వెనక్కి వచ్చేయండి

ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. ఇప్పటివరకు 2500 మందికిపైగా మృతి చెందారు. మరోవైపు.. నిరసనలు కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగశాఖ ఇప్పటికే ఓసారి పౌరులను అప్రమత్తం చేసింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను మానుకోవాలని తెలిపింది.

# 40% పనులు ఏఐతోనే చకచక

## సహోద్యోగిగా మారుతున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్

సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ప్రస్తుతం టెక్ సంస్థల్లో దాదాపు 40% పనులు ఏఐ నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ సంఘం నాస్కామ్, ఇండీడ్ సంయుక్తంగా నిర్వహించిన 'వర్క్ రీ-ఇమాజిన్డ్- ది రైజ్ ఆఫ్ హ్యూమన్-ఏఐ కొలాబరేషన్' సర్వే తెలిపింది. 2027 నాటికి నిపుణులు, ఏఐ కలిసి పనిచేసే వాతావరణాన్ని 97% మంది మానవ వనరుల విభాగాధిపతులు ఊహిస్తున్నారు. ఆటోమేషన్ పెరుగుతున్నా, నాణ్యత కాపాడేందుకు మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని ఈ నివేదిక స్పష్టం చేసింది.ఏఐ ఒకప్పుడు బ్యాక్-ఆఫీస్ కార్యకలాపాలకే పరిమితం అయ్యేది. ఇప్పుడు టెక్ సంస్థల్లో ఒక సహోద్యోగిగా మారిపోయింది అని నివేదిక పేర్కొంది. వివిధ విభాగాల్లో 20-40% పనులను ఏఐ నిర్వహిస్తోంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఏఐని కేవలం సహాయం చేసేదిగా కాకుండా, రోజువారీ నిర్ణయాల్లో భాగంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో ఏఐతో కలిసి పనిచేసేలా ఉద్యోగులను సిద్ధం చేయడమే ప్రత్యామ్నాయమని నాస్కామ్ పరిశోధనా విభాగం అధిపతి కేతకీ కర్ణిక్ పేర్కొన్నారు.




**నాణ్యతపై ఆందోళన**

యాంత్రికీకరణ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఏఐ ఇచ్చే ఫలితాల నాణ్యతపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో, సగంకంటే ఎక్కువ మంది ఏఐ రూపొందించిన పనుల్లో అసంపూర్ణత లేదా తక్కువ నాణ్యత ఉన్నట్లు గుర్తించారు. ఏఐ చేసే పనుల్లో కచ్చితత్వం, సమగ్రత కాపాడేందుకు మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని నివేదిక తేల్చింది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో 45 శాతం పనులు ఏఐ ద్వారా జరుగుతుండగా, ఇంటెలిజెంట్ ఆటోమేషన్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ వంటివి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**నైపుణ్యాల తీరు మారుతోంది**

'కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాల సంఖ్య తగ్గుతోంది' అనేకంటే.. ఉద్యోగుల నుంచి సంస్థలు ఆశిస్తున్న పనితీరు మారుతోంది అని చెప్పొచ్చని ఇండీడ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శశి కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సంస్థలు, ఉద్యోగాల్లోకి వస్తున్నవారూ ఏఐతో కలిసి పనిచేసే వాతావరణానికి అలవాటు పడాల్సి ఉంటుందన్నారు. నియామక ప్రక్రియలోనూ మార్పులు వస్తున్నాయి. హైరింగ్ మేనేజర్లలో 85% మంది నైపుణ్యం ఆధారిత నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బహుళ నైపుణ్యాలున్న అభ్యర్థుల కోసం చూస్తున్నారు.

**ఏజెంట్లతో సవాళ్లు**

టెక్ రంగంలో ఏఐ ఏజెంట్లను విరివిగా వాడుతున్నారు. దాదాపు 95% సంస్థలు ఇప్పుడు వీటిని ఏదో ఒక రకంగా వినియోగిస్తున్నాయని, ఉపయోగించాలనే ఆలోచనలో ఉన్నాయని నివేదిక పేర్కొంది. డేటా ఆధారిత పనుల్లో ఇవి మనుషుల కంటే మెరుగ్గా పనిచేస్తాయని 65% మంది నమ్ముతున్నారు. అయితే కొన్ని చిక్కు సమస్యలూ ఉన్నాయి. 77% మంది భద్రత, గోప్యత అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత సాఫ్ట్‌వేర్ వ్యవస్థలతో ఏఐని అనుసంధానించడం, నైతిక విలువలు, మార్పు వల్ల ఉద్యోగుల ప్రతిఘటనల వంటి సవాళ్లు వస్తున్నాయని నివేదిక తెలిపింది.

# పట్టణ,రాజన్న ఆలయ అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం



- అభివృద్ధి చేస్తున్నాం.. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వండి
- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 14 (జనంసాక్షి):** వేములవాడ పట్టణ,రాజన్న ఆలయ అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని,అభివృద్ధి చేస్తున్నమని,రానున్న మున్సిపల్ ఎన్నికలలో ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం యివ్వండని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పట్టణ ప్రజలను కోరారు. బుధవారం సాయంత్రం వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలొ అయన మాట్లాడుతూ వేములవాడ పట్టణం, దేవాలయ అభివృద్ధి లో భాగంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు.ఇప్పటికే రూ 150 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రూ.47 కోట్లతో రహదారి వెడల్పు కార్యక్రమం జరుగుతుందన్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా రూ 2 కోట్ల 65 లక్షలతో బైపాస్ రోడ్ లో కొత్తగా సెంట్రల్ లైటింగ్, పట్టణంలో అన్ని కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం రూ 4 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. భక్తుల సౌకర్యం కొరకు రూ 1 కోటి 40 లక్షలతో గుడి చెరువులో బోటింగ్ కి ఏర్పాటు చేయబోతున్నమన్నారు.కుల మతాలకు అతీతంగా అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం, బీసీ భవన్ కోసం, గిరిజన ల కోసం ఎస్టీ భవనం కోసం, క్రిస్టియన్ ల కోసం పది రోజుల్లో స్థల సేకరణ చేసి పనులు ప్రారంభిస్తామన్నారు.ముస్లింలకు పెండింగ్ లో ఉన్న షాది ఖాన భవనం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు తమ సంపూర్ణ ఆశీస్సులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అందివ్వాలని అయన కోరారు. మూలవాగులోని గంగమ్మ తల్లి దేవాలయనికి భక్తులు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశామన్నారు.

**మనది ఫెడరల్ ప్రభుత్వం..**

మనది ఫెడరల్ ప్రభుత్వమని ఎన్నికలు రాగానే ప్రజలను తప్పుదోవ పట్టించే వారు ఉంటారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.ప్రతిపక్షాల గందరగోళ ప్రకటనలతో ప్రజలు మోస పోవద్దన్నారు.వేములవాడ మున్సిపల్లో ఓ సారి బిఆర్ఎస్,మరోసారి బీజేపీకి అవకాశం ఇచ్చారు వారి ఏం అభివృద్ధి చేశారని అయన ప్రశ్నించారు.మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వేములవాడలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులు ఒక్కసారి మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కూకట్పల్లిలో ఘనంగా కైట్ ఫెస్టివల్

## నల్లచెరువులో పతంగిని ఎగరేసిన హైడ్రా కమిషనర్





**హైదరాబాద్, జనవరి 14 (జనంసాక్షి):** కూకట్ పల్లి నల్ల చెరువులో బుధవారం పండగ వాతావరణం నెలకొంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పతంగులు ఎగురవేయడంతో అందరిలో జోష్ కనిపించింది. తన బాల్య, యవ్వన జీవితాన్ని గుర్తుకు తెచ్చుకొని పిల్లలు, యువకులతో కలసి పతంగిని ఎగురవేశారు. స్థానికుల ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ కూకట్పల్లి నల్లచెరువు చెంత కైట్ ఫెస్టివల్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024 సెప్టెంబరులో ఇక్కడ చెరువు విస్తరణ చేపట్టినప్పుడు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయని.. నేడు పండగ వాతావరణం నెలకొందని అన్నారు. కబ్జాలతో 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్ల చెరువును 30 ఎకరాలకు విస్తరించామన్నారు. 10 అడుగుల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు మురికిని వదిలించామన్నారు. చెరువు లోతును పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వరదలకు చెక్ పెడుతున్నామన్నారు. పై మెరుగులు దిద్దడం కాకుండా చెరువుల అభివృద్ధి అంటే యిలా ఉండాలని నిరూపించామన్నారు. ఇప్పుడు చెరువును చూస్తే ఎంతో ఆహ్లాదంగా ఉందని.. మరిన్ని అందాలు సమకూర్చుతున్నామని చెప్పారు. ఇక్కడకు 5 కిలోమీటర్ల నుంచి వచ్చి వాకింగ్ చేస్తున్నట్టు పలువురు చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. షటిల్ కోర్టు,కమ్యూనిటీ హాల్, యోగ కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్యిలా అనేక క్రీడలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రజలు ఉచితంగా వినియోగించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**మరో 14 చెరువులను తీర్చిదిద్దుతాం**

హైడ్రా మొదటి విడత 6 చెరువులు అభివృద్ధి చేయగా ఇప్పటికే బతుకమ్మకుంటను ప్రారంభించామని.. మరో 3 చెరువులను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. వీటికి తోడు మరో 14 చెరువుల అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని.. త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. యిలా నగరంలో 100 చెరువులు అభివృద్ధి జరిగితే చాలావరకు వరదలను నియంత్రించవచ్చు అని అన్నారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చుతున్నామని.. దీంతో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా మంచి నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. మొత్తమ్మీద చెరువులు వేడుకలకు వేదికలవ్వడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. చెరువును ఈ స్థాయిలో అభివృద్ధి చేస్తారని తాము ఊహించలేదని.. ఇప్పుడు చూస్తే ఎంతో సంతృప్తిగా ఉందని అక్కడి నివాసితులు చెప్పారు. దుర్గంధభరితమైన వాతావరణాన్ని తొలగించి ఆహ్లాదాన్ని నింపిన హైడ్రాకు, ప్రభు త్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వాకింగ్ ద్వారా మా ఆరోగ్యాలను మెరుగు చేసుకుంటున్నామని చెప్పారు. చిన్నపిల్లలు అందరూ కలసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్కి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు, స్థానికులకు హైడ్రా కమిషనర్ మిఠాయిలు పంచారు.

# స్వామివారి సేవలో రిటైర్ జెసి



**రాజన్న సీరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 14 (జనంసాక్షి)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ వెంకట చారి స్వామివారిని దర్శించుకున్నారు.అయన కూతురు రాజన్న ఆలయ ఈఓగా విధులు నిర్వహిస్తున్న రమాదేవితో కలిసి బీమేశ్వర స్వామి ఆలయంలో ముందుగా స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకొని, స్వామివారికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదొక్త ఆశీర్వచనం గావించారు. కూతురు ఆలయ ఈఓ అయినప్పటికీ ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండ సామాన్య భక్తుడి వలే స్వామివారిని దర్శించుకున్నారు.

## తెలంగాణ అర్చకుల సమస్యలు పరిష్కారించాలని

### మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం




**గోదావరిఖని, (జనంసాక్షి) :** తెలంగాణలోని దేవాలయ అర్చకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలంటూ, థర్డ్ పార్టీ ఎంక్వయిరీలను తక్షణమే నిలిపివేయాలంటూ తెలంగాణ దీప దూప నైవేద్య అర్చక సంఘం ప్రతినిధులు రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిట్టూరి సతీష్ శర్మ , పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఏటూరి శ్రావణాచార్యులు పాల్గొన్నారు. ఈ వినతి పత్రంలో అర్చకులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరించారు. ముఖ్యంగా, దేవాలయాల్లో అర్చకుల పనితీరుపై థర్డ్ పార్టీ ఎంక్వయిరీలు నిర్వహించడం వల్ల వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఇది వారి సేవలను ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు. అలాగే, వేతనాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, దేవాలయ నిర్వహణలో అర్చకుల పాత్రను గుర్తించడం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నిట్టూరి సతీష్ శర్మ మాట్లాడుతూ, "తెలంగాణ లోని దేవాలయాలు మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలు. అర్చకులు ఈ వారసత్వాన్ని కాపాడుతున్నారు. కానీ వారి సమస్యలు పరిష్కరించకపోతే, దేవాలయ సేవలు దెబ్బతింటాయి. థర్డ్ పార్టీ ఎంక్వయిరీలు అనవసరమైనవి వాటిని నిలిపివేయాలి" అని అన్నారు. ఏటూరి శ్రావణాచార్యులు మాట్లాడుతూ, అర్చకుల సమస్యలను వివరిం చారు. "మా సమస్యలు పరిష్కరించడంతో పాటు, అర్చకులకు భద్రత సమాన అవకా శాలు కల్పించాలి" అని కోరారు.మంత్రి కొండా సురేఖ ఈ వినతి పత్రాన్ని స్వీకరించి, అర్చ కుల సమస్యలపై త్వరలోనే చర్చలు జరిపి, సానుకూల నిర్ణయాలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. "దేవాదాయ శాఖలో అర్చకుల పాత్ర ముఖ్యమైనది. వారి సమస్యలను పరిగణనలోకి తీసుకుని, థర్డ్ పార్టీ ఎంక్వయిరీలపై సమీక్ష చేస్తాం" అని ఆమె పేర్కొన్నారు.

## ఆరు గ్యారంటీల ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన




**పాలకుర్తి, జనవరి 14 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీల ప్రతులను (మేనిఫెస్టోను) బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ యూత్ విభాగం నాయకులు, కార్యకర్తలు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికి ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసిన ఆరు గ్యారంటీల అమలు కూడా కాగితాలకే పరిమితం అయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిఆర్ఎస్ జిల్లా నాయకులు మహేందర్ నాయక్, లాకావత్ వెంకట్ నాయక్, శోభన్, ఎలమకంటి సతీష్, కమ్మగాని వెంకటేష్, యశ్వంత్, ప్రవీణ్, సుధాకర్, మల్లేష్, అంజనేయులు, ఐనోతు సురేష్ తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# అల్వాల్లోని కార్ల షోరూంలో అగ్ని ప్రమాదం




**హైదరాబాద్, జనవరి 14 (జనంసాక్షి):** హైదరాబాద్లోని అల్వాల్లో అగ్ని ప్రమాదం జరిగింది. ట్రూ వాల్యూ కార్ల షోరూంలో బుధవారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. హైదరాబాద్ లోని అల్వాల్లో అగ్ని ప్రమాదం జరిగింది. ట్రూ వాల్యూ కార్ల షోరూంలో బుధవారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు, నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

# మేడారం జాతర కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల పట్టాల పంపిణీ

- రైతులకు న్యాయమైన పరిహారం, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన
- పారదర్శకంగా భూసేకరణ పూర్తి చేసిన అధికారులకు అభినందనాలు.



**ములుగు,జనవరి14(జనంసాక్షి):** మేడారం జాతర ఏర్పాట్ల కోసం తమ భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో,రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బుధవారం మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో రైతులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మేడారం శాశ్వత అభివృద్ధి కోసం ప్రభుత్వం కోరగానే స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూములు ఇచ్చిన రైతులను తాము ఎప్పటికి గుర్తుం చుకుంటమన్నారు.మేడారం జాతర కోసం భూములు ఇచ్చిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందిం చాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని ఇంచర్ల ప్రాంతంలో,జాతీయ రహదారి వద్ద ఇళ్ల పట్టాలను కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా మేడారం జాతర సందర్భంగా వారికి షాపుల కేటాయింపును కూడా చేపట్టి, అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. మేడారం భూసేకరణ పనులను పూర్తిగా పారదర్శకంగా,నమ్మకంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఆర్డీఓ వెంకటేష్లను మంత్రి సీతక్క ఈ సందర్భంగా అభినందించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ ప్రక్రియ విజయవంతమైందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్ర, ఆర్డీఓ వెంకటేష్, భూములు కోల్పోయిన రైతులు, పూజారులు,ఆదివాసీ సంఘాలు, మేడారం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** మంథని నియోజక వర్గ ప్రజలకు మంథని ఎమ్మెల్యే ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియ జేశారు. పాత కష్టాలన్నీ భోగి మంటల్లో కాలిపోయి, అందరి ఇళ్లలో సుఖసంతోషాలు, కొత్త వెలుగులు నిండాలని, ఆయురారోగ్యాలతో అందరూ ఉండాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## పలిమెల పోలీస్ స్టేషన్ తనిఖీ



**మహదేవపూర్ (జనంసాక్షి) :** భూపాల్ పల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పలిమెల పోలీస్ స్టేషన్ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణం పరిసరాలకు శుభ్రత సిబ్బంది విధిని ర్వహణ అంశాలను జిల్లాలో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ వచ్చిన ప్రజలకు స్నేహ బావ వాతావరణం కల్పించడం తో పాటు పారదర్శక సేవలు అందించేలా ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని అలాగే శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ సిరిసేటి సంకీర్త్ పలిమెల ఎస్సై కి సూచించారు. ఆయన వెంట డిఎస్పి సూర్యనారాయణ. సీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

# భోగి సంబరాలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు. రామచందర్ నాయ్,

**మరిపెడ, జనవరి 14 (జనంసాక్షి):** డోర్నకల్ నియోజకవర్గం ప్రజలుసు ఖసంతోషాలతో, పాడిపంటలతో, సిరి సంపదలతో, వీరజిల్లుతూ ఉండాలని, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్, డాక్టర్ జాటోతు. రామచందర్ నాయక్ అన్నారు. బుధవారం మరిపెడ మున్సిపాలిటీకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు పెండ్లి. రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగనుపురస్కరించుకొనిమహిళలకుముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గులపోటీల్లోగెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి 6116, రెండవ బహుమతి 4116, మూడవ బహుమతి 3116 రూపాయలు గెలుపొందిన వారికి అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సిలేషన్ బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ! డోర్నకల్ నియోజకవర్గం ప్రజలు నా దేవుళ్ళన్నారు. ప్రజల ఓట్లతో నేడు అసెంబ్లీలో అడుగు పెట్టానని అన్నారు. వారి రుణం నేను ఎన్నటికీ మర్చిపోలేనన్నారు. డోర్నకల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లవేళలా సేవ చేస్తానన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో నన్నుగెలిపించినమాదిరిగానే కాంగ్రెస్ పార్టీఅభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఒంటికొమ్ము.



యుగంధర్ రెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, కాలం. రవీందర్ రెడ్డి,పానుగోతు. రామ్ లాల్, గంధసిరి. అంబరీష,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్కే తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు గుండగాని. వెంకన్న, రవి నాయక్, అప్సర్, అఫ్జల్, పాల్గొన్నారు.

# బీబీజీ సంక్రాంతి సంబరాలు

- లక్కీడ్రాలో ఉచిత ప్లాట్ పంపిణీ
- కొత్త కొనుగోలుదారులకు భారీ ఆఫర్లు

**హైదరాబాద్, జనవరి 14 (జనంసాక్షి):** ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బీబీజీ) సంక్రాంతి పండుగ వేళ తమ వినియోగదారులకు అదిరిపోయే కానుకలను ప్రకటించింది. "ఫ్రీ రిజిస్ట్రేషన్ నుండి ఫ్రీ ప్లాట్ వరకు" పేరుతో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్లో భాగంగా బుధవారం భారీ లక్కీ డ్రాను నిర్వహించి విజేతను ప్రకటించింది. బెవర్లీ హిల్స్ కాజా (కాజా), ఫార్చ్యూన్ ఎంపైర్ సిటీ (చలివేంద్రపాలెం), క్యాపిటల్ వెస్ట్ (కొండపావులూరు)లలో ప్లాట్లు కొనుగోలు చేసిన మొదటి 100 మంది కస్టమర్ల నుంచి లక్కీ డ్రా ద్వారా విజేతను ఎంపిక చేశారు. ఈ డ్రాలో మాచర్లకు చెందిన వి.కిరణ్ అదృష్ట విజేతగా నిలిచారు. బీబీజీ సీఎండీ ఎం.వి మల్లికార్జున్ రెడ్డి చేతుల మీదుగా విజేతకు బెవర్లీ హిల్స్ కాజాలో 30 లక్షల విలువైన 133.33 చదరపు గజాల ప్లాట్ను ఉచితంగా అందజేశారు. మిగతా 99 ప్లాట్ యజవానులకు రూ. 10,000 గిఫ్ట్ కూపన్లు బహుమతిగా లభించడం ఆశ్చర్యకరమైన సంతృప్తినిచ్చింది.

**కొత్త ఆఫర్: ఉచిత రిజిస్ట్రేషన్, స్మార్ట్ టీవీ**

వినియోగదారుల నుంచి వస్తున్న విశేష స్పందనను చూసి, బీబీజీ మేనేజ్మెంట్ మరిన్ని పండుగ ఆఫర్లను ప్రకటించింది. కొత్తగా ప్లాట్లు కొనుగోలు చేసే వారికి ఉచిత రిజిస్ట్రేషన్: ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం లేకుండా సంస్థే భరిస్తుంది నిర్ణీత గడువులోగా ప్లాట్ బుక్ చేసుకున్న వారికి 55 అంగుళాల భారీ స్మార్ట్ ఎల్ఈడీ టీవీని ఉచితంగా అందజేయనున్నారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ.. "పారదర్శకత, కస్టమర్ల సంతృప్తికే తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, సామాన్యులకు కూడా ప్లాట్ సొంతం చేసుకునే అవకాశాన్ని కల్పించడమే బీబీజీ లక్ష్యమని" ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సహచరులు పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నారు.




# పేదింటి పెద్దమనసు

- ఇద్దరు అంధులకు వెలుగులు
- నేత్రదానం చేసిన కుటుంబం

**గోదావరిఖని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్నగర్కు చెందిన నిరుపేద కుటుంబం, తీరని విషాదంలోనూ మానవత్వాన్ని చాటుకుంది. కుటుంబ పెద్దను కోల్పోయిన దుఃఖాన్ని దిగమింగుకుని, ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపింది. హైదరాబాద్లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దేవరకొండ ప్రకాష్ (57) బుధవారం మృతి చెందారు. కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించిన ప్రకాష్ అకాల మరణం వారి కుటుంబాన్ని తీవ్రంగా కలిచివేసింది. గోదావరిఖనిలోని మేదరిబస్తీ టర్నింగ్ లో చాలా కాలం చెప్పులు కుట్టిన ప్రకాష్, గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొంతకాలంగా హైదరాబాద్లో కుటుంబంతో ఉంటూ, అద్దె ఇంట్లో నివసిస్తూ జీవనం సాగించారు. కాగా, భర్త అకాల మరణంతో భార్య రమ, తండ్రి మరణంతో దిగ్భ్రాంతికి గురైన కొడుకు ఉదయ్ ప్రకాష్, కూతుళ్ళు--అల్లుళ్లు మౌనిక-నరేష్, మానస-ప్రభుదాస్ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయినా, మృతుని ద్వారా సమాజానికి ఉపయోగం కలిగేలా ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. మృతుని నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు వస్తుందని ప్రకాష్ స్నేహితుడు, మాజీ పోలీస్ కానిస్టేబుల్, సదాశయ ఫౌండేషన్ జిల్లా సలహాదారులు దేవీ లక్ష్మీనర్సయ్య కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీనికి స్పందించిన కుటుంబ సభ్యులు, ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన దుఃఖంలోనూ మానవతా దృక్పథంతో నేత్రదానానికి అంగీకరించారు. దీంతో హైదరాబాద్లోని వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ల సహకారంతో ప్రకాష్ నేత్రాలను విజయవంతంగా దానం చేశారు. ఈ దాతృత్వంతో ఇద్దరు అంధుల జీవితాల్లో కొత్త వెలుగు నిండనుంది. పార్థీవ దేహాన్ని బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బసంత్ నగర్ కు తరలించారు. ఈ స్ఫూర్తిదాయక నిర్ణయానికి సదా శయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణా రెడ్డి, నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, కే.ఎస్. వాసు, వెల్దీ అనంత రాములు కవిత, ఫౌండేషన్ పాలకుర్తి మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్, చింతకింద కనక య్యతోపాటు రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్లప్ప, సారయ్య, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి.మల్లికార్జున్, మాజీ కానిస్టే బుల్ దేవీ లక్ష్మీనర్సయ్య కుటుంబాన్ని ప్రశంసించారు. ప్రకాష్ అకాల మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# ఇళ్ల స్థలాల సాధన ఒక విజయం మాత్రమే : జాన్‌వెస్లీ

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శిని కలిసి అభినందనలు తెలియజేసిన ఫాబ్‌సిటీ నిర్వాసితులు



**హైదరాబాద్, (జనంసాక్షి) :** సీపీఎం నాయకత్వంలో పోరాడి విజయం సాధించుకున్న రావిరాల జన్నాయిగూడెం ఫాబ్‌సిటీ భూ నిర్వాసితులు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసి అభినందించారు. దశబ్దాలుగా పోరాట ఫలితంగా వీరికి ఎకరాకు 150 నుండి 250 గజాల ఇంటిస్థలం వచ్చిందని, భూమికి నష్టపరిహారం, తదితర హామీలు నెరవేరలేదని వాటి అమలుకోసం పోరాటాలు నిర్వహించాలని జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా రావిరాల జన్నాయిగూడెంలో 224 మంది రైతుల వద్ద 827 ఎకరాల భూమిని 2004లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఫాబ్ సిటీ నిర్మాణ కోసం తీసుకోకున్నది. భూమి పొజిషన్లో ఉన్న వారికి ఎకరాకు 150 గజాలు, భూమి కోల్పోయిన సీలింగ్ రైతులకు ఎకరాకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామన్న హామి అమలు కోసం రైతులు రెండు దశబ్దాలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఫాబ్ సిటీలో పారిశ్రామికవేత్తలకు మాత్రం పరిశ్రమల నిర్మాణాలకు అనుమతు లిచ్చింది. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక దఫాలుగా పోరాటాలు నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల రావిరాల ప్రాంత సందర్శన నేపథ్యంలోనే పెద్దఎత్తున సీపీఎం ప్రతిఘటన కార్యక్రమాలకు పూనుకోగా, అధికారులు చర్చించి రైతులకు ఇస్తామన్న 150 నుండి 250 గజాల స్థలాల ఉచిత రిజిస్ట్రేషన్, ఇళ్ల స్థలాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందనే ఒప్పందం జరిగింది. నేటికీ నలుగురికి రిజిస్ట్రేషన్స్ కూడా జరిగాయి. ప్రస్తుతం ఒక ఎకరా సుమారు రు.20 కోట్ల విలువ ఉంటుంది. ప్లాటు విలువ కేవలం రు.60లక్షలు మాత్రమే ఉంటుంది. ఇళ్ల స్థలాల సాధన ఒక విజయం మాత్రమేనని జాన్‌వెస్లీ పేర్కొన్నారు.ప్రభుత్వం సేకరించిన భూమికి నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని, ముఖ్యమంత్రి కాలయాపన చేయకుండా వెంటనే మిగిలిన రైతులందరికీ ప్లాట్ల కేటాయింపుతో పాటు, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, మిగతా హామీల అమలు ప్రక్రియను పూర్తి చేయాలని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రైతులకు, కూలీలకు, పేదలకు ఎక్కడ అన్యాయం జరిగినా పోరాటాల్లో సీపీఐ(ఎం) ముందు ఒటుందని జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి రామచందర్, ఆర్ స్వామి, నిర్వాసితుల నాయకుడు నర్సింహ, ప్రశాంత్, నాగేష్, భిక్షపతి, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 22న నిమ్స్‌లో ప్రొఫెసర్ కాకర్ల జాతీయ సదస్సు

**వివరాలు వెల్లడించిన నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ నగరి బీరప్ప**



**ఖైరతాబాద్, జనవరి 14 (జనంసాక్షి) :** నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్), సొసైటీ ఆఫ్ ఇండియ న్ రేడియోగ్రాఫర్స్, తెలంగాణ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 22వ తేదీన నిమ్స్‌లో ప్రొఫె సర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సు నిర్వహిం చనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొ.డా. నగరి బీరప్ప రేడియాలజీ జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచ ర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ నిమ్స్ రేడియాలజీ విభాగం సాంకేతికంగా దేశంలోనే అగ్రగామిగా ఉందని తెలిపారు. కచ్చితమైన రోగ నిర్ధారణకు అవసరమైన అన్ని రకాల అధునాతన యంత్ర పరికరాలు, సీటీ, ఎంఆర్ఐ, డీఎస్ఏ వంటి సదు పాయాలు అందుబా టులో ఉన్నాయని పేర్కొన్నారు. అనుభవ జ్ఞులైన వైద్యులు, సాంకేతిక సిబ్బం దితో నాణ్యమైన రోగ నిర్ధారణ సేవలు అందిస్తు న్నామని వివరించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సాంకేతిక నిపుణులకు అందించడంలో ఇలాంటి జాతీయ స్థాయి సదస్సులు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. నిమ్స్ రేడియాలజీ సాంకేతిక నిపుణులు జాతీయ స్థాయిలో రాణిం చడం సంస్థకు గర్వకారణమని, ఇటీవల జాతీయ కౌన్సిల్ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీనివాస్ ఇందుకు ఉత్తమ ఉదాహరణ అని చెప్పారు. ఈ జాతీయ సదస్సులో రేడియాలజీ ఇమేజింగ్ సాం కేతిక విద్యార్థులు సమర్పించే ఉత్తమ పరిశోధన పత్రానికి ప్రొ.కాకర్ల సుబ్బారావు ఉత్తమ పరిశోధక పత్రం అవార్డు ప్రదానం చేయను న్నట్లు తెలిపారు. ఈ అవార్డు కింద నగదు బహు మతి, ప్రశంసా పత్రం అందజేయనున్నారు. అదేవి ధంగా, రేడియాలజీ సాంకేతిక, సేవల విభాగంలో ఉత్తమ సేవలు అందించిన ప్రముఖ రేడియోగ్రఫీ సాంకేతిక నిపుణులకు ప్రొ.కాకర్ల సుబ్బారావు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రతి సంవత్సరం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రొఫెసర్ కాకర్ల శత జయంతి అవార్డు 2025ను నిమ్స్ వైద్య అనుబం ధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ రేడియాలజీ ఇమేజింగ్ అండ్ థెరప్యూటిక్ టెక్నాలజీ ప్రొఫెషనల్స్ జాతీయ కౌన్సిల్ అధ్యక్షుడైన శిరందాస్ శ్రీనివాస్‌కు ప్రదానం చేయనున్నట్లు సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రా ఫర్స్ అకడమిక్ డైరెక్టర్, జ్యూరీ సభ్యుడు దామోదర నాయుడు ప్రకటించా రు. ఈ కార్యక్రమం గత 13 సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వహించబడుతోందని తెలిపారు. ఈ జాతీయ సదస్సులో దేశ నలుమూలల నుంచి రేడియాలజిస్టులు, సాంకేతిక నిపుణులు, రేడియా లజీ ఇమేజింగ్ విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ రేడియో డయాగ్నోసిస్ విభా గం సీనియర్ హెడ్ ప్రొ.డా.ఎస్.రామ్మూర్తి చీఫ్ పాట్రన్‌గా, కాకర్ల సుబ్బారావు రీసెర్చ్ ఎడ్యుకేషన్ సైన్సెస్ ట్రస్ట్(కేఆర్ఈఎస్ టీ) సభ్యులు డా.ఎన్. కవిత రెడ్డి పాట్రన్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ కార్య క్రమంలో డా.గంగాధర్, డా.పరంజ్యోతి, డా.రాహుల్ దేవరాజు పాల్గొన్నారు. ఈ సదస్సులో పాల్గొనే విద్యార్థులు, రేడియాలజిస్టులు ఫిబ్రవరి 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్(ఎస్ఐఆర్) జాతీయ ఉపాధ్యక్షులు ఎం.ఏ.వారిస్, నేషనల్ సీఎంఈ-2026 ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మహేష్ బసవేని కోరారు.

## తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఎండి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా రంగోలి, కైట్ ఫెస్టివల్

**పటాన్చెరు జనవరి 14 (జనంసాక్షి):** తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పర్వదినం అని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన రంగోలి, కైట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల ఎం డి ఆర్ ఫౌండేషన్ ను అభినందించారు. తన బాల్యంలో సంక్రాంతి వచ్చిందంటే పండగ ముందు పండగ తర్వాత గాలిపటాలు ఎగురవేస్తూ స్నేహితులతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే వారమని.. నేటితరం సెల్ ఫోన్, సోషల్ మీడియా మాయలో పడి మన సంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఎం డి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయ్ కాడి విజయ్ కుమార్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గౌతంనగర్‌లో ఘనంగా భోగి వేడుకలు



**పటాన్ చేరు, 14 జనవరి (జనంసాక్షి):** పటాన్చెరు పట్టణంలోని గౌతమ్ నగర్ ఫేస్ -2 కాలనీలో భోగి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మికంగా ఆహ్లాదకరంగా భోగి పండుగను నిర్వహించుకున్నారు. భోగి పండుగ పర్వదినాన భోగి మంటలు వేసుకొని మంగళ స్నానాలాచరించి దైవ దర్శనం చేశారు. వయోభేదం లేకుండా, చలిని లెక్కచేయకుండా భోగి మంటల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పాటలు పాడుతూ, అగ్ని దేవుడికి నమస్కరిస్తూ వాటి చుట్టూ తిరిగి పండగ నిర్వహించుకున్నారు. ఒకరికి ఒకరు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వై.రామ్మోహన్ రాజు, రాజు, తిరుపతి రెడ్డి, కోటేశ్వరరావు, శివ, భారతీయ జనతా పార్టీ, పటాన్చెరు, గౌతమ్ నగర్ 113 డివిజన్ బూత్ అధ్యక్షులు చిట్ల కుందన్ ముదిరాజ్, శివకుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. పండుగ విశిష్టతను పిల్లలకు తెలియజేస్తూ పెద్దలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రామ్మోహన్ రాజు ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు. రామ్మోహన్ రాజు, చిట్ల కుందన్ ముదిరాజ్ మాట్లాడుతూ.. మన ఊరు, మన సంప్రదాయాలు, మన సంస్కృతి- నిలువెత్తు సాక్ష్యాలు.. విశిష్టత గురించి ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అందరికి తెలిసేలా జరుపుకోవాలి. పాశ్యాత దిశకు అడుగులకు స్వస్తి పలికి హైందవ మార్గ దిశతో ముందుకు అడుగులు వేయాలి. తెలుగు వారి పండుగ విశిష్టత, తెలుగు సాంస్కృతిక చరిత్ర, భారతీయయుల సంప్రదాయ కట్టుబొట్టు అంటే కేవలం వస్త్రధారణ కాదు. అది సంస్కృతి, జీవనశైలి, భక్తికి ప్రతీక భావితరాలకు ఇలాంటి మంచి కార్యక్రమాలతోనే సాధ్యపడుతుంది.

# అంచలంచెలుగా పాఠకుల చేరువైన 'జనంసాక్షి'



**జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్**

ఎలాంటి గందరగోళానికి తావులేకుండా నిక్కచ్చి కథనాలను ప్రజలకు అందిస్తున్న పత్రిక జనంసాక్షి అని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి అన్నారు. జనంసాక్షి దినపత్రిక క్యాలెండర్‌ను వనపర్తి బ్యూరో డి మాధవరావు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తుడిమేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లా డీసీసీబీ మాజీ అధ్యక్షులు మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వారి భాగం కూడా ఎంతో విలువైనదిగా అభివర్ణించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో మంచి కథనాలను పాఠకులకు అందించాలని కోరారు. జనంసాక్షి దినపత్రిక యజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.కృష్ణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- వనపర్తి జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రముఖులు
- ఇది స్వరాష్ట్ర ఉద్యమ పత్రికగా నిలిచిందని పలువురి కితాబు



**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ**

**వనపర్తి బ్యూరో జనవరి14 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నాటి నుండి నేటి వరకు ఎన్నో వార్త కథనాలకు కేంద్ర బిందువుగా మారిన జనంసాక్షి.. ప్రజలకు ఎప్పటికప్పుడు చేరువగా నిలుస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రింట్ సహా డిజిటల్ మీడియాలోనూ విశేషంగా రాణిస్తోంది. ప్రధాన వార్తలను పతాక శీర్షికన ప్రచురిస్తూ పారదర్శక రీతిన సాగుతోంది. కాలుష్య కారక పరిశ్రమలను ప్రజలపై రుద్దకుండా ఎన్నో సందర్భాల్లో ప్రజల తరపున నిలిచింది. తన వార్తా కథనాలతో స్థానికులను చైతన్యం చేసి ఫ్యాక్టరీలను తరిమికొట్టేందుకు జనంసాక్షి తనవంతు పాత్ర పోషించింది. 'జనంసాక్షి' ప్రారంభించిన అనతికాలంలోనే రాష్ట్రస్థాయిలో ప్రభావితం చేసిన ఏకైక సంస్థగా పేరొందింది. పాలకులు ఎవరైనా ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ తెలంగాణ ప్రజల పత్రికగా అందరి మన్ననలను పొందింది.

## స్వరాష్ట్ర ఉద్యమ దినపత్రిక జనంసాక్షి : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



తెలంగాణ ఉద్యమం నాటి నుండి నేటివరకు ఎన్నో కథనాలను ప్రజలకు అందించి స్వరాష్ట్ర ఉద్యమ దినపత్రికగా జనంసాక్షి ఎదిగిందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. జనంసాక్షి దినపత్రిక 2026 క్యాలెండర్‌ను ఆయన నివాస గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనంసాక్షి దినపత్రిక ఎడిటర్ రహమాన్, వనపర్తి జిల్లా బ్యూరో మాధవరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ సర్పంచ్ గౌడ నాయక్, బీఆర్ఎస్ యూత్ నాయకులు సూర్యవంశం గిరి, డీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సునీల్ వాల్మీకి, బీఆర్ఎస్ యువ నాయకులు చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## పత్రికా విలువలు కాపాడేందుకు నడుం బిగించాలి : బీజేపీ



పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలని భారతీయ జనతా పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులు అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అనతికాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న జనంసాక్షి దినపత్రిక యజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. మంచి కథనాలను ప్రజలకు చేరవేసే క్రమంలో జనంసాక్షి మొదటి వరుసలో ఉందన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఉన్నది ఉన్నట్టుగా అందిస్తున్న పత్రికగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. పత్రికా విలువలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బిజెపి అధ్యక్షులు డి నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి ,వనపర్తి మాజీ జెడ్పీ చైర్మన్ రాకాసి లోక్నాథ్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా కోశాధికారి కుమారస్వామి, మీడియా కన్వీనర్ తిరుమలేష్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్ గౌడ్, సుగురు రాము, నాయకులు బాశెట్టి శ్రీనివాసులు, బచ్చు రామ్ పాల్గొన్నారు.

# తెలుగు పండుగలు ఎంతో గొప్పవి



**హైదరాబాద్, (జనంసాక్షి) :** తెలుగు పండుగలు ఎంతో గొప్పవని, వాటి విశిష్టత నేటితరం పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ వద్ద ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మనవళ్లు మనవరాలు, పార్టీ నాయకులు, మిత్రులతో కలిసి పతంగులను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి వచ్చిన తర్వాత మన పండుగలు జరుపుకోవడం పట్ల శ్రద్ధ చూపడం లేదని విచారం వ్యక్తం చేశారు. పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచెప్పుతాయని అన్నారు. తల్లిదండ్రులు మన పండుగల ప్రత్యేకత, విశిష్టత గురించి మీ మీ పిల్లలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, యాదవ సంఘం నాయకులు చిన శ్రీశైలం యాదవ్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ముఠా జయసింహ, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీపతి, సాదం బాల్ రాజ్ యాదవ్, మహేష్ కుమార్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కిషోర్ కుమార్, శ్రీహరి, రామ్ నివాస్ బన్సాల్, శేఖర్, ప్రేమ్, ఆనంద్ పాటిల్ ఉన్నారు.

# మా ఇల్లు ఆశ్రమం భారత్ బచావో నాయకులపై తప్పుడు కేసును ఎత్తివేయాలి




**గద్వాల నడిగడ్డ, జనవరి14 (జనంసాక్షి) :** మా ఇల్లు ఆశ్రమం భారత్ బచావో నాయకులు పై పెట్టిన తప్పుడు కేసును ఎత్తి వేయాలనీ, బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టియు ఆఫీసులో విలేకరుల సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.గాదే ఇన్నయ్య ఉప కేసు రిమాండ్ గడవు పూర్తికానున్న నేపథ్యంలో ఇన్నయ్య ఆశ్రమంలో, ఇంట్లో సోదాలు నిర్వహించి ,తనిఖీల్లో పలు కరపత్రాలు ,ఓ లాప్టాప్ ,పనిచేయని రెండు ట్యాబ్లులతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన త్యాగధనులు ,ఉద్యమకారుల చరిత్ర, రచన అనే పుస్తకాలతో పాటు, ఐటీఆర్ ఈ ఫైలింగ్ పత్రాలు ,ఆశ్రమ రసీదు పుస్తకాలు,రోజువారి ఆశ్రమ లెక్కల పుస్తకాలను,లక్ష రూపాయల నగదును సీజ్ చేశారు. ఉదయం 6:30 గంటలకు నుండి సాయంత్రం 5:30 వరకు ఎన్ ఐ ఎ అధికారులు సోదాలు చేయడం వెనక పెద్ద కుట్ర దాగి ఉందనీ, రిమాండ్ గడవు ముగింపు దశలో ఉందనీ, కోర్టులో ఎఫ్ఐఆర్ ను రిమాండ్ రిపోర్టును ఆధారాలను దాఖలు చేయాల్సి ఉంటుందవి,పెద్దగా కేసును ప్రభావితం చేయలేవనే ఫలితంగా, బెయిల్ పై వచ్చే అవకాశం ఉంటుందన్న అనుమానంతో, ఇంకా జైలులోనే భీమా కోరేగావ్ కేసు మాదిరిగా సుదీర్ఘకాలంగా నిర్బంధించాలని కుట్ర లేదా వి.ఎన్ సాయిబాబా కేసు లాగా కోర్టులో వీగిపోయే ప్రమాదం ఉంది. కనుక దీనికి కొన్ని కుట్రపరమైన సాక్షాలతో ఇన్నయ్యను జైల్లోనే తన జీవితం ముగింపు చేయాలని కుట్రలో భాగంగానే,మా ఇల్లు ,ఆశ్రమం ,ఇంట్లో సోదాలు తో కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించే వారిని, ప్రశ్నించే వారికి ఇన్నయ్య లాంటి గతి పడుతుందని భయాన్ని మేధావుల కు, ప్రజాస్వామ్య వాదులకు తెలియజేయడంలో భాగంగానే సోదాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో సంకర ప్రభాకర్ తెలంగాణ ప్రజాఫంటు రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గోపాల్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు ఎండి సుభాన్ ,ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి కార్తీక్, జోగులాంబ గద్వాల జిల్లా,టిపిఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకులు నాగన్న పాల్గొన్నారు.

# సోషల్ మీడియా ముసుగులో 'హనీ ట్రాప్'..దంపతుల అరెస్ట్

- వంద మందికి పైగా బాధితులు
- నగ్న వీడియోలతో బ్లాక్ మెయిల్ చేస్తున్న భార్యాభర్తల బాగోతం బట్టబయలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 14 (జనంసాక్షి) :** సోషల్ మీడియా వేదికగా అమాయకులను, వ్యాపారవేత్తలను ఆకర్షించి, వారితో ఏకాంతంగా గడిపిన దృశ్యాలను రికార్డు చేసి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న కిలాడీ దంపతులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన దంపతులు గత కొంతకాలంగా కరీంనగర్ రూరల్ పరిధిలోని ఆరేపల్లి 'శ్రీ సాయి నివాస' అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్నారు. భార్య తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో ఆకర్షణీయమైన ఫోటోలు పెడుతూ యువకులను, వ్యాపారస్తులను ప్రలోభపెట్టేది. ఆమెను సంప్రదించిన వారితో డబ్బులు మాట్లాడుకుని నివాసానికి పిలిపించుకునేది. ఏకాంతంగా ఉన్న సమయంలో, భర్త రహస్యంగా మొబైల్ ఫోన్లలో నగ్న వీడియోలను చిత్రీకరిం చేవాడు.

**లక్షల్లో వసూళ్లు - విలాసవంతమైన జీవితం**

ఈ వీడియోలను చూపిస్తూ బాధితులను భయపెట్టి సదరు దంపతులు భారీగా డబ్బులు వసూలు చేసేవారు. ఈ అక్రమ సంపాదనతో వారు అపార్ట్మెంట్ ఈఎంఐలు కట్టడమే కాకుండా, టాటా కారును కొనుగోలు చేశారు. తమ ఇంట్లో ఖరీదైన సోఫా సెట్లు, ఏసీలు ఏర్పాటు చేసుకుని విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఇప్పటివరకు సుమారు 100 మందిని వీరు ట్రాప్ చేసినట్లు సమాచారం.

**వెలుగులోకి తెచ్చిన బాధితుడు**

కరీంనగర్‌కు చెందిన ఒక వ్యక్తి గత ఏడాది కాలంగా వీరి వద్దకు వెళ్తున్నాడు. అతని వద్ద నుండి ఇప్పటికే సుమారు 14 లక్షల రూపాయలను వసూలు చేసిన దంపతులు, అదనంగా మరో 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, లేదంటే వీడియోలు వైరల్ చేసి చంపేస్తామని బెదిరించారు. ప్రాణభయంతో సదరు బాధితుడు మంగళవారంరోజు కరీంనగర్ రూరల్ పోలీసులకుఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది.

**పోలీసుల మెరుపు దాడి**



ఏసీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు బృందాలు గాలింపు చేపట్టాయి. బుధవారం రోజు ఉదయం 8 గంటల సమయంలో టేప్టీ వద్ద నిందితులను అదుపు లోకి తీసుకున్నారు. 24 గంటల్లోనే కేసును ఛేదిం చిన సిబ్బందిని ఏసీపీ విజయ్ కుమార్ అభినందిం చారు.

**పోలీసుల విజ్ఞప్తి**

సోషల్ మీడియాలో పరిచయం వ్యక్తుల ట్రాప్‌లో పడకూడదని, ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు.

# మరోమారు రాజ్యసభకు నో

- దిగ్విజయ్‌కు పార్టీ పరోక్ష సూచన



**భోపాల్, జనవరి14 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది. షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు.

# మహబూబ్‌నగర్, నల్గొండలు వెనకబడిన జిల్లాలు

- ఇప్పడే అభివృద్ధి దిశగా సాగుతున్నాయి
- జిల్లా పర్యటనలో పలు కార్యక్రమాలకు మంత్రుల శ్రీకారం



**మహబూబ్‌నగర్, జనవరి14 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్, నల్గొండలు వెనకబడిన జిల్లాలని.. ఇప్పుడు ఈ రెండు జిల్లాలు అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి పర్యటించారు. ఈ సందర్భంగా భూత్పూర్‌లో వివిధ అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం.. కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంత బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. నేడు రూ.60 కోట్లతో మూడు మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. అలాగే కురుమూర్తి స్వామి దేవాలయానికి ఘాట్ రోడ్డు కోసం రూ.140 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పనులు పూర్తయినట్లు బీఆర్ఎస్ చెబుతోందని.. కానీ రూ.27000 కోట్లు మాత్రమే ఎలా ఖర్చు అయిందని ఆయన ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణపై కేసీఆర్‌కు ప్రేమ లేదని.. అందుకే ఇక్కడ కేవలం మూడు సీట్లు మాత్రమే వచ్చాయని మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కలేదని విమర్శించారు. 20 రోజుల్లో మునిసిపల్ ఎన్నికలు, త్వరలో జిల్లా పరిషత్ ఎన్నికలు రాబోతున్నాయని కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. ఈ రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎప్పుడో ఒకసారి బయటకు వచ్చేవారని.. కానీ రేవంత్ రెడ్డి ఎల్లవేళలా ప్రజల్లోనే ఉంటారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టు తొందరపాటు చర్య

- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, జనవరి 14 (జనంసాక్షి) :** ఎన్టీవీలో వచ్చిన ఓ కథనంపై రేవంత్ సర్కార్ ఓవర్ రియాక్షన్ చేస్తోంది. జర్నలిస్టులపై రేవంత్ సర్కార్ ప్రతాపంపై పౌరసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తాజాగా ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టులను కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఖండించారు. అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం మంచిది కాదని హితవు పలికారు. నోటీసులు ఇచ్చి వ్యక్తిగతంగా వివరణ తీసుకుంటే బాగుండేదన్నారు. జర్నలిస్టుల అరెస్టులతో రాష్ట్రంలో యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. తెలంగాణ పోలీసుల చర్యలను ఖండిస్తున్నా.. తలుపులు బద్దలుగొట్టి దౌర్జన్యంగా బద్దలుగొట్టి ఇంట్లోకి వచ్చారు. పండగకు భార్యతో వెళ్తుండగా ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్‌ను లాక్కెళ్లడం సరికాదు. ప్రొసీజర్, నోటీసులు లేకుండానే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.




# చనిపోయిందనుకున్న బామ్మ లేచింది

- బర్త్‌డే వేడుకగా మారిన అంత్యక్రియల ఘట్టం..



**నాగపూర్, జనవరి14 (జనంసాక్షి) :** ఒక్కోసారి అనూహ్య ఘటనలె, అద్భుతాలు జరుగుతుంటాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఇలాంటి అనూహ్య ఘటన చోటుచేసుకుంది. చనిపోయిందనుకున్న బామ్మ బతికింది. అందరిలోనూ ఆశ్చర్యంతో పాటు, ఆనందం కూడా కలిగింది. అదేరోజు బామ్మ బర్త్‌డే కావడంతో చావుకు వచ్చిన వారంతా కేక్ కట్ చేసి బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే...నగరానికి చెందిన 103 ఏళ్ల వృద్ధురాలు గంగాబాయి సఖారే కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం ఆమె మరణించినట్టు కుటుంబసభ్యులు నిర్ధారించుకున్నారు. చివరి చూపు కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులంతా వచ్చారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా..వృద్ధురాలి కాలి వేలు కదలడాన్ని ఆమె మనవడు రాకేష్ సఖారే గమనించాడు. వెంటనే అక్కడి వారికి విషయం చెప్పడంతో ఆమె ముక్కులో ఉన్న దూదిని తొలగించగా వృద్ధురాలు శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. దీంతో చనిపోయిందనుకున్న గంగాబాయి బతికే ఉన్నందుకు కుటుంబసభ్యులు సంతోషపడ్డారు. వైద్యులు కూడా ఆమెను పరీక్షించి..ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడించారు. కాగా అదే రోజు గంగాబాయి 103వ పుట్టిన రోజు కూడా కావడంతో వేడుకలను కుటుంబసభ్యులు ఘనంగా జరిపారు. అంతసేపు బాధలో ఉన్న బంధువులంతా బర్త్‌డే కేక్ తిని ఆనందంగా తమ ఇళ్లకు వెళ్లారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది.

# జర్నలిస్టుల అరెస్టు దారుణం

- విచారణ జరిగే లోపే అరెస్టులు ఎందుకు?
- రేవంత్ రెడ్డిలో భయం నాటుకుందేమో?
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి14 (జనంసాక్షి) :** తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకర మన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీ శారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

# కామారెడ్డి జిల్లాలో దారుణ ఘటన

- 600 కుక్కలను హతమార్చి పాతిపెట్టిన సర్పంచ్‌లు
- జంతు ప్రేమికుల ఫిర్యాదుతో వెలికితీసి పోస్ట్‌మార్టమ్



**కామారెడ్డి, జనవరి14 (జనంసాక్షి) :** మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో గ్రామ సర్పంచ్‌లు.. సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. ఈ ఘటన సంచలనం రేపుతోంది. పాల్వంచ, ఫరీద్‌పేట, బందరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి గ్రామ పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి కుక్కలకు విష ఇంజక్షన్లు, గుళికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల మృతిపై స్టే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ.. తమకు తెలిసిన సమాచారం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించి సుమారు 5 ఊర్లలో 600 కుక్కలను విష ఇంజక్షన్లు, గుళికలతో చంపివేసి గ్రామ శివారులో పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు లభించినట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుక్కలను గ్రామాల నుంచి తరిమేస్తామంటూ కొందరు సర్పంచ్‌లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుకునేందుకు ఇలా మూగజీవులను చంపడం ఎంతవరకు సమంజసమని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. జంతువుల పట్ల ప్రేమగా ఉండాలి తప్ప.. వాటిని హతమార్చడం ఎంతవరకు సమంజసమని అనిమల్ లవర్స్ ప్రశ్నించారు. అనంతరం.. ఈ విషయమై స్థానిక మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సర్పంచ్‌లపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులైన సెక్రెటరీలు కలిసే శునకాలను చంపివేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మాచారెడ్డి ఎస్ఐ అనిల్ స్పందిస్తూ.. సదరు ఐదు గ్రామాల సర్పంచులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఓరుగల్లు కోటలో ఘనంగా భోగి మంటలు

- ఉత్సాహంగా పాల్గొన్న నగర ప్రజలు



**వరంగల్, జనవరి14 (జనంసాక్షి) :** చరిత్ర కోట గోడల మధ్య సంక్రాంతి సంబురం మొదలైంది. మంచు కురుస్తున్న వేళ, ఓరుగల్లు లోగిళ్లు భోగి మంటల సెగలతో వేడెక్కాయి. మనసులోని మాలిన్యా లను వదిలించుకోవాలనే సందేశంతో నగరవాసులు భోగి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో తెల్లవారుజామునే మహిళలు తమ ఇంటి ముందు కళ్లాపి చల్లి, అతి పెద్ద ముగ్గులను తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఖిలా వరంగల్, శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట, ఆదర్శనగర్, దూపకుంట, బొల్లికుంట, గాడిపల్లి గ్రామాలతో పాటు నగరంలోని పాతబస్తీలలో గొబ్బెమ్మల సందడి ప్రత్యేకంగా కనిపించింది. పసుపు కుంకుమలతో అలంక రించిన గొబ్బెమ్మల మీద నవధాన్యాలు చల్లి ప్రకృతిని పూజించడం విశేషం. నగరంలోని అపార్ట్‌మెంట్ కల్చర్‌లోనూ సంప్రదాయం వెల్లివిరిసింది. అపార్ట్‌మెంట్ వాసులంతా సామూహికంగా భోగి మంటలు వేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాత కాలపు ఆచారాలను నేటి తరానికి పరిచయం చేస్తూ, హరిదాసుల కీర్తనల మధ్య గడిపిన క్షణాలు అలరించాయి. ప్లాస్టిక్, టైర్ల వంటి హానికర వస్తువులను మంటల్లో వేయ కుండా, కేవలం పిడకలు, చెక్క ముక్కలతో 'పర్యావరణ హిత భోగి'ని జరుపుకోవడం విశేషం. కులమతాలకు అతీతంగా బస్తీల్లో అందరూ కలిసి భోగి మంటల దగ్గర ఆత్మీయ ఆలింగనం చేసుకొన్నారు. మకర సంక్రాంతి కోసం వరంగల్ నగర మార్కెట్లు ఇప్పటికే కిక్కిరిసిపోయాయి. అలాగే పిండి వంటల వాసనలతో ఓరుగల్లు వీధులు ఘుమఘుమలాడుతున్నాయి.




## గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్ (జనంసాక్షి):** హైదరాబాద్‌లో మరోసారి భారీ అగ్ని ప్రమాదం కలకలం రేపింది. మంగళవారం రాత్రి కూకట్‌పల్లి రాజీవ్ గాంధీ నగర్‌లోని ఓ గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్యాస్ రీఫిల్లింగ్ జరుగుతున్న సమయంలో గ్యాస్ లీక్ కావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370